ముహూర్తం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, పుష్యమాసం;
తిథి: అమావాస్య రా.1.09 వరకు,
నక్షత్రం: శ్రవణం రా. తె. 4.59 వరకు, అనంతరం
ధనిష్ట; అమృతకాలం: సా.5.40 నుండి 7.30 వరకు;
వర్జ్యం: ఉ.6.53 నుండి 8.39 వరకు;
దుర్ముహూర్తం: మ.12.24 నుండి 1.12 వరకు;
తదుపరి మ. 2.48 నుండి 3.36 వరకు;
రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు;
యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com · Journalism first!



సంపుటి: 64 • సంచిక: 21 • సోమవారం 4 ఫిబ్రవరి 2019 • విజయవాడ * పేజీలు: 22 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad



అమరావతి హైకోర్టు అద్భుతం!

సత్వర న్యాయంతోనే విశ్వసనీయత

- దేశవ్యాప్తంగా మూడు కోట్ల కేసుల పెండింగ్
- జడ్జీల పోస్టుల ఖాళీలే ప్రధాన అవరోధం
- రెండు వారాల్లోగా హైకోర్టు జడ్జీల నియామకాలు
- ఈ ఏడాదిలోగా 5 వేల జిల్లా జడ్జీలను నియమిస్తాం
- హైకోర్టు ప్రారంభోత్సవంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్

అమరావతి, ఆంధ్రప్రభ : ఆధునిక టెక్నాలజీతో తాత్కాలిక హైకోర్టును అద్భుతంగా నిర్మించారని, ఏపీకి కొత్త హైకోర్టు రావడం ప్రజలందరికీ సంతోష కరమైన విషయమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ అన్నారు. ఈ హైకోర్టు ప్రజల సంస్కృతికి, ఆనందానికి ప్రతీకగా నిలుస్తుందని, రాజ్యాంగ బద్ధమైన విధిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సకాలంలో నిర్వర్తించారని ఆయన కొనియాడారు. ఆదివారం అమరావతిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హైకోర్టును ప్రారంభించడంతోపాటు శాశ్వత హైకోర్టు భవనానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలసి జస్టిస్ గొగోయ్ శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ⇨ 5వ పేజీలో...



శాశ్వత హైకోర్టుకు భూమిపూజ

- నవ నగరాల నిర్మాణాలపై సుప్రీం సీజే గొగోయ్ ఫిదా 5లో



అనర్హులకే రుణమాఫీ

5లో

- రైతుకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు
- అన్నదాత గురించి కాంగ్రెస్‌కేం తెలుసు?
- కాశ్మీర్ పర్యటనలో ప్రధాని మోడీ

రోజుకు రూ.17 ఇస్తామని

అన్నదాతను అవమానిస్తారా?



5లో

- మేమొస్తే రైతు రుణమాఫీ
- అప్పుడే ఆర్థిక చేయూత
- కార్పొరేట్లకు కేంద్రం ఊడిగం
- బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదు
- పెరిగిపోయిన నిరుద్యోగం
- మోడీపై రాహుల్ విమర్శలు



మోడీ X దీదీ

- శారదా స్కాంతో దీదీకి చుక్కలు
- వ్యూహం రచించిన మోడీ
- కోల్‌కతా సీపీ రాజీవ్ అరెస్టుకు సీబీఐ
- ఐదుగురు సీబీఐ అధికారుల నిర్బంధం... విడుదల
- విశ్వాసపాత్రుడు రాజీవ్‌కు మద్దతుగా మమత ధర్నా

కోల్‌కతా: సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ స్కాములు పాముల్లా బుసకొడుతున్నాయి. కుంభకోణాలు హాటంబాంబుల్లా పేలుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. ప్రతిపక్షాలను మట్టికరిపించేందుకు వ్యూహాలు రచిస్తున్న వేళ.. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా వేదికగా హైడ్రామా నడిచింది. పోలీస్ వర్సెస్ సీబీఐ అన్నట్లుగా దూసుకుపోవడం.. అడ్డంగింత.. అదుపులోకి తీసుకోవడం చకచకా సాగిపోయాయి. రోజ్ వ్యాలీ, శారదా పోంజీ స్కాం కేసులను విచారిస్తున్న సీబీఐ.. ఈ కేసులకు సంబంధించిన కీలక పత్రాలు మాయమవడంతో కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌కు సమన్లు జారీ చేయడం వివాదానికి కేంద్ర ⇨ 7వ పేజీలో...



బెజవాడ దుర్గ గుడిలో నకిలీ టిక్కెట్ల దందా!

- ఒకే నెంబర్‌తో అనేక దర్శనం టిక్కెట్ల విక్రయాలు
- లక్షల రూపాయలు దండుకుంటున్నట్లు ఆరోపణలు
- దర్యాప్తునకు ఈవో కోటేశ్వరమ్మ ఆదేశాలు



అమరావతి, ఆంధ్రప్రభ : సంచలనాలకు నిలయం బెజవాడ కనకదుర్గమ్మ గుడి అన్న సంగతి అందరికీ తెలిసిందే. ఇక్కడ ఏదో ఘటన చోటుచేసుకోవడం.. అది తీవ్ర చర్చకు దారి తీస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మళ్లీ ఓ అవినీతి బాగోతం బయటకు పొక్కింది. ఇంకా జ్ఞాపికల కుంభకోణం సమసిపోకముందే మళ్లీ దుర్గమ్మ గుడిలో మరో అవినీతి కుంభకోణం వెలుగులోకి రావడం గమనార్హం. అమ్మవారి దర్శనం టిక్కెట్ల విక్రయాల్లో ఈ అవినీతి దందా కొనసాగినట్లు తెలుస్తోంది. అధికారుల ప్రాథమిక విచారణలో ఈ అవినీతి బండారం బహిర్గతమైంది. ఒకే ⇨ 5వ పేజీలో...



పరిమళించిన మానవత్వం

- నిండు గర్భిణీని కాపాడిన టీటీఐ
- రైలులోనే పురిటి నొప్పులు
- సకాలంలో వైద్యం
- తల్లీ బిడ్డా క్షేమం 8లో



ఓటర్ల లిస్టు తప్పుల తడక!

- భీమవరంలో ఓట్లు డబ్లింగ్
- ఒక్కో వార్డులో త్రిపుల్ కూడా!

భీమవరం, ప్రభన్యూస్: ఎన్నికల కమిషన్ పంపించిన తుది ఓటర్ల జాబితా తప్పుల తడకతో ఉందని ప్రధాన ప్రతిపక్షం వైఎస్ఆర్‌సీపీ ఆరోపిస్తోంది. ఈ మేరకు ఆధారాలతో సహా తప్పుల తడక ఓటర్ల జాబితాను పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మాజీ ఎంఎల్ఏ, నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ ఆదివారం విడుదల చేశారు. పట్టణంలోని ఒకటోవ వార్డు మెంటే వారితోటలో ఇంటి డోర్ నెంబర్ 5-3-67 లో ఇమ్మంది లక్ష్మీనాగ లోకేశ్వర కృష్ణసాయి పేరుతో మూడు ఓట్లు ఓటర్ల జాబితాలో ప్రచురించారు. పైగా ఈ ఓటరు ఈ ఇంటికి సంబంధించిన వ్యక్తి ఏ మాత్రం కాదు. ఈ డోర్ నెంబర్‌లో సమతం వెంకటేశ్వరరావు (తాతాజీ) అనే కుటుంబం నివాసముంటోంది. ఈ డోర్ నెంబర్‌లో వరుస సంఖ్య 245,246,247 లలో ఈ ఓటరు ఉండటంతో వెంకటేశ్వర కుటుంబ సభ్యులు విస్తుపోయారు. దీనిపై గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజక వర్గంలో సుమారు 2 లక్షల 29 వేల ఓట్లుండగా తమ పార్టీ ఓటర్ల జాబితాను ⇨ 5వ పేజీలో...



నెల్లూరు సిటీ నుంచి... మంత్రి నారాయణ పోటీ





జిల్లా కేంద్రమైన నెల్లూరు సిటీ నియోజకవర్గంలో గడిచిన 8 దశాబ్దాల కాలంలో 14 సార్లు ఎన్నికలు జరుగగా రెండుసార్లు మాత్రమే టీడీపీ విజయం సాధించింది. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న సిటీలో 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ స్థానాన్ని వైసీపీ ఆక్రమించుకుంది. ఆ ఎన్నికల్లో కూడా టీడీపీకి ఓటమి తప్పలేదు. దీంతో త్వరలో జరిగే ఎన్నికల్లో ఎలాగైనా నెల్లూరులో విజయం సాధించి తద్వారా జిల్లాపై పట్టుసాధించాలని తెలుగుదేశం భావిస్తోంది. అందులో భాగంగానే రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణను సిటీ నుంచి బరిలోకి దింపాలని ఆ పార్టీ అధినేత బాబు యోచిస్తూ ఆ దిశగా మంత్రికి సంకేతాలిచ్చారు. దీంతో ఆయన గత 6 నెలలుగా సిటీలో విస్తృతంగా పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్‌నే ఆ పార్టీ తిరిగి పోటీలోకి దింపుతోంది. దీంతో ఇద్దరూ బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులే కావడంతో జనసేన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని బరిలోకి దింపాలని భావిస్తోంది. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ తరఫున చివరి నిమిషంలో టిక్కెట్ తెచ్చుకుని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ముంగమూరు శ్రీధర్ కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం తెలిసిందే. గత రాజకీయ సమీకరణలు, సామాజికవర్గ అనుకూల వాతావరణాలను దృష్టిలో ఉంచుకుని టీడీపీ, వైసీపీలు ఇప్పటికే అభ్యర్థుల విషయంలో క్లారిటీకి వచ్చేశాయి. ఆ దిశగానే వారిని ఎన్నికలకు సిద్ధంకావాలని సూచించారు. సీఎం నారా చంద్రబాబునాయుడుకు అత్యంత సన్నిహితుడైన మంత్రి పొంగూరు సొంత జిల్లా నుంచి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి తొలిసారిగా దిగుతుండడంతో రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి నెల్లూరు పైనే ఉంది. 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తరువాత జరిగిన తొలి ఎన్నికల్లో నెల్లూరు నుంచి మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి కేవీఎస్ రెడ్డిపై సుమారు 31 వేల మెజార్టీతో విజయం సాధించారు. అదేవిధంగా 1994లో జరిగిన ఎన్నికల్లో తాళ్లపాక రమేష్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి వి ప్రసన్నకుమార్‌రెడ్డిపై సుమారు 10 వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు. కేవలం తెలుగుదేశం ఈ రెండు విజయాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

సర్వేపల్లిలో సోమిరెడ్డికి... ఈసారైనా కలిసొచ్చేనా?





గతంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన బెజవాడ గోపాల్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన సర్వేపల్లి నియోజకవర్గంలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. 2014 ఎన్నికల్లో ఆయన ఓటమి పాలైనప్పటికీ టీడీపీ అధిష్టానం ఆయన సేవలను గుర్తించి ఎమ్మెల్సీ ఇవ్వడంతో పాటు మంత్రి వర్గంలో కూడా అవకాశం కల్పించింది. అంతకుముందు జరిగిన రెండు ఎన్నికల్లోను సోమిరెడ్డి ఓటమి పాలయ్యారు. అయితే ప్రస్తుతం సర్వేపల్లిలో ఆయనకు కొంత అనుకూల వాతావరణం కనిపిస్తోంది. మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ఆయన జిల్లా కంటే కూడా సొంత నియోజకవర్గంపైనే ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో ఎప్పుడూ జరగని విధంగా అభివృద్ధి పనులు శరవేగంగా చేపడుతూ ప్రజలకు మరింత దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి విజయం సాధించడంతో పాటు త్వరలో జరిగే ఎన్నికల్లో కూడా కాకాణే తిరిగి బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అటు తెలుగుదేశం కూడా సోమిరెడ్డినే బరిలోకి దించుతోంది. దీంతో పాత కాపుల మధ్యే తిరిగి రాజకీయ యుద్ధం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండు పార్టీల మధ్య బలాబలాలు ఎలా ఉన్నా మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వైసీపీలో చేరికతో కాకాణికి మరింత బలం పెరిగినట్లయింది. టీడీపీకి కంచుకోటలా ఉన్న సర్వేపల్లిలో మాజీ మంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరికతో నియోజకవర్గంలో టీడీపీకి గడ్డు పరిస్థితి ఎదురైంది. వరుసగా రెండుసార్లు ఆయన సోమిరెడ్డిపై విజయం సాధించారు. గత ఎన్నికలకు ముందు ఆదాల కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీడీపీలో చేరారు. అయినా సర్వేపల్లిలో మాత్రం టీడీపీకి ఓటమి తప్పలేదు. 1955 నుంచి సర్వేపల్లిలో 14 సార్లు జరిగిన ఎన్నికల్లో టీడీపీ అత్యధికంగా 4 సార్లు విజయం సాధించింది. 7 సార్లు కాంగ్రెస్, ఒకసారి ఇండిపెండెంట్, మరోసారి సీపీఐ, ఓసారి వైసీపీలు విజయం సాధించాయి. ప్రస్తుత మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇప్పటివరకు సర్వేపల్లి నుంచి 5 సార్లు పోటీ చేసి రెండుసార్లు విజయం సాధించి మూడుసార్లు ఓటమి పాలయ్యారు.

సింహపురిలో సైకిల్ జోరు పెరిగేనా..!

బాబు వ్యూహం... ఫలించేనా?


- ఫ్యాను గాలిని అడ్డుకునేందుకు... టీడీపీ సరికొత్త ఎత్తు
- నెల్లూరు జిల్లాలో మారుతున్న రాజకీయ సమీకరణలు



నెల్లూరు, ఫిబ్రవరి 3 (ప్రభ న్యూస్ బ్యూరో): రాజకీయ చైతన్యానికి వేదికైన సింహపురిలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రధాన పార్టీల మధ్య రసవత్తరమైన పోరు సాగనుంది. ఇప్పటికే అధికార తెలుగుదేశం పార్టీతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన వైకాపా, కొత్తగా ఆవిర్భవించిన జనసేన పార్టీలు తమతమ రాజకీయ కార్యకలాపాలను వేగవంతం చేస్తున్నాయి. ఇటు రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలతో పాటు అటు కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ, కేంద్రంలో ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న మరో జాతీయ పార్టీ కాంగ్రెస్ కూడా త్వరలో జరిగే ఎన్నికల్లో జిల్లాలోని 10 నియోజకవర్గాలతో పాటు నెల్లూరు పార్లమెంట్ స్థానం నుంచి కూడా బలమైన అభ్యర్థులను బరిలోకి దింపాలని కసరత్తు చేస్తున్నాయి. ప్రధానంగా తెలుగుదేశం, వైకాపా పార్టీల మధ్యే జిల్లాలో పోటీ అవకాశం ఉండడంతో ఆ పార్టీల నుంచి టిక్కెట్లు ఆశిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో వైసీపీ హవా సాగింది. ఆ ఎన్నికల్లో 7 స్థానాల్లో వైసీపీ విజయకేతనం ఎగురవేయగా, టీడీపీ 3 స్థానాలకే పరిమితమైంది. నెల్లూరు లోక్‌సభ స్థానం కూడా వైసీపీ ఖాతాలోకే వేసుకుంది. అయితే ప్రస్తుతం జరగబోతున్న ఎన్నికల్లో ఎలాగైనా జిల్లాపై పట్టుసాధించి మెజార్టీ స్థానాలు దక్కించుకోవాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. అందుకోసం బలమైన అభ్యర్థులను రంగంలోకి దించి ఫ్యాను గాలిని అడ్డుకోవాలని రాజకీయ ఎత్తుగడలతో ముందడుగు వేస్తున్నారు. ప్రధానంగా గత రెండు దఫాలుగా నెల్లూరు లోక్‌సభ స్థానంపై టీడీపీ ఆశలు పెట్టుకోవడమే తప్ప గెలిచిన సందర్భాలే లేవు. ప్రస్తుత ఎన్నికల్లోనైనా కీలకమైన ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుని వాటి పరిధిలో ఉన్న అసెంబ్లీ స్థానాలను సొంతం చేసుకోవాలన్న పట్టుదలతో అధికారపక్షం అభివృద్ధే ప్రధాన అజెండాగా ప్రజల్లోకి వెళ్తోంది. గడిచిన ఐదేళ్లలో టీడీపీ చేసిన అక్రమాలను ప్రజలకు వివరిస్తూ జిల్లాలో జరిగిన అనేక అవినీతి అక్రమాలను ప్రజలకు వివరిస్తూ అధికార పార్టీపై మరోసారి పైచేయి సాధించాలన్న వ్యూహంతో వైసీపీ ఆ దిశగా ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతోంది. జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో దాదాపుగా వైసీపీకి సంబంధించి అభ్యర్థుల ఎంపిక ఖరారైనట్లు తెలుస్తోంది. వారం పది రోజుల్లో 8 నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థులను వైసీపీ అధికారికంగా ప్రకటించనుంది. టీడీపీ కూడా దాదాపుగా పలు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు పూర్తి చేసినప్పటికీ పలు నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలపై పూర్తిగా వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో సర్వేల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసే దిశగా అధికార పార్టీ అగ్రనాయకత్వం అడుగులు వేస్తోంది. ఏదిఏమైనా రెండు పార్టీలకు సంబంధించి ఫిబ్రవరి నెలాఖరులోపు పోటీలో ఉండే అభ్యర్థుల పేర్లు అధికారికంగా ఖ రారు చేసే అవకాశం ఉండడంతో ఆయా పార్టీల నుంచి టిక్కెట్లు ఆశిస్తున్న వారు తమ ప్రయత్నాలు మరింత వేగవంతం చేస్తున్నారు. దీంతో జిల్లా రాజకీయం ఒక్కసారిగా వేడెక్కినట్లయింది.



గూడూరులో... గెలుపెవరిదో?






మైకా గనులకు, సిలికాకు ప్రసిద్ధి గాంచిన గూడూరు నియోజకవర్గంలో గత 8 దశాబ్దాల కాలంలో 14 సార్లు ఎన్నికలు జరుగగా టీడీపీ ఆవిర్భావానికి ముందు వరకు కాంగ్రెస్ హవా, ఆ తరువాత టీడీపీ హవా కొనసాగుతూ వస్తోంది. 2014లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన పాశం సునీల్‌కుమార్ విజయం సాధించి అనంతరం మారిన రాజకీయ సమీకరణలతో ఆయన సైకిలెక్కారు. ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో ఆయనే టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తారని ప్రచారం జరుగుతున్నప్పటికీ ఆ టిక్కెట్‌ను మరికొంతమంది ఆశిస్తున్నారు. సునీల్ కంటే బలమైన నాయకులు టీడీపీలో లేనప్పటికీ అధిష్టానం మాత్రం అభ్యర్థి ఎంపిక విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది. మాజీ మంత్రి బల్లి దుర్గాప్రసాద్ నుంచి సునీల్‌కు తీవ్ర పోటీ వ్యక్తమవుతోంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ టిక్కెట్‌ను బల్లి ఆశిస్తూ ఆ దిశగా పావులు కదుపుతున్నారు. వైసీపీ మాత్రం త్వరలో జరిగే ఎన్నికల్లో తమ స్థానాన్ని తిరిగి ఎలాగైనా సొంతం చేసుకోవాలని, పార్టీకి వెన్నుపోటు పొడిచి సైకిలెక్కిన సునీల్‌పై తగిన ప్రతీకారం తీర్చుకోవాలని జగన్ బలమైన అభ్యర్థిని రంగంలోకి దించేందుకు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగానే గత మూడు సంవత్సరాలుగా నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న మేరిగ మురళి, వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన బత్తిని విజయకుమార్, వీరి చలపతిల పేర్లను పరిశీలిస్తోంది. మరోవైపు గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా చివరి నిమిషంలో టిక్కెట్ తెచ్చుకుని పోటీ చేసి ఓటమి పాలైన డాక్టర్ జ్యోత్స్నలత కూడా వైసీపీ టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

నెల్లూరు గ్రామీణంలో... టీడీపీకి అభ్యర్థి ఎవరు?




నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో ఆవిర్భవించిన నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో టీడీపీ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. అందుకు ప్రధాన కారణాలు లేకపోలేదు. 2009, 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ పొత్తుల్లో భాగంగా పై స్థానాన్ని మిత్రపక్షాలకు కేటాయించింది. దీంతో 2009లో స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించగా, గత ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గెలుపొందారు. దీంతో ఈ నియోజకవర్గంలో టీడీపీకి బలమైన ప్రాతినిధ్యం లేకుండాపోయింది. త్వరలో జరిగే ఎన్నికల్లో ఎలాగైనా గ్రామీణ నియోజకవర్గాన్ని కైవసం చేసుకోవాలని అధికార పార్టీ యోచిస్తూ ఆ దిశగా మాజీ మంత్రి, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి రూరల్ పగ్గాలను కట్టబెట్టింది. అయితే ఆయన ఆ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. పైపెచ్చు గడిచిన 5 సంవత్సరాలుగా సిట్టింగ్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గంలో వైసీపీ బలాన్ని మరింత పెంచారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సొంత నిధులు సైతం వెచ్చించి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 366 రోజుల ప్రజాహిత పాదయాత్ర, మరో ఏడాది కాలం పాటు గడపగడపకు వైసీపీ అంటూ గడిచిన రెండు సంవత్సరాల కాలంగా పూర్తికాలం ప్రజలతోనే మమేకమవుతూ నియోజకవర్గంలో వైసీపీని మరింత బలోపేతం చేశారు. ఇప్పటివరకు అధికార టీడీపీకి సంబంధించి ఎవరు పోటీ చేస్తారన్నది స్పష్టంగా తెలియకపోవడంతో ఇటు పార్టీ క్యాడర్‌లోను కొంత అయోమయ పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతానికి మేయర్ అబ్దుల్ అజీజ్, టీడీపీలో అందరివాడిగా గుర్తింపు తెచ్చుకున్న మరో సీనియర్ నేత పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డిల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. తాజాగా ప్రముఖ వ్యాపార సంఘ నాయకుడు, రాష్ట్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి పేర్లు కూడా తెరపైకి వచ్చింది. వీరితో పాటు ఆనం సోదరుల్లో ఒకరైన ఆనం జయకుమార్‌రెడ్డి పేరును కూడా టీడీపీ అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీ అభ్యర్థిని ధీటుగా ఎదుర్కొనే నేతను రంగంలోకి దించాలని టీడీపీ కసరత్తు చేస్తోంది. అయితే నెల్లూరు నగరం కొంతభాగం కలిసున్న గ్రామీణ నియోజకవర్గంపై జనసేన కూడా కన్నేసింది. బలమైన అభ్యర్థిని బరిలోకి దించడం ద్వారా తమకు అనుకూలమైన వాతావరణం ఉంటుందన్న ఆలోచనతో ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ గ్రామీణంపై కూడా గురిపెట్టినట్లు తెలుస్తోంది.


వెంకటగిరిలో... పాగా వేసేదెవరో?






కాంగ్రెస్ రాజకీయాల్లో రాష్ట్ర స్థాయిలో తనకంటూ ఒకవర్గాన్ని కలిగిన స్వర్గీయ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన వెంకటగిరి నియోజకవర్గంలో మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రాకతో సమీకరణలు ఒక్కసారిగా మారిపోయాయి. గత ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన కురుగొండ్ల రామకృష్ణ వరుసగా రెండోసారి కూడా విజయం సాధించి వెంకటగిరి కోటపై టీడీపీకి ఎదురులేదని నిరూపించారు. టీడీపీ ఆవిర్భావం తరువాత జరిగిన ఎన్నికల్లో గతంతో పోలిస్తే కాంగ్రెస్ కంటే టీడీపీయే ఎక్కువసార్లు విజయం సాధించింది. 2014 ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రస్తుతం వైసీపీలో చేరడం, తాజాగా వెంకటగిరి పగ్గాలను మాజీ మంత్రి ఆనంకు కట్టబెట్టడంతో నియోజకవర్గంలో వైసీపీ బలం మరింత పెరిగినట్లయింది. సిట్టింగ్ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వ్యవహార శైలిపై స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద తిరుగుబాటు చేస్తూ అధిష్టానానికి ఫిర్యాదు చేసింది. అయినా వారి వివాదాలను సర్దుబాటు చేసేందుకు అధిష్టానం దృష్టి సారించకపోవడంతో ఆమె వైసీపీ వైపు మొగ్గుచూపుతున్నారు. ఇలా సిట్టింగ్ ఎమ్మెల్యే పనితీరుపై విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అధిష్టానం మాత్రం మరోసారి రామకృష్ణకే అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. వైసీపీ నుంచి మాత్రం ఆనం బరిలోకి దిగే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో రామకృష్ణ, రామనారాయణరెడ్డిల మధ్య పోరుసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కాక పుట్టిస్తున్న.. కావలి






1952లో ఏర్పడిన కావలి నియోజకవర్గంలో ఇప్పటివరకు ఒక ఉపఎన్నికతో సహా 15 సార్లు జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా కాంగ్రెసే విజయం సాధించింది. టీడీపీ కేవలం 3 సార్లు మాత్రమే గెలుపొందింది. 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన బీద మస్తాన్‌రావు ఓటమి పాలయ్యారు. వైసీపీ నుంచి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విజయం సాధించినప్పటికీ గత ఎన్నికల్లో ఆయన గెలుపుకు సహకరించిన మాజీ ఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఒంటేరు వేణుగోపాల్‌రెడ్డిలు ప్రస్తుతం ఆయనను వ్యతిరేకిస్తున్నారు. ఇదే సందర్భంలో బీద మస్తాన్‌రావుపై కూడా టీడీపీకి చెందిన కొంతమంది నాయకులు అధిష్టానానికి ఫిర్యాదు చేసి వచ్చే ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ ఇవ్వొద్దంటూ కూడా అడ్డుకుంటున్నారు. అయితే కావలిలో ఉన్న ప్రత్యేకమైన పరిస్థితుల నేపథ్యంలో టీడీపీ బీద వైపే మొగ్గుచూపుతోంది. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డినే బరిలోకి దించాలని నిర్ణయం తీసుకుంది. అదే జరిగితే పాత కాపుల మధ్యే తిరిగి రసవత్తర పోరు సాగే అవకాశం ఉంది. అయితే వైసీపీకి రెబల్స్ పోరు తప్పేట్టు కనిపించడం లేదు. విష్ణువర్ధన్‌రెడ్డి ఇప్పటికే తాము పోటీ చేయబోతున్నానని బ్యాలెట్ లో తన పేరు ఉంటుందని స్పష్టమైన ప్రకటన కూడా చేయడాన్ని బట్టి చూస్తుంటే వైసీపీ ఓట్లు చీలే అవకాశం కనిపిస్తోంది. అదే జరిగితే టీడీపీకి అనుకూల వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది.

కోవూరులో సై అంటే సై!






నల్లపరెడ్డి కుటుంబీకులు అత్యధికసార్లు గెలుపొందిన కోవూరు నియోజకవర్గంలో ప్రజల తీర్పు ప్రతి ఎన్నికల్లోను విభిన్నంగా కనిపిస్తోంది. 2014 ఎన్నికల్లో టీడీపీ, వైసీపీలకు సంబంధించి పాత మిత్రుల మధ్యే రసవత్తర పోరు జరిగింది. త్వరలో జరిగే ఎన్నికల్లో పాత కాపులే తిరిగి పోటీ పడతారా.. లేక కొత్తవారికి అవకాశమిస్తారా అనేది స్పష్టంగా ఇప్పటివరకు తెలియనప్పటికీ టీడీపీలో మాత్రం మార్పులు తప్పవంటూ ప్రచారం సాగుతోంది. గత ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి టీడీపీ అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. 2009 సాధారణ ఎన్నికలతో పాటు 2012లో జరిగిన ఉపఎన్నికల్లో ప్రసన్నకుమార్‌రెడ్డి వరుసగా విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రసన్న ఓటమి పాలయ్యారు. 1962 నుంచి ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా నల్లపరెడ్డి కుటుంబీకులే విజయం సాధిస్తూ వచ్చారు. 1962 నుంచి 1978 వరకు వరుసగా 4 సార్లు కాంగ్రెస్ విజయం సాధించగా, 1983 నుంచి మూడుసార్లు మినహా ఇస్తే 2009 వరకు 8 సార్లు అత్యధికంగా నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆయన కుమారుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలే విజయం సాధించి కోవూరుపై రికార్డు సృష్టించారు. ఒక్కమాటలో చెప్పాలంటే నల్లపరెడ్డిలకు కోవూరు కంచుకోట. అయితే 2009 ఎన్నికల్లో టీడీపీ నుంచి విజయం సాధించిన ప్రసన్న ఆ తరువాత మారిన రాజకీయ సమీకరణలతో వైసీపీ వైపు మొగ్గుచూపారు. ఈ నేపథ్యంలోనే 2011లో ఆయన టీడీపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో 2012లో ఆ స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లో ఆయన వైసీపీ నుంచి పోటీ చేసి అప్పటి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై విజయం సాధించి కోవూరులో తమకు తిరుగులేదని నిరూపించుకున్నారు. అయితే 2014లో జరిగిన ఎన్నికల్లో అప్పటివరకు కాంగ్రెస్‌లో ఉండి చివరి నిమిషంలో టీడీపీ టిక్కెట్ తెచ్చుకున్న పోలంరెడ్డి చేతిలో ప్రసన్నకుమార్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. అయినా నియోజకవర్గంపై పట్టుకోసం వ్యూహాత్మకంగా పావులు కదుపుతూ గడిచిన 5 సంవత్సరాల కాలంగా నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను వేగవంతంగా నిర్వహిస్తూ టీడీపీని ఎదుర్కొనేందుకు మరోసారి సిద్ధంగా ఉన్నారు. అయితే టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే పోలంరెడ్డిపై మాత్రం సొంత పార్టీ నేతల నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆయనకు టిక్కెట్ ఇవ్వొద్దంటూ ఇప్పటికే కోవూరుకు చెందిన పలువురు నేతలు సీఎంను కలిసి ఫిర్యాదు కూడా చేశారు. వైసీపీ నుంచి దాదాపుగా ప్రసన్నే తిరిగి బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తుండగా టీడీపీ నుంచి మాత్రం పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డిలు టిక్కెట్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. మరి అధిష్టానం ఎవరి వైపు మొగ్గుచూపుతుందో వేచిచూడాల్సి ఉంది.

ఆత్మకూరులో అందలమెక్కేదెవరో?





జిల్లా రాజకీయాల్లోనే ఆత్మ కూరు నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. ఆనం కుటుంబీకులతో పాటు బొమ్మిరెడ్డి ఫ్యామిలీ అత్యధికంగా ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గంగా పేరు తెచ్చుకున్న ఆత్మకూరులో భారతీయ జనతా పార్టీలో జాతీయ నేతగా గుర్తింపు తెచ్చుకున్న ప్రస్తుత ఉపరాష్ట్రపతిని ఓ డించిన నియోజకవర్గం కూడా ఇదే. 1952 నుంచి ఒక ఉపఎన్నికతో సహా 15 సార్లు జరిగిన ఎన్నికల్లో అత్యధికసార్లు కాంగ్రెసే విజయం సాధించింది. టీడీపీ కేవలం రెండు సార్లు మాత్రమే గెలుపొందింది. గత ఎన్నికల్లో వైసీపీ ఈ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన కన్నబాబు ఓటమి పాలుకాగా వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన మేకపాటి గౌతమ్‌రెడ్డి గెలుపొందారు. ఇదే ఎన్నికల్లో మాజీ ఆర్థిక మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం వైసీపీకి ఆయన ఇక్కడ అదనపు బలంగా మారడంతో త్వరలో జరిగే ఎన్నికల్లో కూడా వైసీపీకి అనుకూల వాతావరణం కనిపిస్తోంది. వైసీపీ హవాను అడ్డుకునేందుకు టీడీపీ వ్యూహాత్మకంగా 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి 2 వేల ఓట్ల మెజార్టీతో అప్పటి టీడీపీ అభ్యర్థి కొమ్మి లక్ష్మయ్యనాయుడుపై విజయం సాధించిన బొల్లినేని కృష్ణయ్యను బరిలోకి దించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు యోచిస్తూ ఆయనకు నియోజకవర్గ పగ్గాలు కట్టబెట్టారు. దీంతో సమీకరణలు ఒక్కసారిగా మారిపోయాయి. ఆయనకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడుతో పాటు జిల్లా పరిషత్ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి కూడా ప్రచారం చేస్తుండడంతో టీడీపీకి కొంతబలం పెరిగినట్లయింది. దాదాపుగా బొల్లినేని, గౌతమ్‌రెడ్డిల మధ్యే పోటీ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి అదే జరిగితే వారిద్దరిలో అందలమెక్కేదెవరో.. ఆత్మకూరు ప్రజలు ఎవరికి పట్టాలు కడుతారో వేచి చూడాల్సి ఉంది.

ఉదయగిరిలో... ఉదయించేదెవరో?






ప్రస్తుత భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన ఉదయగిరి నియోజకవర్గంలో 1952 నుంచి జరిగిన 14 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీయే అత్యధికంగా విజయం సాధించింది. టీడీపీ ముచ్చటగా మూడుసార్లు గెలుపొందింది. గత ఎన్నికల్లో వైసీపీ, టీడీపీల మధ్య జరిగిన రసవత్తర పోరులో టీడీపీ అభ్యర్థి బొల్లినేని వెంకటరామారావు విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి హ్యాట్రిక్ విజయాన్ని చేజార్చుకున్నారు. ప్రస్తుతం వారిద్దరి మధ్యే తిరిగి పోరు జరిగే అవకాశాలు కనిపిస్తున్నప్పటికీ టీడీపీ నుంచి మాత్రం టిక్కెట్ ఆశించే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేకే టిక్కెట్ ఇవ్వాలని టీడీపీ అధిష్టానం యోచిస్తున్నప్పటికీ సామాజిక వర్గాల సమీకరణల్లో భాగంగా రెడ్డీ సామాజికవర్గం నుంచి మాత్రం పోటీ తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో టీడీపీ అధిష్టానం ఆ సామాజిక వర్గానికి చెందిన కావ్య కృష్ణారెడ్డి, మెట్టుకూరు ధనుంజయరెడ్డిల పేర్లను పరిశీలిస్తోంది. కొత్తవారికి అవకాశం ఇస్తారా.. లేదా అనేది స్పష్టంగా అర్థం కానప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యే పనితీరు గతంతో పోలిస్తే చాలావరకు మెరుగుపడిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడే ఇటీవల ఆయనకు అభినందనలు కూడా తెలిపారు. వైసీపీ నుంచి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పేరే ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ ఆయనకు టిక్కెట్ ఇవ్వొద్దంటూ నియోజకవర్గ పరిధిలోని కొంతమంది పనికట్టుకుని జగన్‌కు ఫిర్యాదు చేశారు. అయితే జిల్లాలో నెలకొని ఉన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో వైసీపీ మేకపాటి వైపే మొగ్గుచూపుతోంది. టీడీపీ విషయంలో కూడా అధిష్టానం బొల్లినేనికి కొంత క్లారిటీ ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. అయితే కాంగ్రెస్ నుంచి మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ ఇక్కడి నుండి బరిలోకి దిగుతుండడం, గడిచిన 5 సంవత్సరాల కాలంగా ఆయన నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను జోరుగా నిర్వహిస్తూ వస్తున్నారు. దీంతో ఈ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

సూళ్లూరుపేటలో... ఎవరిదో జెండా!





తిరుపతి పార్ల మెంట్ పరిధిలో కీలక మైన సూళ్లూరుపేట నియో జకవర్గం లో టీడీపీ ఆవిర్భావం నుంచి అత్య ధికసార్లు ఆ పార్టీ అభ్యర్థులే విజయం సాధిస్తూ వస్తున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి పరసా వెంకటరత్నం వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య చేతిలో ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేనే బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తుండగా టీడీపీలో మాత్రం ఎవరు పోటీలో ఉంటారనేది స్పష్టంగా అర్థం కావడం లేదు. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పరసా వెంకటరత్నం వ్యవహార శైలిపై సొంత పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెండు బలమైన సామాజిక వర్గాలకు చెందిన నాయకులు సైతం పరసా వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తు న్నారు. ఇదే సందర్భంలో టీడీపీ టిక్కెట్‌ను మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, మరి కొంతమంది నాయకులు ఆశిస్తుండడంతో పరసాకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో పరసా రత్నం సూళ్లూరుపేట నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ఓసారి చంద్ర బాబు కేబినేట్‌లో మంత్రిగా కూడా పనిచేశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తిరిగి ఆయనకే అవకాశమిస్తారా.. లేక కొత్తవారిని బరిలోకి దించుతారా అనేది వేచి చూడాల్సి ఉంది. టీడీపీకి కంచుకోటగా ఉన్న పేటలో పచ్చజెండా ఎగురుతుందా.. లేక ఫ్యాను గాలి వీస్తుందా వేచి చూడాల్సి ఉంది.

ఎవరికో కల్యాణ మాల!

- దుర్గం ఎన్నికల సంగ్రామం
- 2009 వరకు దళిత ప్రజాప్రతినిధులు



కళ్యాణదుర్గం,ప్రభన్యూస్ : కళ్యాణ దుర్గం నియోజకవర్గం ఏర్పడిన నాటికి ఈ నియోజకవర్గం ఎస్సీ సామాజికవర్గానికి రిజర్వు చేయబడివుంది. ఇందులో బాగంగా మహాత్మగాంధీతో సంబందం కల్గివుండి ఈ ప్రాంతంలో సత్యాగ్రహం ఉద్యమం చేసి, స్వాతంత్ర్య సమరయోదుడిగా ఖ్యాతి గడించిన హిందీ నర్సప్ప మొదటి శాసన సభ్యుడిగా ఎన్నికయ్యారు.ఆయన ఐదేళ్ల పదవీకాలం ముగిశాక కంబ దూరు శాంతప్ప ఎమ్మెల్యేగా కొనసాగారు. శాంతప్ప అనంతరం టిసి మారెప్ప ఎమ్మెల్యే కాగలిగారు. ఈ విధంగా వరుసగా ఆరుగురు ఎమ్మెల్యేలు ఈ నియోజకవర్గంలో పదవులు పొందినా వర్ణ, వివక్ష, కొనసాగుతూనే వచ్చింది. 1989లో కంబదూరుల విడిఓగా పనిచేస్తున్న ఎం. లక్ష్మీదేవి రాజకీయ రంగప్రవేశం చేయడంతో రాజకీయాలు వేడెక్కాయి, అబివృద్ధికి బీజం పడింది, ఆమె మొదటి సారి ఎమ్మెల్యేకాగానే నాటి దివంగత ప్రదాని ఇందిరా గాందీ ఆమె ప్రతిభను గుర్తించి మంత్రి వర్గంలో చోటు కల్పించారు. ఆమె పట్టుదలతో నియోజకవర్గాన్ని అంచెలంచెలుగా అబివృద్ది చేశారు. మొట్ట మొదటి సారి నియోజకవర్గానికి విద్యుత్ సౌకర్యం కల్పించిన ఘనత ఆమెకు దక్కింది. 1984లో లక్ష్మీదేవమ్మపై టిడిపి అభ్యర్ధి బిసి గోవిందప్ప పోటీ చేసి విజయం సాదించారు. 1989లో లక్ష్మీదేవితో టిడిపి, సిపిఐ ఉమ్మడి అబ్యర్ధి సంజీవప్ప పోటీపడి ఓడిపోయారు. మరోసారి లక్ష్మీదేవికి మంత్రి వర్గంలో చోటు దక్కింది. 1994లో బిసి గోవిందప్ప మరోసారి కాంగ్రెస్ అబ్యర్ధి ఉమాదేవితో పోటీ చేసి విజయం సాధించారు.1999 టిడిపి తరుపున శారదాంబ , కాంగ్రెస్ అబ్యర్ధిగా లక్ష్మీదేవమ్మ కుమారుడు బికె .శివాజీ పోటీపడగా శారదాంబ విజయం సాదించారు. 2004లో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థి ఉమాదేవితో టిడిపి అభ్యర్థిగా బిసి గోవిందప్ప పోటీ పడి విజయం సాధించారు. 2014 అసెంబ్లీ ఎన్నికలలో వైకాపా, టిడిపిలు బలంగా ఢీకొన్నాయి. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా 20004 ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయిన ఉన్నం హనుమంతరాయ చౌదరి నిలబడగా వైకాపా అభ్యర్థిగా అంతవరకు కాంగ్రెస్‌లో వున్న బోయ తిప్పేస్వామి పోటీలో నిలబడ్డారు.పార్టీలోని చౌదరి క్యాడర్ వచ్చే ఎన్నికలలో ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తోంది. నియోజకవర్గంలో టిడిపి, వైయస్ఆర్ కాంగ్రెస్ ప్రధానంగా పోటీపడుతున్నాయి.కులాలవారిగా బోయ (వాల్మీకి) కులం ఓటర్లు మొదటి స్థానంలో, ద్వితీయ స్థానంలో ఎస్సీలు, తృతీయ స్థానంలో గొల్ల, కురుబ, ఇతర కులాలున్నాయి. ఇక్కడ ఏ ఎన్నికలు జరిగినా ఆయా పార్టీల అభ్యర్థుల జయాపజయాలు బోయ సామాజిక వర్గం వారే ప్రబావితం చేయనున్నారు. టిడిపి అభ్యర్థిగా ఉన్నం హనుమంతరాయ చౌదరి,ఉన్నం మారుతీ చౌదరి. ఉమా మహేశ్వరనాయుడు, కంబదూరు రామ్మోహన్ చౌదరి, మోరేపల్లి మల్లిఖార్జున. అమిలినేని సురేంద్రబాబు, తదితరులు పోటీపడుతున్నారు.వైయస్ఆర్‌సిపి విషయానికొస్తే నాలుగేళ్లుగా తనకు టికెట్ గ్యారెంటీ అని నమ్ముకున్న ఉషా శ్రీచరణ్, నియోజకవర్గంలో అడపాదడపా సామాజిక సేవా కార్య క్రమాలు నిర్వహిస్తూ పార్టీ కార్య క్రమాలలో చురుగ్గాపాల్గొంటున్న జితేంద్రగౌడు, గనులు, భూగర్భ జనుల శాఖ ప్రభుత్వ ఉద్యోగి రాజశేఖర్ , తదితరులు టికెట్‌ను ఆశిస్తున్నారు. కాగా పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి నేనున్నానంటూ కేవలం ఏడాదికాలం నుంచి జనంలో కలుస్తూ పార్టీ కార్య క్రమాల పేరుతో పాత కాపులను దగ్గరికి తీసుకునే ప్రయత్నం గట్టిగా చేస్తున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికలలో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా మార్కెట్ రామన్న రంగంలో వుండి వైకాపా ఓట్లను చీల్చడంతో టిడిపి అభ్యర్థి గెలుపు నల్లేరుపై బండి నడక చందంగా సాగిపోయింది.









ఎత్తుల జిత్తుల్లో అనంతం

కురుబలే కీలకం

- రాష్ట్ర రాజకీయాల్లోనే అనంత ప్రత్యేకం
- 2019 ఎన్నికలు అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకం
- గెలుపుపై అన్ని పార్టీల్లోనూ ఆరాటం





అనంతపురం సిటీ, ప్రభన్యూస్ : రాష్ట్ర రాజకీయాల్లోనే అనంత రాజకీయానికి పెట్టింది పేరు. ప్రస్తుతం జిల్లా తెలుగుదేశంపార్టీకి కంచు కోటలా నిలిచింది. 2019ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు గెలుపు దిశగా శాయశక్తులా కృషిచేస్తున్నాయి. ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ నానా తంటాలు పడుతున్నాయి. అది నుంచి కాంగ్రెస్‌పార్టీ చక్రం తిప్పేది. నందమూరి కుటుంబం ఈ జిల్లాలో అడుగుపెట్టిన అనంతరం ఎన్టీఆర్ గెలుపుతోనే ఈ జిల్లా పునాది రాయి లా మారింది. అయినా జిల్లా కేంద్రంలో పట్టు సాధించ లేకపోయింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం ఈ జిల్లాలో చతుర్ముఖ పోటీ నెలకొంది.

2004లో వైఎస్ఆర్ పాదయాత్రతో కాంగ్రెస్ వరిమించి. తరువాత అనేక మార్పులు చేర్పులు లోనై 2009 నాటికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అప్పుడు ప్రజారాజ్యం గాలి వీస్తున్నా కాంగ్రెస్‌పార్టీ గెలుపు గుర్రాన్ని అధి రోహించింది. తరువాతి కాలంలో వైఎస్‌ఆర్ హఠాన్మరణం, రాష్ట్రం విభజన తో అనంతపురం జిల్లాలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. 2014 ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌కాంగ్రెస్‌పార్టీ తెలుగుదేశం పార్టీకి భారీ పోటీనిచ్చింది. అయినా అనంత పురం అర్బన్ పరిధిలో ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి గెలుపొందారు. 2019 ఎన్నికలు మరీ రసవత్తరం గా మారను. ఈసారి బరిలోకి జనసేన పార్టీ దిగడంతో అనంతపురంలో త్రిముఖ పోటీ నెలకొను కుంది. కాంగ్రెస్‌పార్టీ బరిలో ఉన్నా టీడీపీ, వైకాపా, జనసేన మధ్యనే పోటీ తీవ్రంగా ఉండనుంది.

అనంతపురం అర్బన్ పరిధిలో సుమారు 2.20లక్షల ఓట్లు ఉన్నాయి. ఇందులో 1,12లక్షల ఓట్లు మహిళలు ఉండగా, పురుష ఓటర్ల కంటే 2వేల ఓట్లు మహిళా ఓటర్లు అధికంగా ఉండడం విశేషం. అనంతపురం అర్బన్ పరిధిలో సుమారు 40వేల ఓట్లు బలిజలకు ఉండగా, దీనికి కొంచెం ఎక్కువ తక్కువగా ముస్లిం, మైనార్టీ ఓట్లు ఉన్నాయి. అదేవిధంగా కురుబలు మూడవ స్థానంలో ఉండి గెలుపోటములను నిర్ధారించే స్థాయిలో ఉన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా ఉండగా, టీడీపీ, జనసేన, వైకాపాల మధ్యనే తీవ్ర పోటీ ఉండనుంది.


2019 ఎన్నికల్లో అనంతపురం అర్బన్ పరిధిలో టీడీపీ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరితోపాటు మేయర్ స్వరూప, ప్రముఖ కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబు, మాజీ టౌన్‌బ్యాంక్ అధ్యక్షుడు గుజరీ వెంకటేష్ కువారుడుతో పాటు జేసీ సోదరులు కూడా అనంత పురం అర్బన్‌లో తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అదేవిధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ నుంచి అనేక మంది ఆశావాహులు ఉండగా, అందులో మాజీ ఎంపీ అనంత వెంకటరామి రెడ్డి, సీనియర్‌నేత చవ్వా రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ రెడ్డి, మహాలక్ష్మి శ్రీనివాస్, ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి కుమారుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, వైవి.శివారెడ్డితోపాటు పలువురు పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ నుంచి పార్లమెంట్ స్థానానికి కొత్త గా పార్టీలో చేరిన డాక్టర్ రాజీవ్‌రెడ్డి, అసెంబ్లీ స్థానానికి దాదాగాంధీ తోపాటు గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఆశిస్తున్నారు. కాకపోతే కాంగ్రెస్ ఆశావాహుల్లో ఉన్న అభ్యర్థులు ఎవరు కనీస ఓటుబ్యాంకు కూడా లేకపోవడం గమనార్హం. బీజేపీలో అసెంబ్లీకి కానీ, పార్లమెంట్ అభ్యర్థుల నియామకం జరగలేదు. కాగా ఆ పార్టీకి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న అంకాల్‌రెడ్డి అనంతపురం అర్బన్ స్థానానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలో జనసేన పార్టీ అనతికాలంలోనే మంచి క్రేజ్ ను సంపాదించుకుంది. ప్రధానంగా నాయకత్వాన్ని ప్రకటించకపోవడం మినహా మిగిలిన విషయంలో ఏమాత్రం ఇతర పార్టీలకు జనసేన తీసిపోదు. గతంలో ప్రజా రాజ్యం తరపున టీజే ప్రకాష్ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసిన సమయంలో సుమారు 38 వేలకుపైగా ఓటింగ్‌ను పొందారు. జనసేన తరపున టీసీ వరుణ్, రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షులు బళ్లారి వెంకటరాముడు, మునిరత్నం శీనా, సీపీఐ మాజీ ఎమ్మెల్యే రామ క్రిష్ణ అసెంబ్లీ స్థానానికి ఆశావాహుల్లో ఉన్నారు. సీపీఐ, సీపీఎంతో జనసేన జతకడితే పొత్తులో భా గంగా కమ్యూనిస్టు సోదరులు తమకే పెద్దపీట వేయాలన్న చిన్నపాటి డిమాండ్ వినిపిస్తోంది.

అభివృద్ధికే రాయదుర్గం!

- నియోజకవర్గం ఏర్పాటు నుంచి అత్యధిక సార్లు కాంగ్రెస్‌ను ఆశీర్వదించిన దుర్గం ప్రజలు
- తెలుగుదేశం ఏర్పాటుతో కంచుకోటగా రాయదుర్గం



రాయదుర్గం, ప్రభన్యూస్ : రాబోయే ఎన్ని కల్లో రాయదుర్గం ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టనున్నారని అంచనాలు వెలువడుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటై నాలుగన్నరేళ్ల కాలం లో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కాల్వ శ్రీనివాసులు వినూత్న కార్యక్రమాలతో అభివృద్ధికి పెద్దపీట వేశారు. దీంతో ఈ ఎన్నికల్లో తనదే విజయ మని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే తెలుగు దేశం పార్టీలో సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ మెట్టు గోవిందరెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి మంత్రి కాల్వ శ్రీనివాసులుకు సహకరిస్తారా లేదా అన్న అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. మెట్టు గోవిందరెడ్డి వైకాపా వైపు చూస్తున్నట్లు టిక్కెట్ వస్తే వైకాపాలో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంటున్నారు. స్థానికుడైన తనకే తెలుగుదేశంలో టిక్కెట్ నాకే ఇవ్వాలని పట్టుపడు తున్నట్లు సమాచారం. 1952 నియోజకవర్గం ఏర్పాటు సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మొట్టమొదటి ఎమ్మెల్యే జి నాగభూషణం ఎన్నికయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకే చెందిన ఎన్‌సి శేషాద్రి, ఎల్ చిన్నప్పరెడ్డి, గొల్లపల్లి తిప్పేస్వామి వరుసగా మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గొల్లపల్లి తిప్పేస్వామి మొదటిసారి ఇండిపెండెంట్‌గా గెలిచి అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి బిసి వర్గానికి చెందిన నాయకుడిగా తనదైన ముద్ర వేసుకున్నారు. గొల్లపల్లి తిప్పేస్వామి ఆకస్మిక మరణానంతరం జరిగిన ఉప ఎన్నికల్లో (1975-77)లో పి వెంకటనారా యణ కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికయ్యారు. 1978-82లో చెన్నమల్లప్ప ఎమ్మెల్యేగా ఎన్నికై రాయదుర్గం పట్టణానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయించడంలో విజయం సాధించారు. అనంతరం తెలుగుదేశం ఆవిర్భావంతో రాష్ట్రం మొత్తం ఎన్‌టి ఆర్ ప్రభంజనం వీచినా రాయదుర్గంలో మాత్రం ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన పాటిల్ వేణుగోపాల్‌రెడ్డి తెలుగుదేశం అభ్యర్థి కాటా గోవిందప్ప, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులపై విజయం సాధించారు. అనం తరం బండి హులికుంటప్ప 1985-89 కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్ని కయ్యారు. 1989-94 కాంగ్రెస్ పార్టీ తరపున పాటిల్ వేణుగోపాల్ రెడ్డి గెలుపొందారు. అంతకు ముందు కాంగ్రెస్‌పార్టీలో ఉన్న బండి హులికుంటప్ప 1994 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాటిల్ వేణుగోపాల్‌రెడ్డిపై 20 వేల మెజార్టీతో గెలుపొందారు. అనంతరం 1999-2004 కాలంలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన పాటిల్ వేణుగోపాల్ రెడ్డి గెలిపొందారు. అనంతరం సేవా కార్యక్రమాలతో రాజకీయ ప్రవేశం చేసిన మెట్టు గోవిందరెడ్డి తెలుగుదేశం టిక్కెట్ సాధించి పాటిల్ వేణుగోపాల్‌రెడ్డిపై గెలుపొందారు. అనంతరం 2009లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సహకారంతో రాజకీయప్రవేశం చేసిన కాపు రామచంద్రారెడ్డి గెలుపొందారు. రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం రాజీనామా చేసిన కాపు రామచంద్రారెడ్డి వైకాపా తరపున 2012 ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి దీపక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాటిల్ వేణుగోపాల్‌రెడ్డిలపై భారీ మెజార్టీతో గెలుపొందారు. అనంతరం 2014 జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన కాల్వ శ్రీనివాసులు కేవలం 15 రోజుల్లోనే విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం వైకాపా కన్నా తెలు గుదేశం పార్టీ ముందుందనివిశ్లేషకులుపేర్కొంటున్నారు. ఇందుకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమపథకాలైన ఫింఛన్ల పదింతల పెంపు, పసుపు-కుంకుమ తదితర కార్యక్రమాలు ఓటర్లను ఆకర్షిస్తున్నాయని ప్రస్తుతం నియోజకవర్గం ఓటర్ల 2.40 లక్షలు కాగా, అందులో 1.19 లక్షలు మహిళలు కాగా, 1.21 లక్షలు పురుషుల ఓటర్లున్నారు. నియోజకవర్గంలో అత్యధిక శాతం బిసి లైన వాల్మీకులు, యాదవులు, కురుబఓటర్లున్నారు. మిగిలిన ఓటర్లం దరూ రెండోస్థానంలో ఉన్నారు. 2004 అనంతరం స్థానికేతరుల అభ్యర్థులే రాయదుర్గం నియోజకవర్గంలో పోటీ చేయడం గమనార్హం. అందులో మెట్టు గోవిందరెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, కాల్వ శ్రీనివాసులు, దీపక్‌రెడ్డిలున్నారు. నాయకుడు ఎవ రైనా పార్టీలకే పెద్దపీట వేస్తున్నారు దుర్గం ఓటర్లు.




బీసీల ఖిల్లా... గుంతకల్లు

- జెండా పాతేదెవరు?
- శాసించనున్న బీసీలు



గుంతకల్లు అర్బన్, ప్రభన్యూస్: అనంతపురం జిల్లాలో బీసీలకు పట్టున్న నియోజకవర్గంగా పేరుగాంచిన గుంతకల్లు నియోజకవర్గంలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎవరు జెండా పాతుతారోనని ప్రజలు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. నాటి గుత్తి, నేటి గుంతకల్లు నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలుపొందితే అదే పార్టీ రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకుని ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ రావడం పరిపాటిగా మారింది. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో తుడిచిపెట్టుకుపోగా ప్రధాన ప్రత్యర్థిగా పోటీచేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. వైకాపా అభ్యర్థిత్వం ఇప్పటికే దాదాపు ఖరారు కాగా, ప్రత్యర్థికి ధీటైన అభ్యర్థిని నిలిపేందుకు తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి. వైకాపా అభ్యర్థిగా గత ఎన్నికల్లో పోటీచేసి ఓటమిపాలైన వై.వెంకట్రామిరెడ్డినే మరోసారి బరిలోకి దించుతుండగా అధికార తెలుగుదేశం పార్టీ మాత్రం ప్రస్తుత ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడుతో పాటు మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూధన్, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ కేసీ నారాయణ తనయుడు కేసీ హరి, తేదేపా రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడుయాదవ్, ప్రముఖ వైద్యురాలు పత్తి హిమబిందుల అభ్యర్థిత్వాలను పరిశీలిస్తోంది.జనసేన పార్టీ తరుపున గుంతకల్లు పట్టణంలోని కాపు సామాజిక వర్గానికి చెందిన పూలరమణ తన అభ్యర్థిత్వం కోసం అధినేత పవన్ కళ్యాణ్‌నుకోరినట్లు తెలిసింది. అతనితోపాటు అధికార, ప్రధాన ప్రతిపక్షాలకు దీటైన అభ్యర్థికోసం కూడా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిశితంగా పరిశీలిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున గత ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ పార్టీని తనవంతు శక్తిసామర్థ్యాలతో జీవం పోస్తూ వస్తున్న కే.దౌల్తాపురం ప్రభాకర్‌తో పాటు పామిడి మండలం గజరాంపల్లి గ్రామానికి చెందిన పెరుమాళ్ల జీవానందరెడ్డి అభ్యర్థిత్వాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ పరిశీలిస్తోంది. ఇదిలా ఉండగా కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ తరపున ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పసుపుల హరిహరనాథ్‌తోపాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వనగొంది విజయలక్ష్మీల అభ్యర్థిత్వాలను పరిశీలిస్తోంది. నియోజకవర్గంలో ఉన్న 2,38,010మంది ఓటర్లలో సుమారు 1.35లక్షల ఓటర్లు కేవలం బీసీలు ఉండడం గమనార్హం. దీంతో గుంతకల్లు నియోజక వర్గంలో బీసీ ఓటర్లు అత్యధిక శాతం ఏ పార్టీకి మొగ్గుచూపితే ఆ పార్టీ అభ్యర్థులే గెలుపొందే అవకాశం ఉంది.

1982వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి ఇప్పటిదాకా 8 దఫాలుగా శాసనసభ ఎన్నికలు జరిగాయి. ఇందులో 5 దఫాలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందగా మూడు దఫాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఇదే నేపథ్యంలోనే ఆయా ఎన్నికల్లో రాష్ట్రంలో గుత్తి, గుంతకల్లు నియోజకవర్గాల అభ్యర్థులుగా గెలిచిన పార్టీనే అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించాయి. 1983, 1985, 1994, 1999, 2014 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి చెందిన పత్తి రాజగోపాల్, నంగినేని గాదిలింగప్ప(1985, 1994ఎన్నికలలో), ఆర్.సాయినాథ్‌గౌడు, ఆర్.జితేంద్రగౌడులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. వీరిలో గాదిలింగప్ప, సాయినాథ్ గౌడు, జితేంద్రగౌడులు బీసీ సామాజికవర్గానికి చెందిన వారే. పత్తి రాజగోపాల్ ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వారు. ఇక పోతే 1989, 2004, 2009 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా అరికేరి జగదీష్, నంగినేని నీలావతి, కొట్రికె మధుసూధన్‌లు గెలుపొందారు. వీరిలో జగదీష్ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికాగా, నంగినేని నీలావతి బీసీ వర్గానికి, కొట్రికె మధుసూధన్‌లు ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు. అంతేగాకుండా నాటి గుత్తి, నేటి గుంతకల్లు నియోజకవర్గం నుంచి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఎమ్మెల్యేలుగా రెండువార్లు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు రెండు దఫాలు వీకే ఆదినారా యణరెడ్డి, దుద్దేకుంట వెంకటరెడ్డిలు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు.


వీరి తర్వాత అరికేరి పెద్దరాయప్ప, సందే రాజారాం, అరికేరి జగదీష్‌లు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు శాసనసభ్యులుగా గెలుపొందారు.






విప్లవ జ్వాల... శింగనమల!

- రాష్ట్ర రాజకీయాలకు శాసనం
- దేశ చరిత్రలో కలికితురాయి
- మొదటి సీఎం నుంచి రాష్ట్రపతి దాకా...
- చతుర్ముఖ పోటీతో రాజకీయ వేడి



అనంతపురం, ప్రభ న్యూస్ బ్యూరో : 1956లో ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం నుంచిఎన్నికైనీలం సంజీవరెడ్డి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1962 నుంచి 1964 వరకు ఆయన మరోమారు ముఖ్యమంత్రిగా పాలన సాగించారు. 1977 భారత రాష్ట్రపతిగా నీలం సంజీవరెడ్డి ఎంపికై ఈ రాష్ట్ర రాజకీయాల్లో చెరిగిపోని చరిత్రను సృష్టించారు. సామాజిక అంతరాల నిర్మూలన కోసం పిడికిలి బిగించిన కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి ఈ ప్రాంత వాసే. శింగనమలలో ప్రస్తుతం చతుర్ముఖ పోటీతో రాజకీయాలు వేడెక్కాయి. 1967లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా శింగనమల ఏర్పడింది. గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, శింగనమల, పుట్లూరు, యల్లనూరు, నార్పల మండలాలు ఈ నియోజకవర్గంలోకి వస్తాయి. 1983లో శింగనమలను ఎస్సీ రిజర్వ్‌గా గుర్తించారు. ఈ నియోజక వర్గంలో 2 లక్షలకు పైగా ఓటర్లు న్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు 75 వేలు కాగా.. రెడ్డి సామాజిక వర్గానికి 22 వేలు, బలిజ సామాజిక వర్గానికి 21 వేయి, కమ్మ 14 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఇక బిసిలు, ఇతర కులాలకు సంబంధించిన వారివి మిగిలిన ఓట్లు. పేరుకు ఎస్సీ నియోజక వర్గంగా ఏర్పడినప్పటికీ.. నేటికీ ఈ ప్రాంతంలో రెడ్ల ప్రాబల్యం పైనే రాజకీయ సమీకరణలు జరుగుతాయి. శింగనమల నియోజకవర్గం నుంచి టిడిపి నుంచి 2014లో అనూహ్య పరిణామాల మధ్య యామిని బాల గెలుపొందారు. 4,800 ఓట్ల మెజార్టీతో వైకాపా అభ్యర్థి జొన్నలగడ్డ పద్మావతి పై విజయం సాధించారు. ఆమె ప్రస్తుతం ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్నారు. ఈ కుటుంబంలో నుంచి 2019 సార్వత్రిక ఎన్నికలకు టిడిపి తరపున శమంతకమణి, యామినిబాల (విప్), ఆమె సోదరుడు అశోక్‌లు టికెట్ ఆశిస్తున్నారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్న శైలజనాథ్ టిడిపి టికెట్ ఇస్తే ఈ ప్రాంతం నుంచి పోటీ చేసేందుకు గట్టి ప్రయత్నాల్లో ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గత ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఓటు బ్యాంక్‌ను పొందలేని జొన్నలగడ్డ పద్మావతి ఈ ఎన్నికల్లో గెలుపు కోసం తీవ్ర స్థాయిలో కృషి చేస్తున్నారు.ఇక కాంగ్రెస్‌కు ఒకప్పటి పుట్టినిల్లుగా చెప్పుకునే ఈ ప్రాంతంలో ప్రస్తుతం నాయకులు కరవయ్యారు.విప్లవాలకు పుట్టినిల్లుగా పేరొందిన శింగనమల లో జనసేన పార్టీ వూపిరి పోసుకుంది. ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అభిమానించే కమ్యూనిస్టు నేత తరిమెల నాగిరెడ్డి నియోజకవర్గం కావడంతో ఈ ప్రాంతంపై జనసేన ప్రత్యేక దృష్టి సారించింది. విలువలతో కూడిన రాజకీయాలకు ఇక్కడి నుంచే పునాదులు వేయాలని భావిస్తోంది. అందులో భాగంగా సైన్యాన్ని సిద్ధం చేసింది. తన అంతర్గత సర్వేలో నేతల జాబితాను సిద్ధం చేసింది. సామాజికపరంగా చూస్తే 2వ స్థానంలో బలిజలు ఉన్న ఈ ప్రాంతంలో జనసైన్యం కూడా అంతకు మించే ఉంది. ఉరకలెత్తే ఉత్సాహంతో నాయకత్వానికి ఆహ్వానం పలికేందుకు సైన్యం రోజులు లెక్కిస్తోంది.



తాడిపత్రి... జేసీల కంచుకోట!

- ముందస్తు వ్యూహాలతో విజయం
- ఓటమి ఎరుగని జేసీ కుటుంబం

అనంతపురం, ప్రభన్యూస్ : తాడిపత్రి నియోజకవర్గం జె.సి కుటుంబానికి కంచుకోటగా మారింది. ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి ఎంపిగా గెలిచిన జె.సి దివాకరరెడ్డి ప్రత్యర్థులను ముందస్తు వ్యూహంతో మట్టికరిపించి అధికారాన్ని చేజిక్కించుకోవడం ఆనవాయితీగా మారింది. రాష్ట్రవిభజన అనంతరం టిడిపి తీర్థం పుచ్చుకున్న జె.సి కుటుంబం 2014 ఎన్నికల్లో దివాకరరెడ్డి సోదరుడు జె.సి .ప్రభాకరరెడ్డి ప్రత్యర్థి వైసీపి అభ్యర్థి వి.ఆర్ రామిరెడ్డిపై 22172 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి తాడిపత్రి తమ కంచుకోట అని నిరూపించారు. సమీప అభ్యర్థి ఎన్నికలజరిగే నెల ముందే అభ్యర్తిని ఆయా పార్టీలు ప్రకటించడంతో పాటు , కనీసం ప్రచారం చేసుకోడానికి సమయాభావం, ఒకే పార్టీలోనే వ్యతిరేకగ్రూపులు, ముందస్తు వ్యూహం లేకపోవడం వంటి కారణాల వల్ల జె.సి దివాకరరెడ్డి విజయానికి గండికొట్టలేకపోతున్నారు.

ప్రస్తుతం వైసీపీ తరుపున కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆ పార్టీ తరుపున అభ్యర్థి అవుతాడా లేదా అన్న సందేహం నివృత్తి కావాల్సి ఉంది. జె.సి కుటుంబం ఏపార్టీలో ఉన్నా తమ సీటును పదిల పరుచుకోవడంతో పాటు ఏడాది ముందే ప్రజల్లో కలియ తిరగడం, పబ్లిసిటీతో కూడిన కార్యక్రమాలను నిర్వహించడంతో కార్యకర్తల్లో ఊపు వస్తోంది. తాడిపత్రి నియోజక వర్గంలో పెద్దపప్పూరు, వడుగూరు, యాడికి, తాడిపత్రి రూరల్, అర్బన్ ఏరియాలు వస్తాయి. మెత్తం ఓటర్లు 2,20,818 కాగా, పురుషులు 1,10,923 , స్త్రీలు 1,09,885 , హిజ్రాలు 10 మంది ఉన్నారు. ఇంతవరకు వైసీపీ అభ్యర్థి ఎవరన్నది అర్ధంకాని పరిస్తితి నెలకొంది. పెద్దారెడ్డి తనకే టిక్కెట్టు దక్కుతుందని నియోజకవర్గం ఇన్‌చార్జ్ హోదాలో ప్రచారం చేసుకొంటున్నారు. పెద్దారెడ్డి సోదరుడు సూర్య ప్రతాపరెడ్డి హత్యానంతరం కేతిరెడ్డి కుటుంబం తాడిపత్రి విడిచి ధర్మవరంకు వలస వెళ్లారని స్తానికంగా తానే ఉండటం వల్ల ప్రజల్లో తన పై సానుకూల మైన అభిప్రాయం ఉందని పేరం నాగిరెడ్డి భావిస్తున్నారు. గడిచిన ఎన్నికల్లో టిడిపిలోకి జె.సి కుటుంబం చేరగానే పేరంకు టిడిపిలో తగుస్థానం లేకపోవడంతో వైసీపికి జంప్ అయ్యారు. ఎన్నికలు సమీ పిస్తున్న సమయానికి తనకు అవకాశం వస్తుం దని ఎదురు చూసినా ఎన్నికల్లో వ్యయం చేయడానికి అవసరమైన నిధులు నమకూరిస్తే పోటీ చేస్తానని చెబుతున్నారు. ఇక వైసీపి లో మెదటినుండి సేవలందిస్తున్న రమేష్‌రెడ్డి తో పాటు ఇటీవల , టిడిపి నుండి బహిష్కరణకు గురైన ఫయాజ్‌బాషా, జగదీశ్వరరెడ్డి, కాకర్లరం గనాథలు పెద్దారెడ్డి అభ్యర్థి అయితే తమ మాట చెల్లదని, సౌమ్యుడు, కమ్మసామాజిక వర్గానికి చెందిన ఓబులాపురం నాయుడుకు టికెట్టు ఇవ్వాలని జగన్‌కు సూచిస్తున్నారు. ఇక జనసేన పార్టీకి చెందిన కదిరి శ్రీకాంత్ రెడ్డి అనే వ్యక్తి తనకే టిక్కెట్టుఇస్తారన్న ఆశతో వివిధ కార్య క్రమాలను చురుకుగా నిర్వహిస్తున్నారు.

ఈ ఎన్నికల్లో తాడిపత్రి అసెంబ్లీ, అనంతపురం పార్లమెంట్ స్థానాలను తమ కుమారులైన జె.సి అస్మిత్, పవనరెడ్డిలకు ఇవ్వాలని జె.సి సోదరులు చంద్రబాబును అభ్యర్థించిన విషయం విదితమే. ఆయన సానుకూలంగా ఉండటంతో దాదాపు జె.సి కుటుంబం నుండి మూడవ తరం రాజకీయ అరంగేట్రం చేస్తోంది. వయోభారంతో పాటు వారసత్వానికి అధికారం అప్పగించాలన్న తపనతో జె.సి బ్రదర్స్ వ్యూహం పలిస్తుందో లేదే వేచి చూడాల్సిందే. జె.సి కుటుంబానికి స్వంత సామాజిక వర్గం వారే బలం. నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో రెడ్డి సామాజిక వర్గం వారిదే ఆధిపత్య పోరు ఉంటుంది.









ఆ రెండు కులాలదే ఆధిపత్యం

- ఉరవకొండ నియోజకవర్గం ఎన్నికలు రసవత్తరం



ఉరవకొండ,ప్రభన్యూస్: ఉరవకొండ నియోజకవర్గంలో దశాబ్దాల తరబడి రెండు కులాలే ఆధిపత్యం కొనసాగుతోంది.మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన శాసనమండలి చీఫ్‌విప్ పయ్యావుల కేశవ్ ఒక్కసారి విశ్వేశ్వరరెడ్డి చేతిలో ఓడిపోయారు. 2014లో జరిగిన అసెంబ్లి ఎన్నికలలో వైఎస్ఆర్‌సిపి అభ్యర్థిగా వై.విశ్వేశ్వర రెడ్డి 2275 ఓట్లతో టిడిపి అభ్యర్థి పయ్యావుల కేశవ్ పై గెలుపొందారు. 1983నుంచి 2014 వరకు వివిధ పార్టీలనుంచి కమ్మ, రెడ్డి, కురుబ వారు మాత్రమే పోటీలో నిలబడ్డారు. ఉరవకొండ నియోజకవర్గం బరిలో ఐదు ప్రధాన పార్టీలు పోటీలో నిలబడుతున్నారు. టిడిపి, వైఎస్ ఆర్‌సిపి, కాంగ్రెస్, జనసేన , బిజెపి అభ్యర్థులు పోటీలో ఉంటున్నారు.మొత్తం నియోజకవర్గం ఓటర్లు 2,07,775 మంది ఓటర్లు ఉన్నారు.వీరిలో పురుషుల ఓటర్లు 1,04,186 మంది ఉన్నారు, మహిళా ఓటర్లు 1,03.570 మంది ఉన్నారు. మహిళా ఓటర్లతో పోలీస్తే పురుషుల ఓటర్లు 616 మంది అధికంగా ఉన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో బోయ, కురుబ శాతం ఎక్కువగా ఉంది. అయితే 2019లో జరిగే సార్వత్రిక ఎన్నికలలో టిడిపి, వైఎస్ ఆర్‌సిపి, కాంగ్రెస్, జనసేన పార్టీలు రంగంలో దిగి అభ్యర్థులు గెలుపుకోసం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పొట్టిపాడు జగన్మోహన్ రెడ్డి, జిల్లాకాంగ్రెస్ పార్టీ కార్యదర్శి రవికృప సంస్థ అధినేత రవికృప రామానాయుడు, ఉవరకొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోటీ పడుతున్నారు. ఉరవకొండ నియోజ కవర్గ బీజేపీ అభ్యర్థిగా అనంతపురం మాజీ దివంగత నేత ఎంపీ నారాయణ స్వామి మనువరాలు, హైకోర్టు న్యాయవాది, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దేవినేని హంస, జనసేన తరపున ఉరవకొండ నియోజకవర్గానికి జనసేన సోషియల్ జస్టిస్ విభాగం జిల్లా కన్వీనర్ గౌతమ్ కుమార్, నర్రా కేశన్న, లాయర్ తుకారామ్ కూడా టిక్కెట్ కోసం పోటీపడుతున్నారు.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీగవాక్షం

ఉపాధ్యాయుడు

ఈ రోజున టీచర్లకు భయం
రాయాలా, వద్దా అని ఆలోచించే
లెస్సన్ ప్లాన్ల గురించి...
రాద్దాంలే అని మర్చిపోయిన
టీచర్ డైరీల గురించి...
రాయొచ్చులే అని వదిలేసిన
టెస్టింగ్ రిజిస్టర్ల గురించి...
రాసేద్దామని తీసి,
రాయలేక మూసేసిన
రేడియో లెస్సన్ల గురించి...
పెచ్చులూడుతున్న స్కూలు గోడల్నీ
పైకప్పుల్ని చూసే...కుళ్ళి కంపుగొడ్తున్న
సారంలేని పాఠ్యాంశాల్ని
చూసి కానే కాదు,
కుళ్ళిపోయిందని బయటపారేసిన
మధ్యాహ్న భోజన పథకపు
గుడ్డు పెంకుల్ని చూసే...
ఎన్ని కమిటీలేసి కడిగిస్తున్నా,
ఎంత ఖర్చు చేసి కడిగేస్తున్నా...
ఓ కొలిక్కిరాని
విద్యా ప్రమాణాల
ప్రణాళికలని
చూసి కాదు, వీరి భయం...
నేడు టీచర్ల భయం
సక్సస్ గుర్తు పడని
బయోమెట్రిక్ పరికరాల
అటెండెన్సుల్లో దాగుంది...
ఓ వైపు... ఆన్‌లైన్ సేవలకి
సాగిలపడి మొక్కలేక,
మరోవైపు...
ఆవేదనని బయటకి కక్కలేక,
కొట్టుమిట్టాడుతున్న టీచర్ల
అసహనంలో
అంతర్లీనమైపోయి ఉందీ భయం...
నేటి టీచర్ల భయం
టీచర్ల మధ్య చెడిపోతున్న
ఐక్య సంబంధాలకే దర్పణం...
సమాజంతో
తెగతెంపులు చేసుకుంటున్న
సాంఘిక జీవనానికి నిదర్శనం...



అర్థంలేని విషయాలకు
టీచర్లు భయపడుతున్నారంటే....
అర్థవంతమైన టీచర్లు
పుట్టుకురావడం లేదని అర్థం!
సమాజాన్ని అర్థవంతంచేసే
టీచర్లుని అందించడంలో
టీచర్లు కూడా
విఫలమౌతున్నారని అర్థం!

పేలిపోవడానికి సిద్ధంగా ఉన్న
నీటి బుడగని చూసి
భయపడుతున్న టీచర్ పోయి,
పోటెత్తిన కడలి అలలకి
ఎదురు నిలిచే టీచర్ పుట్టుకొచ్చే వరకూ...
రాబడి రాబందులు
స్కూళ్లని తన్నుకుపోతూనే ఉంటాయి!
నెత్తురు చిందని హత్యలు చేస్తూ
టీచర్లని భయపెడుతూనే ఉంటాయి!!

- వూకే రామకృష్ణ
9866073866



నాతో నా నీడ!

నేను నడుస్తున్నాను
నా నీడ నడుస్తున్నది
నాతో పాటే వస్తున్నది
దశలు దశలుగా
దిశలు మారుస్తున్నది!
నా కాళ్లకిందే కదుల్తూ
నాతో నడుస్తున్నది!
మరుగుజ్జుగా ఉంది
అణిగినట్టుగా ఉంది
ఒదిగినట్టుగా ఉంది
నలిగినట్టుగా ఉంది
ఐనా అక్కడే కదుల్తున్నది!
నాలో నేను మాదిరిగా
నా కిందే దాక్కున్నది!
నాకు నేనే కనిపించనట్టే
అదృశ్యాదృశ్యంగా ఉంది!
ఇంతలోనే కదులుతున్నది
నా ముందుకొస్తున్నది!
నా వైపు చూస్తున్నది
వెర్రిగా నవ్వుతున్నది
నాకంటే ముందున్నది
నల్లని నీడే అయినా
కొండంత అతిశయం!
క్రమేపీ నా నీడ నన్ను
దాటి ముందుకెళ్తున్నది
నా కన్నా ముందు
ఎలా వెళుతున్నది?
నన్ను దాటేసి అలా
ఎందుకు వెళుతుంది?
అరిచినా అది చెప్పదు
ఇంకెవరూ చెప్పలేరు!
నాకన్నా పెద్దదిగా
పెరిగిపోతున్నది!
నా నీడ ముందు
నేనిప్పుడు మరుగుజ్జుని!
ఇంకా నడుస్తున్నాను
అది వెనక్కి జరిగింది!
ఇంతలోనే మళ్లీ మార్పు!
అదే నీడ పొట్టిగా
ఇంకా కురచగా...
మళ్లీ మరుగుజ్జులా...
ఎదుగుబొదుగుల
ప్రయాణం ఇది!
ఆద్యంతాలకు
ఆదిరూపమది!
నడుస్తున్న కొద్దీ
స్పష్టత వస్తున్నది
నా నీడలో క్రీనీడలు
నాతోనే సయ్యాటలు!
నానీడనిండా అతిశయం
అది నాలోని అతిశయమే
అది వేసే అడుగులన్నీ
నా అడుగుజాడలే!
నాకు మార్గదర్శకాలే!
నాకర్థమైంది...నాతో
నిమిత్తం లేకుండానే
నా ఇజాలు కదులుతాయని!
నిజాలు నడుస్తాయని!
నా అంతరంగానికి అవి
రూపంలేని ఆనవాళ్లని!

- వయ్యస్సారెస్
9000013367


ప్రజాపక్షం వహించిన రాచపాళెం కవిత్వం

కవిత్వం అంటే అనుభూతి మాత్రమే కాదు ఒక ప్రశ్న, ఒక పరిష్కారం, ఒక అనుభవం, ఒక చరిత్ర అని నిరూపించిన పుస్తకమే రెండు ప్రపంచాలు. రాచపాళెంగారు గొప్ప సాహిత్య విమర్శకులుగానే చాలామందికి తెలుసు కాని ఆయన గొప్ప కవి దానికి నిదర్శనమే రెండు ప్రపంచాలు. పుస్తకంలోని కవిత్వం వారి జీవితంలో జరిగిన సంఘటనలకు స్పందిస్తూ రాసిన కవిత్వం కనపడుతుంది.

అక్కడో సమస్య రూపాంతరం చెందుతుంది. అతను అక్షరాన్నో అక్షరంతో కూడిన ప్రశ్ననో విసురుతాడు. అక్కడో విపత్కర శబ్దం వినపడింది. ఒక వాక్యంతో పరిస్థితిని ఎత్తి చూపుతాడు. అక్షరంతో అక్షరాన్ని నిర్మించిన వాడే రేపటితరానికి నిజమైన వారధి. చరిత్రను నిప్పుల్లాంటి అక్షరాలతో రాస్తే అది రాచపాళెంగారి కవిత్వం అవుతుంది. అన్యాయం, అక్రమం, మూఢనమ్మకాలు, శ్రమ దోపిడీ, రైతుల దుస్థితి ఇవే ఆయన కవితా శీర్షికలు. రాయలసీమ నాటి దుస్థితిని అద్దం పట్టే కవిత్వాన్ని మనకందించిన పుస్తకమే "రెండు ప్రపంచాలు". నాడు రాయలసీమను ఫ్యాక్షన్ మహమ్మారి పొట్టన పెట్టుకుంది. రాయలసీమ స్త్రీల నుదుటిపై కుంకుమ రక్తంలో కలిసిపోయింది. రాయలసీమలో హత్యలు ఎంత సులువుగా జరుగుతాయో రాచపాళెం గారు ఒక్క వాక్యంలో ఇలా అంటారు. **"నరికేయడానికి మనిషి తలైన మామిడి చెట్టు అయినా ఒక్కటే"** అవును రాయలసీమ ఫ్యాక్షన్ రోగంతో నాడు బలైపోయింది. నేడు రాజకీయ నాయకుల చేతుల్లో ప్రాణాలు వదలడానికి సిద్ధంగా ఉంది.

మార్పేది? ఎందుకు రాయలసీమ ప్రజల కళ్లల్లోనే నీళ్లు కదులుతాయి? వారి పొలాల్లో పగిలిన భూమి గురించి ఎవరూ ఎందుకు పట్టించుకోరు? రాయలసీమలో రత్నాల కంటే విలువైనవి వున్నాయి అవే అక్షరాలు. అక్షరాలు నిరంతరం బీదల పక్షానే నిలిచాయి. కథలై జీవిత గాథలను ప్రపంచానికి తెలిసేలా చేశాయి. పద్యమై విశ్వ సాహిత్య చరిత్రలో తన జెండాను రెపరెపలాడించాయి. నాటి నుండి నేటి వరకు రాయలసీమకు అక్షరమే అండగా, ఊపిరిగా నిలిచింది. ఆ వరుసలో వచ్చినదే రాచపాళెంగారి కవిత్వం. రాయలసీమలో తిరిగే మేఘాల్లో ఎవరో ఎడారిని నాటినట్టు ఉన్నారు. మేఘాలు కదిలితే కళ్లు పైకి చూస్తాయి! ఆ కళ్లలో మరణం వణుకుతుంది. గుండె పక్కన అప్పులు నిలదీస్తాయి. తెల్లారేసరికి అక్కడ వర్షానికి బదులుగా రక్తం చిందుతుంది. రక్తంలో శరీరాలు మునిగిపోతాయి. ఆ శరీరాల మీద కూడా కరువే తాండవిస్తుంది. ఆకులు రాలిన చోట మరో ఆకు చిగురుస్తుందేమో ఇక్కడ మాత్రం ఆకుతో పాటు కొమ్మ, కొమ్మతో పాటు చెట్టు కూడా రాలిపోవాల్సిందే. ఇవే విషయాలు రాచపాళెంగారి కవిత్వంలో కనపడతాయి.

వాడు ఎక్కడ ఉంటే ఏంటి? వాడి దేశం ఏదైతేనేంటి? వాడూ మనిషే కదా! మనిషి మనిషిని ప్రేమించాలి? మనిషి మనిషిలో కలిసిపోవాలి, గోడలు, వాకిళ్లు వేరైతే ఏంటి? వాడు మనిషే మనము మనుషులమే, వాడిది ఆకలే, మనది ఆకలే, ఒకరికి ఒకరు తోడు లేకపోయినా పర్వాలేదు కాని ఒకరి కంట్లో ఒకరు అణు బాంబులు వేసుకుంటే ఎలా? అని శత్రుదేశంపై అణు ప్రయోగాన్ని అక్షరంతో వారించి మనమంతా ప్రపంచ పౌరులం అనే విషయాన్నీ గుర్తుచేస్తారు.



అత్యంత విలువైన బంధం ఏదైనా ఉందా అంటే అది స్నేహమే మరి అలాంటి స్నేహితుల మధ్య అరమరికలు వస్తే ఎలా? అసలు స్నేహానికి మరణం ఉంటుందా? స్నేహించడమంటే అక్కడ ఒకచెట్టు పెరుగుతున్నట్టే కదా! ఆచెట్టు నీడలో ఎందరో సేదతీరాలి. "అస్తమయం సూర్యచంద్రులకేగాని స్నేహితులకు ఉంటుందా" అవును స్నేహానికి అస్తమయం ఉండదు. అదొక నిరంతర ప్రక్రియ. స్నేహంలో పాములు జొరబడి విషాన్ని కక్కితే పామునో, పాములాంటి మనిషినో కాలం కింద పాతెయ్యాలి. స్నేహం ఉన్నచోట గాలి కదులుతుంది. ఆ గాలి మరో స్నేహాన్ని కలపాలి. అదే నిజమైన స్నేహం. స్నేహితులు విడిపోయారు అంటే గుండెలోని శబ్దం ఒంటరిదే కదా! స్నేహం గురించి రాసిన కవిత చదివిన తర్వాత కలిగిన భావాలివి. స్నేహం అనంతమై సాగాలి, బిందువై కృశించుకుపోకూడదు. స్నేహాన్ని కాలంలో నడుపుతున్న వారికి జోహార్లు.

కులాలు, మతాలు మనుషులను వర్గాలుగా విభజించి రాక్షసానందం పొందుతున్నాయి. కులం పేరుతో మనల్ని విభజిస్తున్న వాడి కంట్లో కారం కొట్టండి. కులాలు, మతాలు మనిషిని విడగొట్టి మధ్యలో తుమ్మ ముల్లులు నాటుతాయి. దేవాలయాలు దగ్గర, మసీదుల దగ్గర ఉండే భిక్షువులను నీ కులం ఎందుకు మార్చదు? నీ కులం నీకు అన్నం పెడుతున్నదా లేదా మనిషి పెడుతున్నాడా? మనమంతా ఒక్కటే అంటుంది కులం కానీ మసీదు నిర్మాణానికో, ఆలయనిర్మాణానికో అదే కులం నిన్నో, నన్నో చంపేస్తుంది. శ్రమ లేనిదే ఏదీ లేదు. శ్రమ అన్నం పెడుతుంది. శ్రమ జీవితాన్ని నిర్మిస్తుంది. శ్రమను నమ్ముకుంటే అక్కడ నదులు ప్రవహిస్తాయి. నదికి ఇరువైపులా చెట్లు వెలుస్తాయి. నీ శ్రమతో ఎదిగిన వాడు నిన్నే మోసం చేస్తాడు. కంటి కింద కులం ఉంటే చూపులు ఎలా మారుతాయి. కులాన్ని పంది పాదాల కింద విసిరేయండి అప్పుడే సమాజం పచ్చపచ్చగా ప్రవహిస్తుంది.

మనిషి మహోత్తముడిలా నిర్మాణం చెందాలంటే అనుభవం కావాలి. అనుభవం ఎలా వస్తుంది. గెలుపు ఓటములను లెక్క చేయకుండా పని చేసినవాడి జీవితమే ఒక అనుభవం. వాడి నడకలో అనుభవం నడుస్తుంది. వాడి మాటలో అనుభవం దొర్లుతుంది. రాచపాళెం గారు అనుభవం గురించి ఇలా అంటారు. **"అనుభవం ఒక మథనం/అనుభవం ఒక సముద్రం/అనుభవం ఒక వాస్తవం/ అనుభవం ఒక సృజనం"** మీ అనుభవాలన్నీ మథించండి. గతంలో మీరు ఎదుర్కొన్న సమస్యల కంటే ఇప్పటి సమస్యలు పెద్దవేమి కాదు. మీ అనుభవాల సముద్రంలో పరిష్కారాన్ని వెతకండి. దేని గురించి తెలియకుండా మీరు ఎలా స్పందించగలరు అందుకే అనుభవం కావాలి దానికోసం ప్రతి విషయంలో ప్రయత్నం అవసరం. అనుభవమంత అనుభవాన్ని అనుభవిస్తే జీవితం సరళతరమే. అనుభవం చేదుగా ఉంటుంది, తియ్యగా ఉంటుంది. ఏదైతేనేంటి అనుభవం లేని మనిషి ఎందుకు పనికిరాడు.

స్త్రీ వివక్ష గురించి రాసిన కవిత "మీ ఆయుధాలు తెచ్చుకోండి" ఈ కవితలో రాచపాళెంగారు తరతరాల స్త్రీ వివక్షను ప్రశ్నించారు. స్త్రీల కోసం ఎంతోమంది పోరాడారు కాని నేటికి వారిపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. వరకట్నం వేధింపులు, యాసిడ్ దాడులు, ఆడపిల్లలపై సామూహిక అత్యాచారాలు, పసిపిల్లలపై లైంగిక దాడులు అడుగడుగునా జరుగుతూనే ఉన్నాయి. స్త్రీ కోసం స్త్రీ నడుం బిగించాలి. సమాన హక్కులకై పోరాడాలి. శారీరకంగా, మానసికంగా దృఢంగా నిలిచి పోరాడితేనే ఆమె ఉనికి నిలబడుతుంది. ఎవరో ఏదో చేస్తారని వేచి చూడటం కాదు స్త్రీలే వారి కోసం పోరాడాలి. అప్పుడే వారి జీవితాలు మారుతాయి. నేడు చాలామంది వారి హక్కుల కోసం పోరాడుతున్నారు. కాని అధిక సంఖ్యలో ఇంకా రావాలి. మగ అహంకారాన్ని తుడిచి పెట్టాలి. అప్పుడే వారి జీవితాల్లో దీపం వెలుగుతుందని చెప్పే కవిత ఇది.

కవిత్వం అంటే అనుభూతి మాత్రమే కాదు ఒక ప్రశ్న, ఒక పరిష్కారం, ఒక అనుభవం, ఒక చరిత్ర అని నిరూపించిన పుస్తకమే "రెండు ప్రపంచాలు". రాచపాళెంగారు గొప్ప సాహిత్య విమర్శకులుగానే చాలా మందికి తెలుసు కాని ఆయన గొప్ప కవి. దానికి నిదర్శనమే "రెండు ప్రపంచాలు". పుస్తకంలోని కవిత్వం వారి జీవితంలో జరిగిన సంఘటనలకు స్పందిస్తూ రాసిన కవిత్వం కనపడుతుంది. రాయలసీమ కరువు, ఫ్యాక్షన్, సీమలో నాటి పరిస్థితులను గురించిన విషయాలు తెలుస్తాయి. వివిధ సందర్భాలలో వివిధ విషయాలపై నిర్భయమైన ఆలోచనలను కవిత్వీకరించారు. మూఢనమ్మకాలపై, శ్రమదోపిడీపై వారి గళాన్ని వినిపించిన తీరు స్ఫూర్తిని ఇస్తుంది. నిజాలను నిర్భయంగా రాయని కవి ఎప్పటికి చరిత్రలో నిలబడడు. రాచపాళెంగారి కవిత్వంలో నిజాలు నిప్పులు చెరుగుతాయి. విమర్శ రాసిన, కవిత్వం రాసిన ఆ కలం ఎప్పుడూ ప్రజల పక్షమే.

లై
9491977190

అనుభవాల అర హౌస్‌వైఫ్

"పసిడికి పన్నీరుపూస్తే...ఆ అనుభూతిని వర్ణించడం అందానికే అందం లాంటిది. అలాగే అక్షర మాత్రికులైన కవులు తమ తమ అందమైన భావాలను అక్షరబంధంతో అలా అలా కవితా విరిదండలు అల్లేస్తూ అనిర్వచనీయమైన అనుభూతుల సిరులు కురిపిస్తారు. అలాంటి అందమైన భావాలకు తనవైన అనుభవాలను అన్వయం చేయడం ద్వారా మరింత సంపూర్ణత సంపుష్టి చేకూరుతాయి. అచ్చంగా అలాంటి అక్షర మథనంలోంచి ఆవిష్కరించబడిందే డా॥కందేపి రాణీప్రసాద్ అందించిన 'హౌస్‌వైఫ్' కవితా సంపుటి. తన బాల్య దశను సదా స్మరించుకుంటూ ఆ బాల్య దశ మధురిమలను అందరికీ పంచడమేగాక బంగారు భవిత గల భావి పౌరులను సానబట్టే పనిలో భాగంగా ఒకవైపు బాల సాహితీ ఆవిష్కరణ చేస్తూనే మరోవైపు వైద్యరంగ సేవలో భర్తకు చేదోడు వాదోడుగా వుంటూ తనదైన అసలు వృత్తి "శ్రీమతి" తత్వాన్ని నిక్కచ్చిగా నిర్వహిస్తూ విద్యపై మమకారంతో సాహిత్యంలో డాక్టరేట్ పట్టా పొందారు రాణి ప్రసాద్.



మా అమ్మ బహుపాత్రధారిణి. పొద్దున మా ఇంటి ముందు "ముగ్గు" అవుతుంది. రాత్రికి మానాన్నకు "రగ్గు" అవు తుంది. అన్న తనికెళ్ల భరణి అక్షరభరిణలను గుర్తు చేస్తాయి కందేపి 'హౌస్‌వైఫ్' కవితలోని భావాలు.

వెలుగురేఖలు విచ్చుకోకముందే వాకిట్లో కళ్లాపియై గుమ్మం ముందు ముగ్గై పగటి దొరకు స్వాగతం పలుకుతుంది. అనే వాక్యాలతో క్రమశిక్షణకు చిరునామా అయిన సూర్యుని మించిన క్రమశిక్షణ గుణాన్ని, హౌస్‌వైఫ్ అనబడే ఇల్లాలుకు చేర్చి ఆమె ఔన్నత్యం అందంగా గొప్పగా, ఆదర్శంగా ఆవిష్కరించారు. ఇంటా బయటా ఇల్లాలు చేసే శ్రమ అంతా తనకోసం కాదు. ఆమె ఆరాటం అంతా తన కుటుంబం కోసమే అని చెబుతూ "ఇంటికి దీపం ఇల్లాలు"అనే నానుడి నిజం చేశారు.

'....తన తపనకు...తన పనికి/గుర్తింపు ఉన్నా లేకున్నా/శ్రమిస్తూనే ఉంటుంది. భూమి సూర్యుని చుట్టూ/తిరిగినట్లు/ఆమె కుటుంబం చుట్టూ/ పరిభ్రమిస్తుంది/ అవును!ఆమే హౌస్‌వైఫ్'అని చెప్పడంతో కవయిత్రిలోని ఆత్మవిశ్వాసం అడుగడుగునా ఆవిష్కరించబడి ఈ జగతికి సూర్యుడు ఎంత ప్రధానమో ప్రతి ఇంటికి ఇల్లాలు అంత ముఖ్యం అనే సామాజిక సత్యాన్ని అందంగా ఆవిష్కరించిన వైనం అందరికీ ఆచరణీయం. తన సర్వం సమర్పించి అతడికి జీవితాన్నిచ్చి అనుక్షణం ఆబగా ప్రేమగా చూసుకుంటే చివరికి తనను ఒంటరిని చేసి డాలర్ల దేశం వలస పోయాడు అంటూ విదేశాలకు పారిపోతున్న బిడ్డల పట్ల తల్లులు పడుతున్న ఆవేదనను కడు హృద్యంగా ఆవిష్కరించింది "నేను అమ్మను కదా!" అనే కవితలో.

మానవ మనుగడకు ఆధారమైనది ఆరోగ్య ప్రదాయిని అయిన చెట్టు మానవుని యొక్క స్వార్థ బుద్ధిపై వ్యక్తపర్చిన ధర్మాగ్రహాన్ని కవయిత్రి ఎంతో హృద్యంగా ఆవిష్కరించి అందరిని ఆలోచింపజేస్తుంది. "నమ్మక్రదోహి" కవిత ద్వారా **"నలుగురికీ నీడనిచ్చే చల్లని చెట్టు/పదిమంది కడుపునింపే పళ్ల చెట్టు/వేలమందికి ప్రాణాలు పోసే సంజీవనీ చెట్టు/ నమ్మక్రదోహుల మోసానికి గుండె పగిలింది"** అంటూ ఆవేదనను అక్షరరూపం చేసిన వైనం పాఠకులను ఇట్టే కట్టి పడేస్తుంది.

"మమ్మల్ని పెంచండి! ప్రేమించండి/ మీ ప్రేమకు వందరెట్లు ప్రతిఫలాన్నిస్తాం!/మీకు జీవితాంతం తోడు నీడగా వుంటాం/ కోరిందల్లా ఇచ్చే కల్పవృక్షం మాచెట్టే/బుద్ధునికి జ్ఞానాన్నిచ్చిన బోధివృక్షం మా చుట్టమే/ మాకు ప్రాణముంది!మాకు మనసుంది" అన్న చెట్టు మాటల్లోని ఆర్తి ప్రేమ మనసున్న మనిషి గుండెను తడిచేస్తుంది.

అత్యంత ప్రాధాన్యత గలవి మాత్రమేగాక అతి సామాన్యమైన వాటిని కూడా కవితావస్తువులుగా తీసుకుని కడుకమనీయంగా కవిత్వీకరించిన తీరులో కవయిత్రి నైపుణ్యం తేటతెల్లమవుతుంది. అందుకు ఉదాహరణగా కుండలు, కోయిల, సైకిల్, కవ్వం, పిచ్చుక, రోడ్డు, బావి, బస్సు మొదలైనవి కవితలు కనిపిస్తాయి. కవయిత్రికి గల సామాజిక స్పృహలో భాషా శాస్త్రం పట్ల ప్రపంచీకరణ పట్ల అలవిమాలిన ఆవేదన అగుపిస్తుంది. తెలుగుదనపు పండుగలపై పరాయి సంస్కృతి చేస్తున్న దాడి గురించి హేవళంబి డిప్రెషన్, చిత్రాల చిత్రభాను, ఎన్నికల ఉగాది, పరీక్షల ఉగాది, వంటి కవితల్లో ఆర్ద్రంగా ఆవిష్కరణ జరిగింది.

అక్కడక్కడా మన జాతి మార్గదర్శకులైన, అబ్దుల్ కలాం వంటి మహనీయులను కీర్తించి స్మరించిన తీరు రచయిత్రి కృతజ్ఞతాభావంకు నిదర్శనం.

కవిత్వం అంటే కేవలం అక్రమాలపై అసమానతలపై ఆగ్రహం వ్యక్తం చేసే నిరసనకారిణి మాత్రమే కాదు సమాజ స్థితిగతులను చిత్రించి చిత్రిక పట్టే భావ చిత్రం కానేకాదు. అక్షర భక్తులను చైతన్యపరుస్తూ విజ్ఞాన ఫలహారం పంచే పూజారిగా వుండాలనే కవితానీతిని అక్షరాలా ఈ కవయిత్రి పాటించారు.

అందులో భాగంగానే పెడికాన్-2007, అరచేతిలో వైకుంఠం, పెంగ్విన‌మ్మ, వైద్యబతుకమ్మ, ఎం.ఎం.ఆర్ వాక్సిన్, ఎయిడ్స్, మలేరియా-ఫైలేరియా, లాంటి కవితాసుమాల పూలతో ఈ హౌస్ వైఫ్‌ను అందంగా ముస్తాబు చేసి ఆరాధనీయత్వం కలిగించారు కందేపిరాణి.

అతి సామాన్య కవితా వస్తువును అసామాన్యంగా తీర్చిదిద్దడంలో సఫలీకృతురాలు అయ్యింది కనుకే పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం సొంతం చేసుకోగలిగారు.

- డా॥ అమ్మిన శ్రీనివాసరాజు
7729883223


వెంట తీసుకువస్తున్నాను

ప్రయాణమైపోతున్నప్పుడు
విమానయానం కొత్తని
బోర్డింగ్ పాస్ నుంచి
తనిఖీల వరకు రానూ పోనూ
మినట్ తరువాత మినట్ రాసిచ్చి
అస్సాం బోడో ప్రాంతానికి పోతే
అద్భుత భావాలు పొంగిపొర్లుతాయని
ఆత్మీయ ప్రఖ్యాత కవి చెప్పి సాగనంపాడు

మరో శ్రేయోభిలాషి యువకవి
అక్కడ చలి ఎక్కువని
ఇన్నర్లు సాక్సులు గ్లౌవ్స్‌లు కొనిచ్చి
భోజనం పెట్టి పంపించాడు
అన్నీ సదురుకున్నాక
తాతా! పెన్ మర్చిపోయినవని
మా గుండె చప్పుడు మనుమరాలు
గుర్తించి యాదికి చేసింది

ఇంటి నుంచి మొదలు వచ్చే వరకు
చిన్నప్పుడు మీగడ పెరుగు ఉప్పు
మెత్తగా కలిపి
అన్నం తినిపించినంత కమ్మగా
మా పిల్లలు ఫోన్లో
మాటల రుచి నాకు చూపించారు

కండ్లు చెదిరే
ముసా దట్టమైన అడవిని
దేశ సరిహద్దుల్లో పరిశుద్ధంగా
ప్రవహిస్తున్న మానస నది మనోహరాన్ని
భారతీయ కవితా పరిమళాన్నీ
మాసిన అద్దం ముందు కనిపించే
దృశ్యాదృశ్యాల్లా



లీలగా రూపుదిద్దుకొంటున్నట్లు
గోరునామా వచ్చినప్పుడు
వేలు తడతడ పెట్టినట్టు
పచ్చని వృక్షాల్లాంటి నులివెచ్చని కవిత్వాన్ని
అందరికోసం వెంట తీసుకు వస్తున్నాను.

- జూకంటి జగన్నాథం

సాహిత్య వార్తలు

మనిషాక పద్యం ఆవిష్కరణ

వెట్టా నాగేశ్వరరావు రాసిన వచన కవితా సంపుటి 10వ తేదీ ఉదయం పదిగంటలకు పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డి గూడెం దగ్గరలోని బయ్యన గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనందు ఆవిష్కరింపబడుతుంది. ఈ కార్యక్రమంలో జి.లక్ష్మీనారాయణ, యాకూబ్, కొప్పర్తి వెంకట రమణమూర్తి, కొమ్మవరపు విల్సన్‌రావు, అనిల్ డ్యానీ, ఇబ్రహీం నిర్గుణ్, శ్రీరామ్ పుప్పాల, తగుళ్ల గోపాల్, నాగళ్ల రమేష్ హాజరవుతారు. దీనిలో ఊరూరా కవిసంగమం కార్యక్రమం ఉంటుంది.

- మెట్ట ప్రాంత సాహితీ సంగమం, బయ్యనగూడెం

పద్యకథా పోటీ

పది పద్యాలలో కథను మీకు నచ్చిన చందస్సులో రాసి మేము నిర్వహిస్తున్న పద్య కథ పోటీకి మార్చి 31లోపు పంపాలని కోరుతున్నాము. మంచి పద్య కథ రాసిన ముగ్గురికి 1000రూ.ల చొప్పున బహుమతి ఉంటుంది. ప్రతి పద్యం తాత్పర్యం లేదా వివరణ ఇవ్వాలి. చివరలో మొత్తం కథను ఒకచోట రాసి పంపాలి. పద్యకథలు పంపవలసిన మెయిల్ ఐడి- rachanalu2019@gmail.com

-కోసూరి ఉమాభారతి, అర్చన ఫైన్ ఆర్ట్స్ అకాడమి హ్యూస్టన్, యు.ఎస్.ఎ

చైతన్య ప్రకాశ్ సంస్మరణ సభ

తెలంగాణ రచయితల సంఘం, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో చైతన్యప్రకాశ్ సంస్మరణ సభ 5వ తేదీ సాయంత్రం 6గం.లకు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్ నందు జరుగుతుంది. డా॥నాళేశ్వరం శంకరం అధ్యక్షతన జరిగే ఈసభలో ముఖ్య అతిథిగా నందిని సిధారెడ్డి, వక్తలుగా డా. కాశీం, కె.పి. అశోక్ కుమార్, డా॥వి. నరసింహారెడ్డి పాల్గొంటారు. ఈ సందర్భంగా పలువురు కవులు చైతన్య ప్రకాశ్ కవిత్వాన్ని వినిపిస్తారు. సమన్వయకర్తలుగా కందుకూరి శ్రీరాములు, బెల్లంకొండ సంపత్ కుమార్‌లు పాల్గొంటారు.

- తెలంగాణ రచయితల సంఘం

పూలబాట ఆవిష్కరణ

పింగళి వెంకట కృష్ణారావు రచించిన పూలబాట బాలశతకాన్ని 4వతేదీ సాయంత్రం 6.30 గం.లకు సాహితీ కిరణం ఆధ్వర్యంలో హైదరాబాద్, ఎల్.బి.నగర్, సౌభాగ్యనగర్ కమ్యూనిటీ హాలునందు సుధామ ఆవిష్కరిస్తారు. పొత్తూరి సుబ్బారావు అధ్యక్షతన జరిగే ఈ సభలో అన్నదానం వెంకట కృష్ణారావు, డా॥వై.రామ కృష్ణారావు, సి.హెచ్. ఎన్.ఎస్.శర్మ, పొత్తూరి జయలక్ష్మి పాల్గొంటారు.

- పొత్తూరి సుబ్బారావు

కావ్యపరిమళం

తెలంగాణ సాహిత్య అకాడమి కావ్య పరిమళం పరంపరలో భాగంగా 8వ తేదీ సాయంత్రం 6గం.లకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్ లో కాళోజీ నారాయణరావు 'నా గొడవ'పై డా॥ తూర్పు మల్లారెడ్డి ప్రసంగిస్తారు. నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు.

- డా॥ ఏనుగు నరసింహారెడ్డి-కార్యదర్శి
తెలంగాణ సాహిత్య అకాడమి

రోజుకు రూ.17 ఇస్తామని

అన్నదాతను అవమానిస్తారా?

● మేమొస్తే రైతు రుణమాఫీ ● అప్పుడే ఆర్థిక చేయూత ● కార్పొరేట్లకు కేంద్రం ఊడిగం ● బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదు ● పెరిగిపోయిన నిరుద్యోగం ● మోదీపై రాహుల్ విమర్శలు



పాట్నా: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే రైతు రుణాలన్నింటినీ మాఫీ చేస్తామని ప్రకటించారు. ప్రధాని మోడీ రోజుకు 17 రూపాయలు ఇస్తామని రైతులను అవమానిస్తున్నారని.. రైతులను అవమానిస్తే వారు ధీటైన సమాధానం ఇస్తారని అన్నారు. మోడీ ప్రభుత్వం రైతులకిచ్చే రూ.6వేల అరకొర సాయం ఎందుకూ పనిరాదని విమర్శిస్తూ.. తాము అధికారంలోకి వస్తే రైతు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించారు. తాత్కాలిక బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంతో రైతులకు ఒరిగేదేమీ లేదని రాహుల్ అన్నారు. ఈ పథకం ద్వారా అన్నదాతల నుంచి దోచుకొని కార్పొరేట్ వ్యాపారుల జేబులు నింపడానికి మోడీ ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఏఐసీసీ బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారి బిహార్‌లో నిర్వహించిన 'జన్ ఆకాంక్ష' ర్యాలీలో రాహుల్ పాల్గొన్నారు. సుమారు మూడు దశాబ్దాల తరువాత కాంగ్రెస్ బిహార్‌లో బహిరంగ సభ పెట్టడం గమనార్హం. పాట్నలోని గాంధీ మైదానంలో నిర్వహించిన బహిరంగసభలో రాహుల్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల ప్రచారంలో గొప్పలు చెప్పుకోవడం కోసమే బడ్జెట్ ప్రవేశపెట్టారని, దాని ద్వారా రైతాంగానికి ఒరిగేదేమీ లేదని అన్నారు. మోడీ పాలనలో నిరుద్యోగం రికార్డులు తిరగరాస్తోందని, ఎన్నికల హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలం అయ్యారని విమర్శించారు. నితీష్ సర్కార్ కూడా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగంతో పాటు రైతాంగ సమస్యలు పరిష్కరిస్తుందని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం రాఫెల్ ఒప్పందం చేసుకుందని విమర్శించారు. చౌకీదార్ చోర్ హై అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఫ్రాన్స్, అమెరికా, ఇంగ్లండ్ వెళ్లి అవినీతి ఆయుధ ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు.

కోట్లు వ్యాపారులకు.. వేలు రైతులకు...

అంబానీకి రూ.30వేల కోట్లు అప్పన్నంగా అందించి దేశానికి అన్నం పెట్టే రైతుకు రోజుకు రూ.17 ఇస్తారా..? అని మండిపడ్డారు. రైతు కుటుంబంలో ఒక్కొక్కరికి రూ.3.5 వస్తుందని, ఇదెక్కడి న్యాయం అని విమర్శించారు. పాట్నా, నలంద యూనివర్శిటీల్లో నాణ్యమైన విద్య అందుతుందని, కానీ నిరుద్యోగం బాగా పెరిగి పోయిందని అన్నారు. గత ఐదేళ్ల కాలంలో కార్పొరేట్ సంస్థలకు మోడీ కొన్ని లక్షల కోట్లు దోచి పెట్టారని, వారు ఏం కోరుకుంటున్నారో అది పేదల నుంచి దోచిపెట్టి ఇస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మాత్రం ప్రతీ పేదోడికి కనీస ఆదాయం కల్పిస్తామని అన్నారు. తేజస్వీ యువకుడు అని, చెప్పిన హామీలు కచ్చితంగా నెరవేరుస్తాడని తెలిపాడు. బిహార్‌లో కూటమిని గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రైతుల రుణాలను మాఫీ చేసిందని అన్నారు.

బిహార్ అభివృద్ధిలో వెనుకబడి పోవడా నికి నితీష్, మోడీనే కారణమని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ దారుణంగా మారిపోయిందని, నిరుద్యోగ సమస్య పట్టి పీడిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాట్నా సెంట్రల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సభలో మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్, ఛత్తీస్‌గఢ్ సీఎం భుపేష్ బగేల్, సీనియర్ కాంగ్రెస్ నేతలు అహ్మద్‌పటేల్, మీరాకుమారి, ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్, మాజీ కేంద్ర మంత్రి శరద్ యాదవ్, బిహార్ మాజీ సీఎం జితెన్ రామ్ మాంజీ పాల్గొన్నారు.

ప్రధానిగా రాహుల్ అర్హుడు : తేజస్వీ యాదవ్

ప్రధాని అభ్యర్థి అనే అంశంపై కూటమిలో జోరుగా చర్చ జరుగుతున్న సమయంలో ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టే అన్ని అర్హతలు రాహుల్ గాంధీకి ఉన్నాయని స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ మిగిలిన ప్రాంతీయ పార్టీలను కలుపుకుని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. దేశ వ్యాప్తంగా అన్ని పార్టీలు ఏకమైతే ఎన్‌డీఏను ఓడించడం ఎంతో సులభం అని అన్నారు. మోడీ అబద్దాలు మాట్లాడటంలో ముందుంటారని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కలిసి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తేజస్వీ వివరించారు. కరుణనిధి విగ్రహావిష్కరణలో డీఎంకే నేత ఎంకే స్టాలిన్ కూడా రాహుల్ ప్రధాని అయితే తప్పేంటి..? అనే వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు నుంచి పీఎం అభ్యర్థిగా రాహుల్‌ను ప్రతిపాదిస్తున్నట్టు స్పష్టం చేశారు.





సత్వర న్యాయంతోనే

విశ్వసనీయత

(మొదటిపేజీ తరువాయి)

న్యాయార్ధులకు సత్వరమే న్యాయం జరిగేలా చూడటమే లక్ష్యంగా పనిచేయాలని, అప్పుడే ప్రజల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసం చెక్కు చెదరకుండా వుంటుందని ఆయన అన్నారు. ఈ వ్యవస్థలో వ్యక్తిగత అనుబంధాలకు, అభిప్రాయాలకు తావులేదని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా మూడు కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. న్యాయవ్యవస్థ ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటోందని, ఈ ఏడాది 81 లక్షల కేసులు నమోదు అయ్యాయని వీటిలో 50 లక్షల పెట్టీ కేసులు ఉన్నాయని ఆయన తెలిపారు. అన్ని హైకోర్టులు ఈ కేసుల పరిష్కారంలో చొరవ చూపాలని సూచించారు. అయితే గడిచిన 10 ఏళ్ళుగా 25 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ కేసులు న్యాయ వ్యవస్థకే ఒక మచ్చన్నారు. భారీగా కేసులు పెండింగ్‌లో ఉండటానికి ప్రధాన కారణం న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉండటమేనని వెల్లడించారు. జిల్లా కోర్టులో ఐదు వేల జడ్జీల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని ఈ ఏడాది చివరినాటికి భర్తీ చేస్తామని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. హైకోర్టుకు సంబంధించి 392 జడ్జీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిలో 270 ప్రతిపాదనలు హైకోర్టు నుంచి రావాల్సి ఉండగా మరో 100 పోస్టులు సుప్రీం కోర్టు క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉందన్నారు. రెండు వారాల్లోగా సుప్రీం కోర్టులో పరిధిలో ఉన్న 100 పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని, అదే విధంగా హైకోర్టులు కూడా సత్వరమే మిగిలిన పోస్టుల భర్తీకి సంబంధించిన సిఫార్సులను పంపాలని స్పష్టం చేశారు. మరో 30 పోస్టులు కొలీజియం పరిదిలో ఉన్నాయని వెల్లడించారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించేందుకు జడ్జీలు, న్యాయవాదులు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టును నిర్మించారని, దీన్ని ప్రారంభించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

ప్రపంచ నగరాల సరసన అమరావతి: సీఎం చంద్రబాబు

పపంచ నగరాల సరసన అమరావతిని నిలిపేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. విభజన జరిగిన తర్వాత నాలుగున్నరేళ్ళ అనంతరం న్యాయ పాలన చేసేందుకు అనువైన వాతావరణం ఏర్పడిందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైబరాబాద్‌ను బ్రౌన్ ఫీల్డ్ సిటీగా నిర్మించామని, ఇప్పుడు అమరావతిని గ్రీన్ ఫీల్డ్ సిటీగా రూపొందిస్తున్నామన్నారు. రెండు వేల ఏళ్ళ చరిత్ర కలగిన అమరావతిలో నవ నగరాలు నిర్మిస్తున్నామని, దానిలో అమరావతి ఒకటని చెప్పారు. వయాడక్ట్ విధానంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. ఐదువిధానాల పాలసీని రూపొందించి వాటికి అనుగుణంగా పరిపాలన సాగిస్తున్నామని తెలిపారు. ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఈజ్‌ఆఫ్ లివింగ్, అవినీతి రహిత సమాజం నిర్మాణంలో ముందున్నామని, అత్యంత నివాసయోగ్యమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు. సింగపూర్, లండన్ తరహాలో రాష్ట్రంలోని లిటిగేషన్ల పరిష్కారం జరిగే విధంగా చూడాలని ఈసందర్భంగా ముఖ్యమంత్రి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు. అమరావతి నిర్మాణానికి రూ.50 వేల కోట్ల విలువైన భూమిని రైతులు ఇవ్వడం ఒక చరిత్రన్నారు. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.

మరో వైపు అమరావతిలో రూ.50 వేల కోట్ల పనులను ప్రణాళికా బద్ధంగా చేపట్టామని వివరించారు. సుప్రీం కోర్టు పరిధిలో ఉన్న విభజన సమస్యలను, ఇతర వివాదాలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తే ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశాలున్నాయని ప్రధాన న్యాయమూర్తి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకువచ్చారు. నల్సార్ యూనివర్శిటీ ఏర్పాటుకు అంగీకారం తెలిపితే తాము భూమి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. న్యాయ సిబ్బంది పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాల నుండి 60 ఏళ్ళకు పెంచుతున్నట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా ప్రకటించారు. హైకోర్టు ఉద్యోగులకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని, వారందరికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీనిచ్చారు. శాతవాహనుల పాలనలో అమరావతికి ఎంత వైభవం ఉందో తిరిగి అదే వైభవాన్ని తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.వి. రమణ, లావు నాగేశ్వరరావు, జస్టిస్ ఆర్. సుబాష్ రెడ్డి, ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సీ.ప్రవీణ్‌కుమార్, తెలంగాణహైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టి.బి.రాధాకృష్ణన్, న్యాయ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



శాశ్వత హైకోర్టుకు భూమి పూజ

● నవనగరాల నిర్మాణాలపై సుప్రీం సీజే ఫిదా ● సీఆర్డీయే పవర్ పాయింట్ ప్రెజెంటేషన్

అమరావతి, ఆంధ్రప్రభ: నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో మరో చారిత్రాత్మక ఘట్టానికి తెరలేచింది. తాత్కాలిక హైకోర్టును ప్రారంభించడంతోపాటు రూ.732 కోట్లతో 42 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న శాశ్వత ఐకానిక్ హైకోర్టుకు శంకుస్థాపన జరిగింది. ఆదివారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ భూమి పూజ చేశారు. అనంతరం ఐకానిక్ హైకోర్టు భవన సముదాయ శిలాఫలకాన్ని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజధానిలో నిర్మితమవుతున్న న్యాయ నగరం, అసెంబ్లీ, సచివాలయాలకు సంబంధించి అభివృద్ధి పనుల వివరాలతో కూడిన ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు సీఆర్డీయే కమిషనర్ శ్రీధర్ సుప్రీం కోర్టు న్యాయమూర్తికి ఈ పనుల వివరాలనుకూలం కుషంగా వివరించారు. తాత్కాలిక హైకోర్టు నిర్మాణం, దానిలో విని యోగించిన టెక్నాలజీని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివ రించారు. రాజధాని నిర్మాణానికి సంబంధించిన వివరాలను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. తాత్కా లిక హైకోర్టును 179 రోజుల్లో పూర్తి చేయడం పట్ల ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. అనంతరం తాత్కాలిక హైకోర్టు ప్రాంగణంలో 100 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆవిష్కరిం చారు. అదే విధంగా తాత్కాలిక భవనం ప్రవేశ ద్వారం వద్ద జాతిపిత మహాత్మాగాంధి విగ్రహాన్ని కూడా ఈ సందర్భంగా ఆవిష్కరిం చారు. రాజధానిలో నిర్మిస్తున్న తొమ్మిది నగరాల విశిష్టతను ప్రిన్సిపాల్ సెక్రటరీ అజయ్ జైన్, సీఆర్డీయే కమిషనర్ శ్రీధర్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి వివరించారు.

ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి, జస్టిస్ లావు.నాగేశ్వరరావు, ఏపీ, తెలంగాణ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ టి.బి.రాధాకృష్ణన్‌తో పాటు స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మంత్రులు పి.నారాయణ, కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనీల్‌చంద్ర పునేఠ, డీజీపి ఆర్‌పి ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకే రుణమాఫీ

● రైతుకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు ● అన్నదాత గురించి కాంగ్రెస్‌కేం తెలుసు? ● కాశ్మీర్ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోడీ



శ్రీనగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలోనే రైతు రుణమాఫీ మంత్రాన్ని జపిస్తుందని విమర్శించారు. 2008 -09 లో ఆరు కోట్ల మంది రైతులకు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన యూపీఏ ప్రభుత్వం కేవలం రూ.52 వేల కోట్లనే మాఫీ చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రారంభించిన జన్‌ధన్ ఖాతాలు ఎందుకు ఉపయోగపడతాయన్న వాళ్ల నోళ్లు మూయించేలా.. రైతుల ఖాతాల్లోకి నేరుగా రూ. 75 వేల కోట్లు జమ చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఢిల్లీలోని ఏసీ గదుల్లో కూర్చుని మంతనాలు జరిపేవారికి రూ.6 వేల విలువ తెలియదని కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. ఎర్రటి ఎండలో పనిచేసే రైతు కష్టాలు తెలియని వాళ్లంతా రుణ మాఫీ పేరుతో అన్నదాతలను మోసం చేస్తున్నారని ఆరోపించారు..2004-2014 వరకు అధికారంలో ఉన్నంతకాలం గుర్తుకురాని రైతులు ప్రతిపక్షంలోకి రాగానే గుర్తుకొచ్చారా అని కాంగ్రెస్‌కు చురకలంటించారు.2019 ఎన్నికల్లో మరోసారి గెలిచి తానే ప్రధానిగా బాధ్యతలు చేపడతానని మోడీ ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం శంకుస్థాపనలు చేసిన ప్రాజెక్టులను మళ్లీ నేనే వచ్చి ప్రారంభిస్తా. అని మోడీ చెప్పుకొచ్చారు. జమ్ము కాశ్మీర్‌లో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన ప్రధాని.. సరిహద్దుల్లోని లెహ్, లడఖ్ లాంటి ప్రాంతాల రైతులకు కూడా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి నుంచి ఆర్థిక సాయం అందుతుందని హామీ ఇచ్చారు. పీఎం కిసాన్ పథకానికి దరఖాస్తు చేసుకునే చిన్నరైతులందరికీ త్వరలోనే తొలివిడత ఆర్థిక సాయంగా రూ.2 వేలు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన రుణమాఫీ కేవలం 30 శాతం రైతులకే చేరిందని.. వారిలోనూ 30-35 లక్షల మంది అనర్హులకే లబ్ది జరిగిందని కాగ్ నివేదకలో కడిగిపారేసిందన్నారు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జమ్ముకాశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతాలను విస్మరించిందని ధ్వజమెత్తిన మోడీ.. అలాంటి పాడుబడ్డ సంస్కృతికి చరమగీతం పాడామన్నారు. విభజన రాజకీయాలను నిర్మూలించి అందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు.

రూ.6వేల కోట్ల ప్రాజెక్టులకు మోడీ శ్రీకారం

జమ్ము కాశ్మీర్ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ.. విజయ్‌పురలో ఎయిమ్స్ సహా రూ. 6 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. చీనాబ్ ప్రాంత ప్రజల ఇబ్బందుల నేపథ్యంలో దేవికా, తావి నదుల మీదుగా ఏర్పాటు చేయనున్న బ్రిడ్జీకి మోడీ శంకుస్థాపన చేశారు.కథువాలో ఏర్పాటుచేయనున్న మాస్ కమ్యూనికేషన్ అండ్ యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీకి కూడా శ్రీకారం చుట్టారు.

మరో 5 వర్శిటీల మూత?

● అమెరికాలో రోడ్డున పడనున్న 80 వేల మంది విద్యార్థులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అగ్రరాజ్యం అమెరికాలో మరో ఐదు నకిలీ విశ్వవిద్యాలయాల మూసివేతకు రంగం సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. తాజాగా చోటు చేసుకున్న ఫర్మింగ్‌టన్ విశ్వవిద్యాలయం తరహాలోనే వివిధ రాష్ట్రాల్లో ఉన్న మరో ఐదు ప్రైవేటు వర్సిటీలలో చోటు చేసుకున్న కార్యకలాపాల నేపథ్యంలో వాటిని మూసివేయించాలన్న నిర్ణయానికి అమెరికా ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఐదు వర్సిటీలలో వివిధ కోర్సులనభ్యసిస్తున్న 80 వేల మంది విద్యార్థుల భవిత ప్రశ్నార్థకంగా మారనుంది. ఇందులో 50 వేల మంది భారత విద్యార్థులుండటం గమనార్హం. ఇప్పటికే నకిలీ వర్సిటీ ఫర్మింగ్‌టన్‌లో ప్రవేశం పొందిన 130 మంది తెలుగు విద్యార్థులపై అక్కడి పోలీసులు కేసులు నమోదు చేసి జైళ్ళో పెట్టిన సంగతి విదితమే. ఈ ఐదు విశ్వవిద్యాలయాలు మూతబడితే పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటుందని అమెరికాలో ఉన్న తెలుగు సంఘాలు, ప్రవాసులు ఆందోళన చెందుతున్నారు. అమెరికాలో ఉంటున్న వలసదారులు ఈ నెల 5వ తేదీలోపు దేశం విడిచి వెళ్లిపోవాలని అమెరికా ప్రభుత్వం హుకుం జారీ చేయడంతో అక్కడ అక్రమంగా ఉంటున్న విద్యార్థులు, నిరుద్యోగులలో ఆందోళన మొదలైంది. మాస్టర్స్ కోర్సులో చేరి అది పూర్తయ్యాక.. ఉద్యోగం రాక.. మరో పీజీ కోర్సును ఎంచుకుని, అప్పటికీ ఉపాధి రాకపోవడంతో ఒక్కో విద్యార్థి నాలుగైదు పీజీ కోర్సులను చేస్తూ కాలం వెళ్లిబుచ్చుతున్నారన్న సమాచారం అందుకున్న అమెరికా ప్రభుత్వం అటువంటి వారిని గుర్తించి స్వదేశానికి పంపించాలని ఆదేశించడంతో హోంల్యాండ్ పోలీసులు రంగంలోకి దిగారు. అందులో భాగంగానే అక్కడి పోలీసులు నకిలీ వర్సిటీని ఏర్పాటు చేసి వెబ్‌సైట్లలో భారీ ప్రకటనలు ఇవ్వడంతో విదేశీ విద్యార్థులు ఆకర్షితులై ఆ యూనివర్సిటీలో ప్రవేశం పొందారు. ఐదేళ్ల తర్వాత అసలు గుట్టును విప్పడంతో భారత విద్యార్థులంతా నిర్ఘాంతపోయారు. ఈ మూడేళ్లలో 600 మంది విద్యార్థులకు ఫర్మింగ్‌టన్ విశ్వవిద్యాలయం ప్రవేశాలు కల్పించడంతో పాటు వారినుంచి ఫీజుల రూపేణా లక్షలాది రూపాయలను వసూలు చేసింది. ఈ విశ్వ విద్యాలయానికి సంబంధించి విస్తృతంగా ప్రచారం చేయడంతో అమెరికాలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో చేరి ఒకట్రెండు సెమిస్టర్లు పూర్తి చేసిన విద్యార్థులు సైతం అక్కడ్నించీ బదిలీ అయి ఈ విశ్వవిద్యాలయంలో తాజాగా ప్రవేశాలు పొంది పోలీసులకు దొరికిపోయారు. ఈ తరహాలోనే మరో ఐదు విశ్వవిద్యాలయాలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయని, కొన్ని రోజుల్లోనే ఈ విశ్వవిద్యాలయాల అక్రమాలు బయటకు వస్తాయని తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ప్రతినిధి మోహన్ నన్నపనేని చెప్పారు. అమెరికాలో వందలాది విశ్వవిద్యాలయాలున్నాయని,

ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న వర్సిటీలు ఎటువంటి ప్రచారం చేసుకోకుండా టోఫెల్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా ఐ-20 మంజూరు చేశాకే ముందుకు సాగుతున్నాయని, అక్రమాలు కేవలం ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లోనే చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. కొన్ని ప్రైవేట్ విశ్వవిద్యాలయాల యాజమాన్యాలు, నిర్వాహకులు ప్రవేశాల కోసం అడ్డదారులు తొక్కుతున్నాయని భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో వీరు పర్యటిస్తూ స్టార్ హోటళ్లలో విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి ప్రవేశాలు జరుపుతున్నట్లు తాజా విచారణలో వెల్లడైంది. ఇందుకు ఆయా వర్సిటీల ప్రతినిధులు విద్యార్థులను ఆకర్షిస్తూ.. మాయమాటలు చెప్పి వారిని బుట్టలో వేసుకుని నమ్మించి ప్రవేశాలు కల్పిస్తున్నాయని, దీంతో విద్యార్థులు సైతం ఆకర్షితులై ఎటువంటి విచారణ చేయకుండానే అమెరికాకు వెళుతున్నారని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. తరగతులకు రాకపోయినా ఎటువంటి ఇబ్బంది లేదని, ఉద్యోగానికి గ్యారంటీ ఇస్తామంటూ వర్సిటీల నిర్వాహకులు కల్లబొల్లి కబుర్లు చెప్పి ప్రవేశాలు కల్పించి వారినుంచి సెమిస్టర్‌కు రూ.10 నుంచి రూ.20 లక్షల ఫీజులను వసూలు చేస్తున్నట్లు సమాచారం.

ఓటర్ల లిస్టు తప్పుల తడక!

(మొదటిపేజీ తరువాయి)

సరిచూసే ప్రక్రియలో భాగంగా 3 వేల ఓట్ల డబ్లింగ్ ఉంటున్నట్లు గుర్తించామని అన్నారు. స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయనున్నామన్నారు. ఎన్నికల కమిషన్ విడుదలచేసిన ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉంటడంతో పాటు ఎవరింట్లో ఎవరి ఓట్లు ఉన్నాయో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. గతేడాది చివరిలో విడుదల చేసిన జాబితాలో కూడా తప్పులు దొర్లడంతో ఆనాడు ఫిర్యాదు చేసామని, అయినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటరు ఓటు వేయడానికి చాలా ఇబ్బందులు పడే పరిస్థితులను ఎన్నికల కమిషన్ కల్పిస్తున్నట్లు ప్రస్తుత జాబితా తెలియజేస్తోందని అన్నారు. ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ పూర్తిస్థాయిలో పరిశీలన చేసి మరోసారి జాబితాను విడుదల చేయాల్సి ఉందన్నారు. ఓటర్ల నమోదు, ఓటు మార్పు లాంటి అంశాల్లో బిఎల్ఓ లు స క్రమంగా విధులు నిర్వహించలేదని తెలుస్తోందని, ఓటర్ల జాబితాలో కూడా టీడీపీ మోసం చేసే ప్ర క్రియ ప్రారంభించిందా అనే అనుమానాలు కూడా తలెత్తుతున్నాయని అన్నారు. తమ పార్టీ అధినేత ఈ తప్పుల ఓటర్ల జాబితాపై కేంద్ర ఎన్నికల కమిషన్ ను కలుస్తున్నారని అన్నారు.

భీమవరం పట్టణంలో మొత్తం 39 వార్డులుండగా ఎవరి ఓటు ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి ఆ ఏరియా భాగం సంఖ్యల జాబితాను పరిశీలించినా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్ల స్లిప్‌ను పంపిణీ చేయడానికి కూడా అవకాశం లేని విధంగా జాబితా ఉందని, ఎన్నికల కమిషన్ వెంటనే ఈ తప్పులను సరిదిద్ది మరో ఓటర్ల జాబితాను విడుదల చేయాలని గ్రంధి శ్రీనివాస్ డిమాండ్ చేసారు.

దుర్గ గుడిలో నకిలీ టికెట్ల దందా!

(మొదటిపేజీ తరువాయి)

నెంబర్‌తో అనేక దర్శన టిక్కెట్లు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధిక రద్దీ రోజుల్లోను తక్కువ ఆదాయం రావడంతో అనుమానించి ఆలయ ఈవో టిక్కెట్ల విక్రయాలపై ప్రత్యేకంగా విచారించగా ఈ అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చిందంటున్నారు. ఒకే నెంబర్‌తో భారీ సంఖ్యలో అమ్మ వారి దర్శనం టిక్కెట్లను దొడ్డి దారిని భక్తులకు విక్రయించి, లక్షలాది రూపాయల ఆలయ ఆదాయానికి గండికొట్టినట్లు సమాచారం. లక్షల్లోనే అవినీతి జరిగినట్లు ప్రాథమిక విచారణ ద్వారా అంచనాకు వచ్చారు. ఎప్పటి నుంచో ఈ అవినీతి లీలలు ఆలయంలో నడుస్తున్నా ఇంతవరకు ఎవరికీ తెలియలేదని అనుమానిస్తున్నారు. ఈ మధ్య దసరా,సంక్రాంతి పండుగల సందర్భంలో లక్షల సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించి, అమ్మ వారి దర్శనం చేసుకున్నారు..కానీ తీరా టిక్కెట్ల ఆదాయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే ఏదో మతలబు జరిగిందని అధికారులు అనుమానించారు. దీనిపై కొంత ప్రాథమిక విచారణ జరిపితే అనుమానం నిజమేనని తేల్చారు. ప్రస్తుతం గత సంవత్సరం నుంచి ఇప్పటివరకు జరిగిన దర్శనం టిక్కెట్ల విక్రయాల గురించి ఈవో కోటేశ్వరమ్మ ఆదేశాలతో అధికారుల బృందం నిగూఢంగా విచారణ జరుపుతొంది.కొన్ని నకిలీ దర్శనం టిక్కెట్లు అధికారులకు లభించినట్లు తెలిసింది.

నకిలీ టిక్కెట్ల విక్రయాల వెనుక ఉన్న వ్యక్తుల గురించి, ఆరా తీసే పనిలో ఉన్నారు. అతి త్వరలోనే ఈ అవినీతి చక్రవర్తుల భరతం పడతామని దుర్గ గుడి అధికారులు అంటున్నారు.ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కూడా అధికారులు సిద్దమవుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద నకిలీ దర్శనం టిక్కెట్ల విక్రయాల వ్యవహారం కలకలం రేపుతుంది. ఇప్పటి వరకు ఇటువంటి ఆరోపణలు టిటిడిలోనే వెలుగులోకి వచ్చాయి. ఇప్పుడు తాజాగా బెజవాడ దుర్గమ్మ గుడిలో కూడా ఈ తరహా ఘటనలు చోటు చేసుకోవడం విస్మయం కలిగిస్తోంది.

నెలకు మరో రూ. 500?


● రైతు సాయం రెట్టింపునకు కేంద్రం యోచన ● సూచన ప్రాయంగా వెల్లడించిన అరుణ్‌జైట్లీ ● రాహుల్ విమర్శలను తోసిపుచ్చిన ఆర్థికమంత్రి

న్యూయార్క్: పేద రైతులకు ప్రకటించిన ఆర్థికసహాయాన్ని రెట్టింపు చేసేదిశగా కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో, చిన్న, సన్నకారు రైతులకు ఏడాదికి రూ. 6000 ఆర్థిక సహాయం ప్రకటించారు. దీనిపై విపక్షాలు విమర్శల దాడి దిగాయి. పెద్దలకు వేల కోట్లు దోచిపెట్టి.. రైతులకు మాత్రం చిల్లర విదుల్చుతారా? రోజుకు కేవలం 17 రూపాయల సాయంతో రైతులను అవమానిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎదురుదాడి చేసింది. దీనికితోడు ఇప్పటికే తెలంగాణ, ఒడిశా వంటి కొన్ని రాష్ట్రాలు రైతులకు నగదు బదిలీ కింద కేంద్రం కంటే ఎక్కువ మొత్తం అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం జైట్లీ స్పందించారు. మనుముందు రైతులకు మరింత లబ్ధి చేకూరుస్తామని భరోసా ఇచ్చారు. ఇప్పుడు ప్రకటించిన సాయానికి అదనంగా, నెలకు మరో 500 రూపాయలు చెల్లిస్తామని స్పష్టంచేశారు.

భవిష్యత్‌లో ప్రభుత్వ వనరులు వృద్ధిచెందే కొద్దీ ఈ సాయం క్రమంగా పెరుగు తుందని చెప్పారు. రైతు ఆదాయ మద్దతు పథకం ఇప్పుడే మొదలైంది. భవిష్యత్‌లో దీన్ని ప్రభుత్వం మరింత అభివృద్ధి చేస్తుంది. కేవలం 15 కోట్ల మంది భూమిలేని రైతులు ఈ పథకానికి దూరంగా ఉన్నారు. వారికి గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఇతర సంక్షేమ పథకాలను అందిస్తామని జైట్లీ స్పష్టం చేశారు.

ఆంధ్రప్రభ

9న ఆర్బీఐ బోర్డుతో గోయల్ భేటీ



న్యూఢిల్లీ: సంప్రదా యం ప్రకారం బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత రిజర్వుబ్యాంకు బోర్డును ఉద్దేశించి బడ్జెట్ ముఖ్యాంశాలను గురించి ఆర్థికమంత్రి ఆర్బీఐకి వివరిస్తారు. ఈ నెల 9వ తేదీన ఆర్థికమంత్రి పీయూష్‌గోయల్ ఆర్బీఐబోర్డుతో భేటీ కానున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఫిబ్రవరి 9వ తేదీన జరిగే సమావేశంలో ఈ ఆర్థికసంవత్సరంలో ఆర్బీఐ నుంచి ప్రభుత్వానికి రావాల్సిన మధ్యంతర డివిడెండ్‌ను గురించి ప్రముఖంగా ప్రస్తావిస్తారని భావిస్తున్నారు. కాగా ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేగలోగా ఆర్బీఐ నుంచి రూ.28వేల కోట్లు డివిడెండ్‌ను ఆశిస్తోంది. కాగా రిజర్వుబ్యాంకు జులై - జూన్‌ను ఆర్థిక సంవత్సరంగా పాటిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ ప్రభుత్వానికి ఇప్పటి వరకు రూ.40వేల కోట్లు డివిడెండ్‌ను చెల్లించింది. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో పెద్దమొత్తంలో ఆర్థికమంత్రి వరాలు కురిపించారు. దీంతో ద్రవ్యలోటును అదుపు చేయడం కష్టం. మధ్యతరగతిని ప్రసన్నం చేసుకోవడానికి రూ.5 లక్షల ఆదాయంపై పన్ను మినహాయింపు ఇచ్చారు. అలాగే సన్నకారు రైతులకు ఏడాదికి రూ.6,000ల వరకు వారి ఖాతాలో నగదు జమ చేస్తామని ప్రకటించారు. దీంతో సుమారు 12 కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతారు. ఆర్థికమంత్రి గోయల్ వచ్చే ఆర్థిక సంవత్సరానికి పాడి, చేపల రంగంపై ఆధారపడ్డ రైతులకు రుణాలపై వడ్డీ రాయితీలు ప్రకటించారు. దీంతో పాటు ప్రకృతివిపత్తులు ఏర్పడిన ప్రాంతాల్లోని రైతులకు కూడా వడ్డీపై రాయితీలు ప్రకటించారు. స్టాండర్డ్ డిడెక్షన్‌ను రూ.10వేల నుంచి రూ.40వేలకు పెంచారు. ఇవన్నీ ప్రభుత్వంపై అదనపు భారం పడతాయి. దీనికి పెద్దమొత్తంలో నిధులు కావాల్సి వస్తుంది. నిధుల కోసం మోడీ సర్కార్ ఆర్బీఐని ఆశ్రయించాల్సి వస్తోంది.



ఫలితాలు.. పాలసీ రేట్లు కీలకం

- నిపుణుల అంచనా
- ఈ వారం మార్కెట్

ముంబై: ఈ వారం స్టాక్ మార్కెట్లకు కీలకం కానున్న అంశాల విషయానికి వస్తే ఈ వారంలో రిజర్వుబ్యాంకు ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్ష, ప్రస్తుతం కొనసాగుతున్న డిసెంబర్ త్రైమాసిక ఫలితాలని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో పాటు గత శుక్రవారం నాడు పీయూష్ గోయల్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. దాని ప్రభావం కూడా మార్కెట్లపై ఉంటుందంటున్నారు. మొత్తానికి ఈ వారం మార్కెట్లను ముందుకు నడిపించే అంశాల విషయానికి వస్తే రిజర్వుబ్యాంకు ద్రవ్య పరపతి సమీక్ష, కార్పొరేట్ ఫలితాలు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు కీలకం కానున్నాయి. బడ్జెట్‌లో ప్రభుత్వం కొన్ని రంగాలను బలోపేతం చేసే విధంగా వరాలు కురిపించింది. దీంతో ఆయా రంగాల కార్పొరేట్ ఫలితాలు రాబోయే రోజుల్లో జోరందుకుంటాయి. అయి తే అదే సమయంలో ద్రవ్యోల్బణం పెరుగుతుంది. వడ్డీరేట్లు పెరుగుతాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి తక్షణమే మార్కెట్లపై ప్రభావం చూపించే అంశాల విషయానికొస్తే ఫిబ్రవరి 7వ తేదీన జరిగే ఆర్బీ పరపతి విధానసమీక్షేనని చెబుతున్నారు. అలాగే సేవల రంగం పీఎంఐ గణాంకాలు కూడా మార్కెట్లపై ప్రభావం చూపుతాయంటున్నారు. ఈ వారంలో ఫలితాలు ప్రకటించబోతున్న అతి పెద్ద కార్పొరేట్ కంపెనీలు ఇలా ఉన్నాయి. సీఐఎల్, ఐడీబీఐ, బీహెచ్ఈఎల్, గెయిల్, పీఎన్‌బీ, సిప్లా, లూపిన్‌లున్నాయి. రాబోయే కొన్ని రోజుల పాటు మార్కెట్లపై బడ్జెట్ హ్యాంగోవర్ ఉంటుంది. గత వారం సెన్సెక్స్ 443.89 పాయింట్లు లాభపడింది.

ఆర్‌కామ్ కథ ఎన్‌సీఎల్‌టీకి

- ఆస్తుల విక్రయానికి నయా ప్రతిపాదన
- మళ్లీ ఎన్‌సీఎల్‌టీ చెంతకు
- బోర్డు తాజానిర్ణయం
- ఆర్‌కామ్‌కు రూ.45 వేల కోట్ల అప్పులు

న్యూఢిల్లీ: అనిల్ అంబానీకి చెందిన టెలికం కంపెనీ రిలయన్స్ కమ్యూనికేషన్స్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ ఎన్‌సీఎల్‌టిని ఆశ్రయించనున్నట్లు ఆదివారం నాడు తెలిపింది. ట్రిబ్యునల్ ముందు కూడా కోర్టు వెలుపల ఎలాంటి పరిష్కారం చేసుకోవాలని ప్రతిపాదించామో అదే ప్రతిపాదనను ఎన్‌సీఎల్‌టి ముందుంచుతామని ఆర్‌కామ్ వెల్లడించింది. ఇదిలా ఉండగా ఆర్‌కామ్ ఆస్తులను విక్రయించి బ్యాంకులకు, సప్లయిర్లకు బకాయిలు చెల్లిస్తామని హామీలు గుప్పించి ఆస్తులు విక్రయించడంతో విఫలం చెందింది. దీంతో గత వారం దివాలాకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించింది. ఇదిలా ఉండగా ఆర్‌కామ్ యాజమాన్యం గతంలో ఎన్‌సీఎల్‌టి కోర్టు వెలుపల ఈ కేసును పరిష్కరించుకుంటామని హామీ ఇచ్చింది. అదే ప్రతిపాదనను మళ్లీ ఎన్‌సీఎల్‌టి ముందు బకాయిలు ఎలా తీరుస్తామో ఒక ప్రణాళికను సిద్ధం కేసు దివాలాకోర్టుకు అందజేస్తామని ఆర్‌కామ్ ఒక ప్రకటనలో వెల్లడించింది. కంపెనీలో జరుగుతున్న తాజా పరిణామాలపై విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం... కంపెనీ ఆస్తులను విక్రయించి బ్యాంకులకు, సరఫరా దార్లకు చెల్లించాలని నిర్ణయించింది. అయితే కంపెనీ ఆస్తులను విక్రయించాలంటే బ్యాంకులు కానీ సరఫరా దార్ల నుంచి అనుమతులు దక్కించకోవడం పెద్ద తలనొప్పి అని, ఆస్తులను విక్రయించి బకాయిలు తీరుద్దామంటే బ్యాంకులు ఈ ఆస్తులను విక్రయించకుండా అడ్డుపుల్లలు వేయడంతో బకాయిలు తీర్చలేకపోతున్నమని భావించి.. ఎట్టకేలకు ఎన్‌సీఎల్‌టిని ఆశ్రయించి .... ఆస్తులను విక్రయించి ఏ బ్యాంకు ఎంత మొత్తం చెల్లిస్తామో లిఖితపూర్వకంగా హామీ ఇచ్చి ఆస్తుల విక్రయానికి అనుమతి దక్కించుకోవాలనేది ఆర్‌కామ్ ప్రయత్నమని చెబుతున్నారు.

ముఖేష్‌కు ఆస్తుల విక్రయంలో విఫలం

ఇదిలా ఉండగా అప్పుల నుంచి బయటపడేందుకు అన్న ముఖేష్ అంబానీని ఆశ్రయించి ఆర్‌కామ్ స్పెక్ట్రమ్



ఆస్తులను రిలయన్స్ జియోకు విక్రయించడంలో కూడా అనిల్ అంబానీ విఫలం అయ్యారు. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరి ఉంటే అనిల్‌కు అప్పుల నుంచి కాస్తా ఉపశమనం లభించేది. ఇదిలా ఉండగా ఆర్‌కామ్ స్పెక్ట్రమ్‌ను జియోకు విక్రయించి రూ.975 కోట్లు సేకరించాలని అంచనా వేసింది. ఆ మొత్తంలో రూ.550 కోట్లు టెలికం తయారీ కంపెనీ ఎరిక్‌సన్‌కు చెల్లించేసి, మిగిలిన రూ.230 కోట్లు రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్ మైనారిటీ వాటాదరులకు చెల్లించాలని ప్రణాళిక సిద్ధం చేసింది. అయితే ఆర్‌కామ్ ఆస్తులు కొనుగోలు చేయడానికి రిలయన్స్ జియో ఒక షరతు విధించింది. ఆర్‌కామ్ ఆస్తులు కొనుగోలు చేసినా.. భవిష్యత్తులో డిపార్టుమెంట్ ఆఫ్ టెలికం తమకు ఆర్‌కామ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేయరాదనే కండిషన్ విధించింది. ఆర్‌కామ్ అప్పులకు తాము బాధ్యులం కాదని, దీనికి డాట్ నుంచి సర్టిఫికెట్

ఇదిలా ఉండగా ఆర్‌కామ్ ఇప్పటికే పలు అంశాలపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ నుంచి పలు ఆటంకాలను ఎదుర్కొంటోంది. డాట్ లేవనెత్తిన పలు అంశాలు హైకోర్టుకు చేరాయి. టీడీసాట్, సుప్రీంకోర్టులు ఆర్‌కామ్ ఆస్తుల అమ్మకాల ప్రతిపాదనపై ఇప్పటి కే విసుగు చెంది.. ఈ కేసు పరిష్కారానికి ఎన్‌సీ ఎల్‌టికి వెళ్లండని సూచించాయి.

ఆస్తుల అమ్మకానికి అడ్డంకులు

ఆర్‌కామ్ ఆస్తులను విక్రయించాలంటే మైనారిటీ వాటాదారులు ఒక్క పక్క అభ్యంతరాలు లేవనెత్తు తున్నారు. దీంతో ఎన్‌సీఎల్‌టిని ఆశ్రయించి దీనికి పరిష్కారం కనుగొనాలని ఆర్‌కామ్ భావిస్తోంది. ఎన్‌సీఎల్‌టి నిబంధనల ప్ర కారం ఆస్తుల అమ్మకానికి 66 శాతం మం ది ఆమోదిస్తే మెజారిటీ లభించినట్లేనని ఆర్‌కామ్ ప్రతినిధి ఒకరు తెలిపారు.



తీసుకురావాల్సిందిగా ఆర్‌కామ్‌ను జియో కోరడంతో సీన్ మళ్లీ రివర్స్ అయ్యింది. యథాపూర్వక స్థితికి వచ్చి చేరింది.

ఈ తలనొప్పులన్నీ ఎందుకని ఆర్‌కామ్ బోర్డు ఈ సమస్యనుంచి త్వరగా బయటపడేందుకు ఎన్‌సీఎల్‌టిని ఆశ్రయించింది. ఎన్‌సీఎల్‌టి ద్వారా త్వరగా ఈ సమస్య పరిష్కారం అవుతుందని, ఆస్తులను వీలైనంత త్వరగా విక్రయించుకొని లేదా ఎవరైనా కొనుగోలు చేస్తే వచ్చిన డబ్బును బకాయిలు తీర్చి బయటపడాలని చూస్తున్నట్లు ఆర్‌కామ్ ప్రకటనలో వివరించింది.

ఆర్‌కామ్ అప్పులు

ప్రస్తుతం రిలయన్స్ కమ్యూనికేషన్స్ అప్పులు వడ్డీలు కాకుండా రూ.38వేల కోట్లుగా తేలాయి. వాటిలో రూ.19,800 కోట్లు భారతీయ బ్యాంకులకు బకాయిలు చెల్లించాల్సి ఉండగా.. విదేశీ బ్యాంకులకు రూ.18,200 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు విశ్వసనీయవర్గాలు తెలియజేశాయి. ఇదిలా ఉండగా ఆర్‌కామ్ ఆస్తులను విక్రయించి బకాయిలు చెల్లించాలని గట్టి ప్రయత్నాలే మొదలుపెట్టింది. ముఖ్యంగా టెలికం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆస్తులు, స్పెక్ట్రమ్, సముద్రగర్భంలోని కేబుల్ కంపెనీ అనుసంబంధ సంస్థ జీసీఎక్స్, ఐడీఎక్స్, ఇండియన్ ఎంటర్‌ప్రైజెస్ బిజినెస్, అలాగే ధీరూభాయి అంబానీ నాలెడ్జ్ సిటిలో 30 మిలియన్ చదరపు అడుగులు నిర్మాణం చేపట్టి. వాటిని విక్రయించడంతో పాటు రిలయన్స్ ఎస్టేట్ ఆస్తులను విక్రయించి బకాయిలు తీర్చాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనలు చేసిన 18 నెలలు గడిచిపోయినా.. ఆస్తులు విక్రయించి రుణాలు ఎలా తీరుస్తామనే ప్రతిపాదనను తమకు ఇవ్వలేదని బ్యాంకులు అంటున్నాయి. దీంతో అనిల్ అంబానీ బకాయిలు తీర్చే తీర్మానం ప్రక్రియ ఒక్క అడుగుకూడా ముందుకు సాగలేదని అంటున్నారు.

స్పెక్ట్రమ్ అప్పగిస్తాం: టాటాటెలీ

టాటాటెలిసర్వీసెస్ తమకు కేటాయించని స్పెక్ట్రమ్ తిరిగి అప్పగిస్తామని ఆఫర్ చేసింది. ప్రస్తుతం భారతి ఎయిర్‌టెల్‌తో విలీనం కంటే ముందు వీటిని తిరిగి అప్పగించాలనుకుంటోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికం రెండు కంపెనీల విలీనాన్ని ఆమోదించాల్సి ఉందని అధికారులు తెలియజేశారు. టాటాటెలీకి 800 మెగాహెర్జ్ బ్యాండ్ స్పెక్ట్రమ్. 4జీ సర్వీసెస్‌కు వినియోగిస్తారు. సుమారు 15-16 సర్కిల్స్‌లో ఎలాంటి వేలం పాటలో పాల్గొనకుండానే టెలికంశాఖ కేటాయించింది. ఇదే 800 మెగాహెర్జ్ 2జీ సర్వీసెస్‌కు కూడా వినియోగిస్తారు. అయితే ఎయిర్‌టెల్‌కు ఈ స్పెక్ట్రమ్ బదిలీ చేయడానికి నిబంధనలు ఒప్పుకోవు. డాట్, ఎయిర్‌టెల్, టాటా టెలీసర్వీసెస్ ఇటీవల జరిగిన సమావేశంలో 2.5 మెగాహర్జ్‌స్పెక్ట్రమ్.. టాటాటెలి అడ్మినిస్ట్రేటివ్‌కు 800 మెగాహర్జ్‌బ్యాండ్‌లో ఇచ్చిన అన్నీ సర్కిల్స్‌లో తిరిగి అప్పగించాలనే నిర్ణయానికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా టాటాటెలిసర్వీసెస్ సుమారు రూ.40వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. అయితే భారతి ఎయిర్‌టెల్‌లో విలీనం అవుతున్నట్లు అక్టోబర్ 2017లో ప్రకటించింది. అయితే ఎయిర్‌టెల్ మాత్రం ఈ అప్పులను తన ఖాతాలో వేసుకోమని స్పష్టం చేసింది.

ఫిక్స్‌డ్ డిపాజిట్లకు డిమాండ్

టీడీఎస్ రూ.10 వేల నుంచి రూ.40 వేలకు పెంపుతో జోష్..



హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరం 2019-20 బడ్జెట్‌లో ఆర్థికమంత్రి పీయూష్ గోయెల్ మధ్యతర గతిపై వరాల జల్లు కురిపించా రు. మధ్య తరగతి వారు తమ డబ్బుకు సురక్షితమై న పెట్టుబడి బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్. అయితే ఇప్పటి వరకు ఎఫ్‌డీపై ఏడాదికి రూ.10వేల వడ్డీ వస్తే దానిపై టీడీఎస్ (టాక్స్ డిడెక్షన్ ఎట్ సోర్స్) కింద పన్ను కోత విధించే వారు. దీన్ని గోయల్ తాజా బడ్జెట్‌లో రూ.40వేలకు పెంచారు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 194-ఏ, 194-1 లో సవరణలను ప్రతిపాదించారు. అలాగే సెక్షన్ 194-ఏలో సవరణలు చేశారు. పోస్టాఫీసుల్లో లేదా బ్యాంకుల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో డిపాజిట్‌పై రూ.10వేలు దాటిందంటే దానిపై 10 శాతం పన్ను విధించే వారు. దాన్ని ఆర్థికమంత్రి నాలుగు రెట్లు పెంచారు. ఏప్రిల్ 1 నుంచి డిపాజిట్లపై రూ.40వేల వరకు వడ్డీ వస్తే దానిపై ఎలాంటి పన్ను కోత ఉండదు. అది పోస్టాఫీసు ఎఫ్‌డీ లేదా బ్యాంకు ఎఫ్‌డీ అయినా మినహాయింపు ఉంటుంది. తాజాగా ఎఫ్‌డీపై టీడీ ఎస్‌ను రూ.10వేల నుంచి రూ.40వేలకు పెంచ డంతో బ్యాంకు ఎఫ్‌డీలకు డిమాండ్‌కు పెరుగు తుందని బ్యాంకులు అంచనా వేస్తున్నాయి. టీడీ ఎస్ పరిమితిని నాలుగు రెట్లు పెంచినందున ఎవరైనా బ్యాంకుల్లో రూ.5 లక్షల వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే బ్యాంకు ఇచ్చే వడ్డీపై ఎలాంటి టీడీఎస్ కోత ఉండదు. (వడ్డీరేటు 8 శాతం గా) గిట్టుబాటు అయ్యే అవకాశాలున్నాయి.

ప్రభుత్వం ఐటి చట్టంలోని 194ఏని సవరించ డం వల్ల బ్యాంకులు టీడీఎస్‌లో కోతను నాలుగు రెట్లు పెంచడంతో ఇక కో ఆపరేటివ్ సొసైటీలు, పోస్టాఫీసులు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు కూడా ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి తమకూ ఇలాంటి రాయితీలు ఇవ్వడానికి అనుమతించాల ని కోరాలనుకుంటున్నాయి. ప్రభుత్వాన్ని గత కొంత కాలంగా ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ టీడీఎస్‌ను పెంచాలని కోరుతున్నట్లు ఐబీఏ చైర్మన్ సునీల్ మెహతా చెప్పారు. పన్ను మినహాయింపు వల్ల ఎక్కువ లబ్ధి పొందేది మాత్రం సీనియర్ సిటిజన్స్ అని.. చాలా మంది టాక్స్ బ్రాకెట్ లోకి రారని, ఒకవేళ సమయంలో టాక్స్‌ఫైలిం గ్ చేయకపోతే లబ్ధిని కోల్పోతారని ఆయన అన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్‌నిధి కింద రైతులకు ఏడాదికి రూ.6వేలు వారి ఖాతాలో జమ కావడంతో బ్యాంకుల్లో డిపాజిట్లు పెరుగుతాయని బ్యాంకర్లు భావిస్తున్నారు. ప్రత్యక్షనగదు బదిలీ ద్వారా సుమారు 12 కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతారు. టీడీఎస్‌లో పన్ను మినహాయింపును నాలుగు రెట్లు పెంచడం వల్ల మధ్యతరగతి వారి చేతుల్లో సుమారు రూ.23వేల కోట్లు నగదు ఆడుతుందని బ్యాంకర్లు అభిప్రాయపడుతున్నారు. అలాగే కస్టమర్లు తమ వద్ద ఉన్న డబ్బును ప్రస్తుతం ఇతర చోట్ల డిపాజిట్ చేసి ఉంటే వారు ఆ డబ్బును బ్యాంకు ఎఫ్‌డీలకు తరలిస్తారని.. ఎందుకంటే బ్యాంకుల్లో ఎఫ్‌డీ సురక్షితం.. డబ్బు ధోకా ఉండదని బ్యాంకర్లు అభిప్రాయపడుతున్నారు.

చమురు కంపెనీల మూలధనం వ్యయంలో కోత



- నాలుగేళ్ల కనిష్ఠానికి..
- 2019-20లో రూ.93.693 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగానికి చెందిన చమురు కంపెనీల మూలధనం వ్యయంలో కేంద్రప్రభుత్వం భారీ కోత విధించింది. నాలుగేళ్లకనిష్ఠానికి కుదించింది. పీఎస్‌యు చమురు కంపెనీలు ఉదాహరణకు ఓఎన్‌జీసీ, ఐఓ సీలు ఈ ఆర్థిక సంవత్సరంలో చమురు సహజ వాయు వు అన్వేషణతో పాటు రిఫైనిగ్‌తో, పెట్రో రసాయనాల కోసం 2019-20 లో రూ.93,693 కోట్లు మాత్రమే వ్యయం చేస్తుంది. మూలధనం వ్యయం కోసం ఓఎన్‌జీసీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేష్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేష న్ లిమిటెడ్, మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్‌లు వాటి సబ్సీడీలను 2014-15 ఆర్థిక సంవత్సరం నాటి స్థాయికి తీసుకువచ్చాయి.. ఈ అంశాలను కేంద్ర బడ్జెట్ 2019-20 డాక్యు మెంట్‌లో వెల్ల డించింది. ఈ ఆర్థిక సంవత్సరం చము రు పీఎస్‌యు కంపెనీలు రూ.89,335 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాలని ప్రతిపాదించాయి. అయితే ఈ పెట్టు బడులు రూ.94,438 కోట్ల వరకు పెరిగే అవకాశాలున్నాయి. అయితే 2017-18 పెట్టుబడులు రూ.132,003 కోట్లతో పోల్చుకుంటే తక్కువే, 2016-17లో రూ.104,426, 2015-16లో రూ.97,223 కోట్లు, 2014-15లో రూ.89,180 కోట్ల వరకు మూలధనం వ్యయం చేశా యి. ఇక్కడ ఆశ్చర్యం కలిగించే అంశం ఏమిటంటే ప్రభుత్వం చమురు దిగుమ తులు ఖరీదైన వ్యవహారంగా మారిపోయాయని దిగుమతుల్లో కోత విధించాలని ఒకవైపు కోరుతూనే, మరోవైపు చమురు అన్వేషణకు మూల ధనం వ్యయంలో కోత విధిస్తోంది. 2017-18లో 109.1 బిలియన్ డాలర్ల చమురు దిగుమతి బిల్లు చెల్లిస్తే.. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 130 బిలియన్ డాలర్ల వరకు పెరిగిపోయే అవకాశాలున్నాయి. ఓఎన్‌జీసీ వచ్చే ఆర్థిక సంవత్సరం మూలధనం వ్యయం రూ.32,921 కోట్లుగా బడ్జెట్ కేటాయింపులు చేస్తే.. ఈ ఆర్థిక సంవత్సరం రూ.33,007 కోట్లు మూలధనం వ్యయం చేస్తోంది. అలాగే ఐఓసీ వచ్చే ఆర్థికసంవత్సరానికి మూలధనం వ్యయంలో రెండు శాతం కోత విధించి రూ.25,083 కోట్లకు తగ్గించుకుంది. చమురు రిఫైనింగ్ మార్కెటింగ్ కంపెనీలు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌ల మూలధనం వ్యయం మాత్రంకాస్తా పెరిగి రూ.9,500 కోట్లు, రూ. 7,900 కోట్లకు పెరిగితే.. గెయిల్ మూలధనం వ్యయంలో 10 శాతం కోతతో రూ. 5,339 కోట్లకు తగ్గించుకుంది. ఓఎన్‌జీసీ అనుబంధ సంస్థ ఓఎన్‌జీసీ విదేశీ మూలధనం వ్యయంలో 15.5 శాతం కోత విధించి రూ.5,161 కోట్లకు సవరించుకుంది.

3.3% ద్రవ్యలోటు లక్ష్యం అసాధ్యం

మూడీస్ అంచనా



న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరా నికి అంటే 2019-20 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు ను జీడీపీలో 3.4 శాతానికి పరిమితం చేయడం అసాధ్యమని మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ అభిప్రాయ పడింది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం పెద్దమొత్తం లో వ్యయం చేయడం.. అదే సమయంలో ప్రభుత్వాని కి రెవెన్యూ పెద్దగా పెరగకపోవడమే కారణమని వివ రించింది. ప్రస్తుతం భారత ప్రభుత్వం అప్పులు కూడా జీడీపీతో పోల్చుకుంటే చాలా చాలా ఎక్కువగా ఉన్నాయని మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్, సావరన్ రిస్కు గ్రూపు జెన్ ఫెంగ్ చెప్పారు. ఒకవేళ ద్రవ్యలోటు లక్ష్యం అధిగమించాలంటే ప్రభుత్వం ఆర్థి క క్రమశిక్షణను పాటించాలని సూచించారు. ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పక్కన పెట్టి వచ్చే ఆర్థికసంవత్స రంలో ద్రవ్యలోటును జీడీపీలో 3.4 లక్ష్యంగా ప్రకటిం చింది. వాస్తవ లక్ష్యం 3.1 శాతం. తన అంచనా ప్రకారం ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమని, దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం ముందుగా ప్రకటించిన ప్రాజెక్టులపై పెద్దమొత్తంలో వ్యయం చేయాల్సి వస్తోంది. అదే సమయంలో ప్రభుత్వానికి రెవెన్యూ పెరిగే అవకాశాలు కూడా తక్కువగా ఉన్నా యని ఫెంగ్ చెప్పారు. ద్రవ్యలోటు అదుపు లక్ష్యం చేరు కోకపోవడానికి ప్రధాన కారణం ప్రభుత్వం సన్నకారు రైతులకు ఏడాదికి రూ.6వేలు వారి ఖాతాలో జమచేయ డం, అలాగే మధ్యతరగతికి పన్ను రాయితీలు ఇవ్వ డం. ఆదాయపు పన్నును పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం తదితర అంశాలు ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకోవడానికి అడ్డంకిగా మారాయని తెలిపింది. 2019-20 బడ్జెట్‌లో ఆర్థికమంత్రి పీయూష్‌గోయల్ ఈ ఆర్థిక సంవత్సరం 2018-19లో రైతులకు రూ.20వేల కోట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.75వేల కోట్ల ఆర్థికసహాయం అందిస్తామని ప్రకటించారు. దీంతో ద్రవ్యలోటును అదుపు చేయడం కష్ట మని ఫెంగ్ వివరించారు. అయితే రేటింగ్ విషయానికి వస్తే ప్రస్తుతం భారత్ రేటింగ్ 'బీబీబీ2' అని.. దానికి వచ్చిన ప్రమాదమేమీ లేదన్నారు. అలాగే ప్రభుత్వం అప్పులు కూడా ప్రస్తుతం చాలా ఎక్కువగా ఉన్నాయ ని.. అయితే అవి దీర్ఘకాలిక మేచురిటితో కూడుకున్నవి కాబట్టి... వాటిని మధ్య కాలికానికి తగ్గించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎఫ్ఆర్‌బీఎం చట్టం కింది డెబిట్-టూ జీడీపీ నిష్పత్తిని 2024-25 నాటికి డెబిట్ టూ జీడీపీ నిష్పత్తిని 40 శాతానికి తగ్గించుకోవాలని.. 2017-18లో ఇది 50.1 శాతమని పేర్కొంది. 2018- 19 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం డెబిట్-టు-జీడీపీ నిష్పత్తిని 48.8 శాతానికి, 2019-20లో 46.7 శాతానికి 2020-21 నాటికి 44.6శాతానికి తగ్గించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. అలాగే ద్రవ్యలోటును 2018-19లో జీడీపీలో 3.3 శాతానికి, 2019-20లో 3.1 శాతానికి, 2020-21 నాటికి 3 శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. రేటింగ్ ఏజెన్సీ మూడీస్ 2017లో భారత్ సావరిన్ రేటింగ్‌ను బీఏఏ3 నుంచి బీఏఏ2కు అప్‌గ్రేడ్ చేసింది. స్టేబుల్ నుంచి పాజిటివ్‌కు మార్చింది. దీనికి కారణం ప్రభుత్వం పెద్దెత్తున సంస్కరణలు తీసుకురావడంతో ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని మూడీస్ అంచనా వేసి రేటింగ్‌ను కాస్తా పెంచింది.




కార్పొరేషన్ బ్యాంకు సీఈఓగా పీవీ భారతి

మంగళూరు: కెనరా బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసిన పీవీ భారతి, కార్పొరేషన్ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, చీఫ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారని కార్పొరేష న్ బ్యాంకు ఒక ప్రకటనలో వెల్లడించింది. కార్పొరేషన్ బ్యాంకుకు మొట్టమొదటిసారి ఒక మహిళ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆమెకు బ్యాంకింగ్ రంగంలో 37 ఏళ్ల అనుభవం ఉంది. నేషనల్ క్యాపిటల్ రీజియన్, తమిళానాడులోని పలు బ్యాంకు బ్రాంచీల్లో పనిచేశారు. అలాగే పట్టణ, గ్రామీణ, మెట్రో బ్రాంచీల్లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసుల్లో పనిచేసిన అనుభవం ఉంది.

35 పీఎస్‌యూ వాటాల విక్రయం వేగవంతం

- ఆర్థికమంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగానికి చెందిన కంపెనీల్లో వాటాల విక్రయం ప్రక్రియను ఆర్థికమంత్రిత్వశాఖ వేగవంతం చేయనుంది. ఇక నుంచి వాటాల విక్రయానికి జాప్యం చేయకుండా వీలైనంత త్వరగా విక్రయించాలనే ఆలోచనలో ఉంది. వీలైనంత వరకు నిబంధనలను కూడా సులభతరం చేసి వాటాలను విక్రయించాలనుకుంటున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపం) కార్యదర్శి అతాన్ చక్రబర్తి చెప్పారు. నీతీ ఆయోగ్ ఇటీవలే దీపంకు పీఎస్‌యు కంపెనీల ఐదవ జాబితా ఇచ్చింది. వాటిలో లాభాలు, నష్టాలను మూటగట్టు కుంటున్న కంపెనీలున్నాయి. మొత్తానికి 35 కంపెనీల ను విక్రయించాలని దీపం ఆలోచస్తోంది. కంపెనీల వాటాలను విక్రయించడానికి ఇప్పటికే కేబినెట్ అనుమతులు కూడా తీసుకుంది. ఇక మిగిలింది 35 కంపెనీల్లో వాటాల అమ్మకాలు మాత్రమే. అమ్మకానికి పెట్టిన పీఎస్‌యు కంపెనీలు ఇలా ఉన్నాయి. వాటిలో ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా అనుబంధసంస్థలు ఏఐఏటీఎస్ఎల్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, బీఈఎంఎల్, స్కూటర్ ఇండియా, భారత్ పంప్స్ కంప్రెషర్స్, ప్రభుత్వ రంగానికి చెందిన సెయిల్ అనుబంధ సంస్థలు భద్రావ తి, సేలం, దుర్గాపూర్ యూనిట్లు కూడా ఉన్నాయి. ఇవే కాకుండా హిందుస్తాన్ ఫ్లోరోకార్బన్, హిందుస్తాన్ న్యూస్‌ప్రింట్,



హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్, సెంట్రల్ ఎలక్ట్రానిక్స్, బ్రిడ్జ్ అండ్ రూఫ్ ఇండియా, ఎన్ఎండీసీకి చెందిన నాగర్నార్, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఐటీడీసీ కంపెనీలను గంపగుత్తగా విక్రయించాలని నిర్ణయించింది. ఇక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ లేదా (ఐఓఎల్) వచ్చిన వెంటనే విక్రయాల ప్రక్రియను వేగవంతం చేస్తామని చక్రబర్తి తెలిపారు. ఎయిర్ ఇండియాలో వాటాల విక్రయం గురించి ప్రస్తావిస్తూ.. ఆర్థిక ఫలితాలు వచ్చిన వెంటనే విక్రయాల ప్రక్రియను మొదలు పెడతామని, ఫలితాలు మెరుగ్గా ఉంటే అమ్మకం సులభంగా ఉంటుందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఎయిర్ ఇండియా అప్పులు రూ.55 వేల కోట్లపై మాటే. పవన్స్ హన్స్ విషయానికి వస్తే అమ్మకాల్లో పురోగతి కనిపిస్తోందన్నారు. పవన్‌హన్స్ విషయానికి వస్తే ఈ కంపెనీల్లో ప్రభుత్వానికి 51 శాతం వాటాలుంటే, ఓఎన్‌జీసీకి 49 శాతం వాటాలున్నాయి. పవన్‌హన్స్ వద్ద మొత్తం 46 హెలికాప్టర్లున్నాయి.

మోడీ X దీదీ

(మొదటిపేజీ తరువాయి)

బిందువైంది. రాజీవ్ కుమార్‌ను సీబీఐ ప్రశ్నించాలను కున్నా.. ఆయన కనిపించకుండా పోయారన్న వార్తలు గుప్పుమన్నాయి. ఈ నేపథ్యంలో సీబీఐ అధికారులు సీపీ రాజీవ్ కుమార్ ఇంటికి వెళ్లడం ఉద్రిక్తతకు దారితీసింది. రాజీవ్ ఇంట్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్న క్రమంలో సీబీఐ అధికారులను అడ్డగించిన బెంగాల్ పోలీసులు.. అరెస్ట్ వారెంట్ ఉందా అంటూ నిలదీశారు. సీపీ ఇంటికి వచ్చిన 5 మంది సీబీఐ అధికారులను షేక్స్పియర్ సరానీ పోలీస్ స్టేషన్‌కు తరలించి కొద్ది సేపటి తర్వాత విడుదల చేశారు. దీంతో స్కాంల దర్యాప్తు కాస్తా రాజకీయ రంగును పులుముకుంది.

కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వంకక్ష సాధింపు చర్యలు దిగుతోందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఇంటికి హుటాహుటిన చేరుకున్న మమత.. మెట్రో ఛానల్ వద్ద టీఎంసీ నేతలతో కలిసి ధర్నాకు దిగారు. మోడీ.. అమిత్ షా దిగిపోవాలి. వారిద్దరూ ఉన్నంత కాలం రాజ్యాగం ప్రమాదంలో ఉన్నట్లే. దేశంలోని రాజ్యాంగబద్ధ సంస్థలూ ప్రమాదంలోనే ఉంటాయి. దేశంలో ప్రస్తుతం ఎమర్జెన్సీని మించిన వాతావరణం ఉంది.

నా రాష్ట్ర దళాలకు అండగా నేను నిలబడతా. సమాఖ్య వ్యవస్థకు విఘాతం కలిగించేలా కేంద్రం వ్యవహరిస్తోంది. అరెస్ట్‌వారెంట్ లేకుండా రాజీవ్ కుమార్ ఇంటికి రావడానికి మీ కెంత ధైర్యం.. మేం సీబీఐ అధికారులనూ అరెస్ట్ చేయగలం.. కానీ అలా చేయబోం. మేం అధికారంలోకి రాగానే శారదా చిట్ ఫండ్ యాజమానులను అరెస్ట్ చేశాం. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశాం. మోడీ, షాలు మా రాష్ట్రంపై పెత్తనం చెలాయించాలను కుంటున్నారు. మోడీ ఆదేశాలతో సీబీఐ దాడులు చేస్తుందని ముందే ఊహించాం.జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ డైరెక్షన్‌లోనే సీబీఐ దాడులు జరుగుతున్నాయి. రాజీవ్ కుమార్ ప్రపంచంలోనే సిన్సియర్ అధికారి. బీజేపీ దొంగల పార్టీ.. చిట్ ఫండ్స్ 1980 నుంచి నడుస్తున్నాయి. మేం బీజేపీ, సీపీఎంలా కాదు. నేరస్తులను అరెస్ట్ చేసేందుకు కేంద్రం, రాష్ట్రంలో దర్యాప్తు సంస్థలున్నాయి. శారదా చిట్ ఫండ్ స్కాంపై విచారణకు శ్యామలా బెనర్జీ కమిషన్‌తో విచారణ జరిపించామని మమత అన్నారు. కోల్‌కతాలో సీబీఐ అధికారుల నిర్బంధంపై సీబీఐ తాత్కాలిక చీఫ్ నాగేశ్వరరావు స్పందించారు. శారదా చిట్ స్కాం కేసులను విచారించిన కోల్‌కతా సీపీ రాజీవ్ కుమార్ కీలక సాక్ష్యాలను నాశనం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే శారదా చిట్ స్కాంపై విచారణ జరుపు తున్నాం.

గతంలో ఈ కేసును రాజీవ్ కుమార్ నేతృత్వం లోని దర్యాప్తు బృందం విచారణ జరిపింది. అందుకే ఆయన్ని సాక్ష్యాలు కోరాం. సుప్రీం ఆదేశాలకు అనుగుణంగా మేం దర్యాప్తు చేస్తుంటే బెంగాల్ పోలీసులు సహకరించడం లేదు. కీలక పత్రాలను నాశనం చేసైనా ఉండాలి. లేక దాచి ఉండాలి. మా అధికారులను ఏ సెక్షన్ల కింద నిర్బంధించారో తెలీదు. సాక్ష్యాలు దొరక్కుండా కోల్‌కతాలోని సీబీఐ ఆఫీసుపైనా దాడి చేసి ఉంటారని భావిస్తున్నానన్నారు.

దర్శి ఓ ఆదర్శ నియోజకవర్గం

● సీఎం సమర్థతతోనే సంక్షేమ పథకాలు: మంత్రి శిద్దా రాఘవరావు



మహిళలకు పసుపు, కుంకుమ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి శిద్దా

దర్శి, ప్రభన్యూస్: దర్శి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతికశాఖ మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా దర్శి నియోజక వర్గంలోని పలు మండలాల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా దర్శిలో ఆటోనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి శిద్దా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. దర్శి నియోజకవర్గ పరిధిలో రూ.3 వేల కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆటోనగర్‌లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ముండ్లమూరు మండల కేంద్రంలో డ్వాక్రా మహిళలకు పసుపు, కుంకుమ చెక్కులు, పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో రూ.150 కోట్లతో సాగునీటి ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముండ్లమూరు గ్రామం లో రూ. 30 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, వీటిని చూసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. ముండ్లమూరులో 92 డ్వాక్రా గ్రూపులకు రూ. 92 లక్షల, పసుపు - కుంకుమ చెక్కులు అందజేశారు. 427 మందికి పెంచిన పింఛన్లు పంపిణీ చేశారు. తాళ్లూరు మండలం తూర్పు గంగవరం గ్రామంలో ఆడపడుచులకు పసుపు - కుంకుమ అందజేసి ప్రతి ఇంటికి పెద్దన్నగా ముఖ్యమంత్రి నిలిచారని మంత్రి అన్నారు. తాళ్లూరు మండల మహిళా సంఘాలకు 971 గ్రూపులకు 9,24,51,000ల చెక్కును పంపిణీ చేశారు. మంత్రిని మహిళలు సన్మానిం చారు.

సరకు రవాణాలో రైల్వే రికార్డు

● 100.052 మిలియన్ టన్నుల రవాణా ● రూ.8,655 కోట్ల ఆదాయం ● గతేడాది కంటే 21 శాతం అదనం

అమరావతి, ఆంధ్రప్రభ : సరకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే రికార్డు సృష్టించింది. నిర్దేశిత లక్ష్యాలను అధిగమిస్తూ పెద్ద ఎత్తున ఆదాయాన్ని కూడా గడిస్తోంది. అధికారుల అవిరళ కృషి, కింది స్థాయి సిబ్బంది తోడ్పాటుతో సరకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే దూసుకుపోతోంది. ప్రస్తుతఆర్థికసంవత్సరంలో జనవరి 31 వరకు జరిగిన సరకు రవాణాను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. జనవరి 31 వరకు రికార్డు స్థాయిలో 100.052 మిలియన్ టన్నుల సరకు రవాణా జరిగింది. అంటే 21 శాత అదనంగా సరుకు రవాణా చేసింది. గతేడాదితో పోలిస్తే ఇది 17.433 మిలియన్ టన్నులు అధికం. రానున్న రోజుల్లో దీనిని 82.619 మిలియన్ టన్నులకు చేరుకునేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు దక్షిణ మధ్య రైల్వే సరకు రవాణలో 120 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని భావిస్తున్నారు. ఇప్పటివరకు చేసిన సరకు రవాణా ద్వారా రూ. 8,655 కోట్ల ఆదాయం లభించింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటివరకు 26 శాతం వృద్ధి రేటును సాధించింది. అంటే అదనంగా రూ. 1764 కోట్ల ఆదాయం సాధించింది. కంటైనర్ రవాణా కూడా 26 శాతం అదనంగా పెరగడం గమనార్హం. సింగరేణి కాలరీస్‌కు బొగ్గు రవాణా ఈ ఏడాది ఇప్పటి వరకు 38.384 మిలియన్ టన్నులు రవాణా చేయడం విశేషం. ఇది గత ఏడాది కంటే 17 శాతం అదనం. రికార్డు స్థాయిలో నిర్దేశిత లక్ష్యాలు సాధించడం పట్ల అధికారులను, సిబ్బందిని జనరల్ మేనేజర్ ఆర్.కె.కుల్‌శ్రేష్ట అభినందించారు.

విద్యుదాఘాతంతో నలుగురి మృతి



● మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారు ● అరటి గెలలు కోస్తుండగా ఘటన

లావేరు(శ్రీకాకుళం) ప్రభన్యూస్ బ్యూరో: విద్యుత్ తీగలు నలుగురి ప్రాణాలను బలిగొన్నాయి. మరో గంటలో ఇంటికి వెళ్లిపోదామనుకున్న సమయంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు విద్యుద్ఘాతానికి గురై అక్కడకక్కడే మృతి చెందారు. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం తామాడ పంచాయతీ కొత్త రౌతు పేట గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కొత్త రౌతుపేట గ్రామానికి చెందిన ఆబోతుల రాములు(50), ఆబోతుల పుణ్యావతి (43), రౌతు బంగారమ్మ (48), కొమ్ము వెంకన్న (49) సంవత్సరాలు అరటిగెలలు కోస్తుండగా మృత్యువాత పడ్డారు. ఆదివారం మధ్యాహ్నం కొత్తరౌతుపేట గ్రామ దరిలో ఉన్న అరటితోటలో గెలలు కోస్తుండగా అక్కడ నేలపడి ఉన్న విద్యుత్ తీగలను వారు చూసుకోకపోవడంతో వాటిని తాకడంతో ఆ నలుగురూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈసంఘటన ఆ గ్రామంలో తీవ్ర విషాదం నింపింది. కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం శోకసంద్రంగా మారింది. కొమ్ము వెంకన్న తన కుమారుడుకి నిశ్చితార్థం కావడంతో అరటిగెల కోసం అరటి తోట వద్దకు వెళ్లి అరటిగెల కోస్తుండగా వ్రేలాడుతున్న విద్యుత్ తీగలు వారిని తగలటంతో ఈసంఘటన జరిగింది. అరటిచెట్టు మీద నుంచి విద్యుత్ వైర్లు గత రెండు సంవత్సరాల నుంచి ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరా లేకపోవడంతో వాటి గురించి ఎవరూ పట్టించుకోలేదు. అయితే ఆదివారం అరటిగెలలు కొడుతున్నప్పుడు అరటి చెట్టు మీద ఉన్న వైరు ప్రక్కనే ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌పై పడడంతో విద్యుత్ ఒక్కసారిగా సరఫరా కావడంతో వీరు మృత్యుపడ్డారు. పెళ్లింట విషాధఛాయలు అలముకున్నాయి. సంఘటనా స్థలానికి రౌతుపేట గ్రామానికి చెందిన గ్రామస్థులంతా అక్కడకు వచ్చేసరికి మృతదేహాలు చెల్లా చెదురుగా పడి ఉండడంతో ప్రజలందరూ కన్నీరు మున్నీరుగా విలపించారు.

మృతదేహాలను పోస్టుమార్టంకు ు శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఆర్డీఓ రమణ మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తామని అన్నారు. ఆర్థిక సహాయంగా చంద్రన్న భీమా, ప్రభుత్వ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంఘటనా స్థలానికి డిఎస్పీ భీమారావు, జెఆర్‌పురం సిఐ విశ్వేశ్వరరావు, ఎస్ఐ చిరంజీవి, తహశీల్దార్ సుధాసాగర్ వెళ్లారు. విద్యుత్ తీగలు వేలాడుతున్నా ట్రాన్స్ సిబ్బంది ఏమాత్రం పట్టించుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో
ఇంధన వెలుగులు!

- **భవిష్యత్‌లో విద్యుత్ ఛార్జీలు పెంచబోం**
- **5, 6 తేదీల్లో విజయవాడలో అంతర్జాతీయ విద్యుత్ సదస్సు**
- **ఎంబీసీలకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్**
- **టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు**



అమరావతి, ఆంధ్రప్రభ: విజయవాడలో ఈనెల 5,6 తేదీల్లో అంతర్జాతీయ విద్యుత్ సదస్సును నిర్వహించబోతున్నామని, ఈ నేపథ్యంలోనే ఏపీలోని విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ప్రజలసంక్షేమం కోసం శాశ్వతంగా అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో విద్యుత్‌ను 34/7 సరఫరా చేయాలన్నారు. ఇంధన రంగంలో వస్తున్న సరికొత్త ఆవిష్కరణలు, నవీన సాంకేతికతలను అన్వేషించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఆదివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, పవరింగ్ ఆంధ్రప్రదేశ్ - ఎనర్జీ ఇన్నోవేషన్ - 2019 పేరిట విజయవాడలో నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సులో ఇవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉపయోగకరంగా ఉంటాయ న్నారు. అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ డాల్‌బర్గ్, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, టీఈఆర్ఐల సహకారంతో ఈ నెల 5,6 తేదీల్లో విజయవాడలో ఈ సదస్సు నిర్వహి స్తున్నామన్నారు. ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇలాంటి సదస్సును నిర్వహించడం ఇదే తొలిసారి అని, ఇంధన రంగంలో ఏపీ లక్ష్యాలను సాధించడంలో ఇది తోడ్పడుతుం దని చంద్రబాబు ఆకాంక్షించారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రిగా తాను కీలకోపన్యాసం చేయనున్నట్లు తెలిపారు. ఇంధన రంగంలో నవ కల్పనలు, అధునాతన టెక్నాలజీ, అంతర్జాతీయ ఉత్తమ విధానాలను గుర్తించి రాష్ట్ర విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. రాష్ట్రం రెండంకెల వృద్ధి రేటు సాధించడంలో విద్యుత్ రంగానిది కీలకపాత్ర అని, అందులో ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశారు. కియా మోటార్స్ వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి కారణం కూడా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్న విద్యుత్ రంగమేనన్నారు. మనం ఇప్పటికే 24/7 విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ఇక అంతర్జాతీయ ప్రమాణాలను దృష్టిలో పెట్టుకుని సరఫరా చేయాలన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి విద్యుత్ సరఫరా వెన్నెముకలాంటిదన్నారు. కాబట్టి ప్రజలకు, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్తును అందుబాటు ధరల్లో నిరంతరాయంగా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతోపాటు వినియోగదారులను నూరు శాతం సంతృప్తిపర్చడమే మన ప్రభుత్వ ఏకైక లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

24/7 విద్యుత్ సరఫరాను సుస్థిర, శాశ్వత సంక్షేమ పథకంగా కొనసాగించేందుకు అత్యుత్తమ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. భవిష్యత్తులోనూ విద్యుత్ ఛార్జీలను పెంచకుండా ఉంచేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గడచిన నాలుగేళ్లలో 98 శాతం ప్రజలకు విద్యుత్తు ఛార్జీలను పెంచకపోవడం చారిత్రాత్మకమన్నారు. ఈ నిర్ణయం తనకెంతో సంతృప్తిని కలిగించిందన్నారు. ప్రభుత్వం ఈఏడాది కూడా నూరు శాతం వినియోగదారులకు విద్యుత్ ఛార్జీలను పైసా కూడా పెంచలేదన్నారు. ఇంతటి ధైర్యమైన నిర్ణయం దేశంలోని మరే రాష్ట్రమూ తీసుకోలేదని స్పష్టం చేశారు. రెండోదశ విద్యుత్ సంస్కరణలు విజయవంతమైన నేపథ్యంలో భవిష్యత్‌లోనూ కరెంటు ఛార్జీలను పెంచకుండా ఉండే అవకాశాలను అధికారులు అధ్యయనం చేయాలని సీఎం సూచించారు.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ఐదు అంశాలే ప్రాథమ్యాలుగా ఈ అంతర్జాతీయ సదస్సు ఏర్పాటు చేసినట్లు ఇంధన, ఐ అండ్ ఐ, ఏపీసీఆర్డీయే ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ ముఖ్యమంత్రికి వివరించారు. సంప్రదాయ, పునరుత్పాదక ఇంధనం, గ్రిడ్ అప్‌గ్రేడేషన్, ఇంధన సామర్థ్యం, ఈ-రవాణా అంశాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. 2023కల్లా రాష్ట్ర రహదారులపై 10 లక్షల ఎలక్ట్రికల్ వాహనాలను పరుగులు పెట్టించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇంధన సామర్థ్యంలో ఏపీ బ్రాండ్ సెట్టర్‌గా నిలిచిందన్నారు. 2018-19నాటికి 10వేల మెగావాట్లున్న థర్మల్ విద్యుత్ సామర్థ్యాన్ని 2021-22కల్లా 18 వేల మెగావాట్లకు చేర్చడంపై దృష్టి సారించినట్లు వివరించారు. దీనివల్ల ఏటా 252 లక్షల మెట్రిక్ టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గించవచ్చన్నారు. రాష్ట్రంలో వినియోగదారుల సంతృప్తి స్థాయిలను 99 శాతానికి చేర్చడమే సీఎం లక్ష్యమని, అందుకోసం కష్టపడి పనిచేయాలని ఇంధన శాఖ మంత్రి కళా వెంకట్రావు స్పష్టం చేశారని అజయ్ జైన్ వెల్లడించారు.

హరిత ఇంధన కారిడార్ల ప్రాజెక్టులో భాగంగా రూ. 1,816 కోట్ల అంచనా వ్యయంతో 3 వేల మెగావాట్ల సౌరవిద్యుత్‌ను, వెయ్యి మెగావాట్ల పవన విద్యుత్‌ను తరలించే సామర్థ్యంతో పునరుత్పాదక ఇంధన తరలింపు పథకాన్ని రూపొందిస్తున్నట్లు ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కే విజయానంద్ తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ, సీఎం ప్రత్యేకకార్యదర్శి సతీష్‌చంద్ర, ప్రత్యేక సీఎస్ జీ సాయిప్రసాద్, విద్యుత్ శాఖ సలహాదారు కే రంగనాథం, ట్రాన్స్‌కో జేఎండీ దినేష్ పరుచూరి, ఉమాపతి, డిస్కంల సీఎండీలు ఎంఎం నాయక్, హెచ్‌వై దొర, నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర బాబు, ఏపీఎస్పీడీసీఎల్ ఎండీ ఆదిశేషు పాల్గొన్నారు.

ఊరట అంశాలు

పేదలకు ఊరట కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలకు వంద యూనిట్ల వరకు ఉచితంగా కరెంటు అందిస్తున్నామని, దీనిని ఎంబీసీలకు కూడా అమలు చేయాలన్నారు. ఇక వ్యవసాయ రంగానికి ఉచిత కరెంటు ఇచ్చేందుకు రూ. 6,030 కోట్లు సబ్సిడీగా భరిస్తున్నామని, దేశంలోని ఏ ఇతర రాష్ట్రం కూడా ఇంత మొత్తాన్ని భరిస్తున్న సందర్భం లేదని ముఖ్యమంత్రి అన్నారు.



ఆలయంలో ప్రధాన న్యాయమూర్తితో టీటీడీ అధికారులు


శ్రీవారి సేవలో సీజే

తిరుమల , ప్రభ న్యూస్: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి దర్శనార్థం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలసి తిరుమలకు చేరుకున్నారు. పద్మావతి అతిథి గృహాల వద్ద ప్రధాన న్యాయమూర్తికి టిటిడి ఇఓ అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఇఓ శ్రీనివాసరాజులు పుష్పగుచ్చంతో సాదర స్వాగతం పలికారు. కొద్దిసేపు విరామం అనంతరం ఆలయ మహాద్వారం వద్దకు చేరుకున్న సిజెకు ఇఓ, జేఇఓలు స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. నేరుగా ఆలయంలోకి చేరుకున్న ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వకుళామాతను దర్శించి విమాన ప్రదక్షిణగా వెళ్ళి హుండీలో కానుకలు సమర్పించారు.

అక్కడి నుంచి నేరుగా రంగనాయకుల మండపం చేరుకున్నారు. అక్కడ ప్రధాన న్యాయమూర్తి దంపతులకు వేదపండితులు ఆశీర్వచనం పలుకగా ఇఓ, జేఇఓలు శ్రీవారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రం బహూకరించారు. ఆయనతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి.రమణ దంపతులు కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకు ముందు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అమరావతిలో నేలపాడు వద్ద హైకోర్టు శాశ్విత భవన నిర్మాణ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. అనంతరం అక్కడి నుంచి శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలసి తిరుమలకు చేరుకున్నారు.

ఘట్టమనేనితో తెదేపా బృందం మంతనాలు

● పార్టీలో చేరాలంటూ ఆహ్వానం



ఆదిశేషగిరిరావు నివాసంలో సమావేశమైన టీడీపీ బృందం

అమరావతి, ఆంధ్రప్రభ: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రధాన పార్టీల్లో నాయకుల చేరికలు జోరందుకున్నాయి. పార్టీ నిర్ణయాలు, అధినేతపై అసంతృప్తితో ఉన్న నేతలు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా సానుకూల సంకేతాలు రాకపోవడంతో పార్టీలో కొనసాగలేక రాజీనామాలు చేస్తున్నారు. అదేవిధంగా తమకు అనుకూల పార్టీలను ముందుగానే బేరీజు వేసుకోని, కార్యకర్తల అభిప్రాయాలు తీసుకొని ఆ పార్టీల్లోకి చేరేందుకు సిద్ధమవుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వైసీపీలో కొనసాగిన ప్రముఖ సినీ నటుడు కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో టిడిపి అధిష్టానం ఆయన్ను పార్టీలోకి తీసుకొనేవిధంగా పావులు కదిపింది. ఆయన్ను పార్టీలోకి తీసుకొచ్చే బాధ్యతలను టిడిపి సీనియర్ నేతలైన వర్ల రామయ్య, ఆలపాటి రాజేంద్రప్రసాద్, గద్దె రామ్మోహన్, బుద్ధా వెంకన్న తదితరులుకు అప్పజెప్పింది. దీనిలో భాగంగానే ఆదివారం టిడిపి బృందం గుంటూరు జిల్లా బుర్రిపాలెంలోని ఆదిశేషగిరిరావు నివాసానికి వెళ్లి ఆయనతో సంప్రదింపులు జరిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిణామాలు, స్థానిక పరిస్థితులు చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈసందర్భంగా టీడీపీ నేతల బృందం ఆయన్ని పార్టీలో చేరాలని ఆహ్వానించింది.

వైకాపా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

● డ్వాక్రా చెక్కులు చెల్లవని ప్రచారం ● టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం

అమరావతి, ఆంధ్రప్రభ : పసుపు-కుంకుమ కింద డ్వాక్రా మహిళలకు ఇస్తున్న చెక్కులు చెల్లవని వైకాపా చేస్తున్న ప్రచారాన్ని బలంగా తిప్పి కొట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఒక అన్నగా మహిళలకు రూ.10 వేలు చెల్లిస్తున్నానని దీంతో వారిలో పూరిస్థాయి సంతృప్తి ఉందని పేర్కొన్నారు. ఇప్పటివరకు మహిళలకు రూ.24 వేల కోట్లు చెల్లించామన్నారు. ఆదివారం ముఖ్యమంత్రి టీడీపీ నేతలతో ఉండవల్లిలోని తన నివాసం నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నమ్మకానికి ప్రతీక తెలుగుదేశం అయితే, అపనమ్మకానికి మారు పేరు వైకాపా అని ధ్వజమెత్తారు. టీడీపీని రైతులు నమ్మి భూమిలిచ్చారని, వారి సహ కారంతో అద్భుతమైన నగరాన్ని నిర్మి స్తున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ నమ్మకాన్ని నిలబెట్టాల్సింది ప్రజలేనని అన్నారు. కియాను రాష్ట్రానికి తాము తీసుకువస్తే వైకాపా వోక్స్ వ్యాగన్‌ను తరిమేసిందన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు పోగొట్టేది వైకాపా అని, వీటిని రాబట్టేది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని చంద్రబాబు అన్నారు. రెండు పార్టీల పనితీరు ను ప్రజలు ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి శుక్రవారం జగన్ కోర్టుకు వెళితే తాను ప్రతి రోజూ ప్రజలతో ఉంటున్నానని పేర్కొన్నారు. ఈ అంశాలన్నింటిని ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకురావాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఆటోలు, ట్రాక్టర్లపై లైఫ్ ట్యాక్స్ ఎత్తివేయడంతో అయా వాహనాల యజమానుల నుంచే హర్షం వ్యక్తమవుతున్నదన్నారు. ప్రతి ఆటో కార్మికుడు టీడీపీకి అండగా నిలవాలని కోరారు. ప్రతి ఆటో, ట్రాక్టర్ పై తెలుగుదేశం పార్టీ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. పింఛన్ల పెంపుపె వృద్ధుల్లో ఆనందం నెలకొందన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ బాధ్యులు పాల్గొన్నారు.

రాజధాని ముంపు నివారణకు ప్రణాళికకు ప్రపంచ బ్యాంకు ఆమోదం

రాజధాని అమరావతిలో వరద ముంపు నియంత్రణకు సంబంధించిన ప్రణాళికను అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడిసి) ప్రపంచబ్యాంక్ నిబంధనలకు అనుగుణంగా చేపట్టడం జరుగుతోంది. ఈ పనులకు ఆర్కెడిస్, టాటా కన్సల్టెంట్ల ద్వారా ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖలో పనిచేసిన ముఖ్య అధికారులతో ప్రణాళికపై దీర్ఘంగా చర్చించి ప్రపంచ బ్యాంకుకు నివేదికను సమర్పించారు. ప్రపంచ బ్యాంకు వాషింగ్టన్, న్యూఢిల్లీ వారు తమ డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్ బృందం వారితో రాజధాని ముంపు నియంత్రణ ప్రణాళికను పరిశీలించి ఆమోదించారు. అమరావతి లోని కొండవీటి వాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్, కృష్ణాయపాలెం, నీరుకొండ, శాఖమూరుల్లోని మూడు రిజర్వాయర్లకు సంబంధించిన డ్రాయింగ్‌లు, అంచనాలను చీఫ్ ఇంజనీర్ సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ ద్వారా పరిశీలించి అనుమతులు మంజూరు చేశారు. ఈ అంచనాలను జలవనరుల శాఖ ముఖ్య ఇంజనీరు, ప్రపంచబ్యాంకు ద్వారా అనుమతులు పొందిన మీదట తవ్విన మట్టిని తక్కువ దూరంలో వేయించడానికి అనుగుణంగా లీడ్ రేట్లను సవరించి ప్రపంచబ్యాంకు అనుమతితో టెండర్లను ఖరారు చేశారు. ప్రపంచబ్యాంకు టెండర్ల ప్రక్రియను ప్రతి అడుగులోను ప్రిబిడ్ సమావేశం, కాంట్రాక్టులు సమర్పించినపుడు టెక్నికల్, ఫైనాన్షియల్ ఎవల్యూషన్లను క్షుణ్ణంగా పరిశీలన చేయడం జరిగింది. ఆ పై ప్రపంచబ్యాంకు అనుమతులు పొందిన తర్వాత టెండర్ల ప్రక్రియ ఖరారు చేయడానికి ఏడిసిఎల్ బోర్డు ఏపిసిఆర్డీయే అథారిటీకి సమర్పించడం జరిగింది. కాంట్రాక్ట్ కోట్ చేసిన ఎక్సెస్ పర్సంటేజి గురించి ఏడిసిఎల్ అధికారులు ప్రపంచబ్యాంకుకు సమర్పించగా వారు దీనికి తగిన అనుమతులను మంజూరు చేశారు. తొలుత నీరుకొండ రిజర్వాయర్‌ను ఏడిసిఎల్ అధికారులు రెండు టెండర్లుగా పిలవడానికి టీఈసి నుంచి అనుమతులు కోరారు. అందుకు టిఈసి రెండు టెండర్లను కలిపి ఒకటే టెండర్‌గా పిలవాల్సిందిగా అనుమతిని ఇచ్చింది. ప్రపంచబ్యాంకు నియమ నిబంధనలకు అనుగుణంగా దీనిని ఇంటర్నేషనల్ కాంపిటీటివ్ బిడ్డింగ్ పిలవడం జరిగిందని ఏడిసి అధికారవర్గాలు తెలిపాయి.

అర్చకులకు రూ.10 వేల వేతనం

● రేపు సీఎం చంద్రబాబు ప్రకటన ● బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద సూర్య



అమరావతి, ఆంధ్రప్రభ: అర్చకుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర దేవాదాయశాఖ అర్చకుల వయోపరిమితి పెంచటంతోపాటు వేతనాన్ని ప్రవేశపెట్టడం జరుగుతుందని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద్‌సూర్య తెలిపారు. ఆదివారం విజయవాడ టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అర్చకులకు నెలకు రూ.10వేల కనీస వేతనం ఇవ్వాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని, మంగళవారం(5వతేదీ) ఆయన తన మనసులోని మాట బయట పెట్టనున్నట్లు చెప్పారు. దేవాలయాల్లో విధులు నిర్వహించే అర్చకులందరికీ నెలవారి వేతనం ఇవ్వడం కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారని, అర్చక సంక్షేమం కోసం మరిన్ని పథకాలను ప్రజావేదికగా ముఖ్యమంత్రి ప్రకటించనున్నట్లు ఆనంద్ సూర్య తెలిపారు. 70ఏళ్ల దేశచరిత్రలో అర్చకుల బాగోగుల గురించి ఏ ప్రభుత్వము, ఏ నాయకుడు పట్టించుకోలేదని, సీఎం చంద్రబాబు అన్ని వర్గాల హితాన్ని కోరే మనిషిగా అర్చకులు, పురోహితులకు మేలు చేయాలని సంకల్పించడం జరిగిందన్నారు. వంశపారపర్యంగా హక్కులకు సంబంధించిన 76జీవో జారీపై కూడా సీఎం చంద్రబాబు ఒక ప్రకటన చేయనున్నట్లు ఆనంద సూర్య వివరించారు. అదేవిధంగా అర్చకులకు ఆరోగ్య కార్డులు కూడా అందచేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందని, పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెడుతున్న చంద్రబాబు మరలా ముఖ్యమంత్రి కావాలని స్పష్టంచేశారు. ఈసమావేశంలో అర్చక, పురోహితులు సిరిపురపు శ్రీధర్, అచ్చయ్య లింగం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఎన్వీ రమణ

సత్వర న్యాయం అందించండి

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రస్తుతం న్యాయ వ్యవస్థ అనేక సవాళ్ళను ఎదుర్కొంటుందని, దీన్ని పరిరక్షించేందుకు న్యాయమూర్తులు, న్యాయ వాదులు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. ఆదివారం తాత్కాలిక హైకోర్టు ప్రారంభోత్సవం, శాశ్వత ఐకానిక్ హైకోర్టు శంకుస్థాపన కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దురదృష్టవ శాత్తు కొందరు న్యాయవ్యవస్థ ప్రతిష్టనుదెబ్బ తీస్తున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని నిర్మించుకున్న తెలుగు ప్రజలకు అభినందనలు తెలిపారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా చూడాల్సిన బాధ్యత న్యాయమూర్తులు, న్యాయ వాదులపై ఉందన్నారు. అమరావతి రాజధాని నగరంగా 2000 ఏళ్ళ క్రితమే ఉండేదని, శాతవాహనులు పాలించారని తెలిపారు. ఈ నగరాన్ని అత్యాధునిక నగరంగా నిర్మించేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆయన ఈ సందర్భంగా అభినందించారు. తెలుగువారు అంటే ఓర్పుకు, సహనానికి మారుపేరని, హైకోర్టు విభజనతో ప్రాథమికంగా కొన్ని సమస్యలు ఉన్నా అవి త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. త్వరలో ఒక అద్భుత వ్యవస్థ నిర్మాణం జరుగుతుందన్న భావన తనలో ఉందన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణ శ్రీశ్రీ కవితలను చదివి వినిపించారు. 'తెలుగు వాడిలాంటి వాడు నైనై .. తెలుగువాడు దేనికైనా సైసై' అని అభివర్ణించారు. అమరావతి నేల ప్రేమ, క్షమ, దయకు ప్రతీకని, బౌద్ధం ఇక్కడి నుంచే ప్రారంభమైందన్నారు.

చంద్రబాబు కృషి ప్రశంసనీయం: జస్టిస్ సుభాష్‌రెడ్డి

తాత్కాలిక హైకోర్టు నిర్మాణాన్ని 179 రోజుల్లో పూర్తి చేయడం అభినందనీయమని, ఈ కృషి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమైందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుభాష్‌రెడ్డి అన్నారు. ఈ నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ అవగతం అవుతుందన్నారు. హైకోర్టు విభజన జరిగిన నేపధ్యంలో సుమారు రెండు లక్షల కేసులు అమరావతికి బదిలీ అవుతాయని వీటిని, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం సుప్రీం కోర్టు మరో న్యాయమూర్తి లావు.నాగేశ్వరరావు మాట్లాడుతూ తానూ ఈ ప్రాంతానికి చెందిన వాడినేనని, న్యాయవాదిగా ప్రస్థానం ఇక్కడి నుంచే ప్రారంభించానని అన్నారు. 1954లో గుంటూరు వేదికగా హైకోర్టు పనిచేసిందని, మళ్ళీ అదే ప్రాంతానికి తిరిగిరావడం సంతోషంగా ఉందన్నారు. పొట్టి శ్రీరాములు ఆత్మత్యాగం ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిందన్నారు. ఆ సమయంలో ఏపి హైకోర్టు ప్రస్తుతం గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో ఉండేదని తెలిపారు. ఆనాడు ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఒక్కటేనని అభివర్ణించారు. ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో హైకోర్టు కీలక భూమిక పోషిస్తుందన్నారు. 1954లో మద్రాస్ నుంచి విడిపోయిన సమయంలో ఇబ్బందులు ఎదురయ్యాయని అన్నారు. అమరావతిలో ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేసిన హైకోర్టుతో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికి ఉన్నత న్యాయ స్థానం ప్రతిష్టతను దృష్టిలో ఉంచుకుని అందరూ పనిచేయాలని కోరారు. దేశంలో అత్యంత యువ న్యాయస్థానంగా ఏపి హైకోర్టు పనిచేస్తుందన్నారు. అత్యున్నత స్థాయిలో సేవలు అందించాలని ఆకాంక్షించారు. గౌహతి హైకోర్టు ఏడు రాష్ట్రాలకు సేవలు అందిస్తుందని ఈ సందర్భంగా జస్టిస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రానున్న 10, 15 ఏళ్ళ కాలానికి ప్రస్తుత హైకోర్టు భవనం సరిపోతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని శాశ్వత భవనం నిర్మిస్తున్నారన్నారు. అనంతరం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఆరు నెలల పాటు ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా పనిచేసే అవకాశం కలిగిందన్నారు. విభజన అనంతరం కొన్ని ఇబ్బందులున్నప్పటికీ కోర్టు ఎలాంటి సమస్యలు లేకుండా సాఫీగా సాగుతుందన్నారు. ఎవరైనా పూర్వ ప్రతిష్టను ముందుకు తీసుకువెళ్ళాల్సి ఉంటుందని, అదే తరహాలో ఏపి హైకోర్టు పూర్వ చరిత్రను కొనసాగించాలని ఆకాంక్షించారు.

నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం ఢిల్లీలో పర్యటించ నున్నారు. ఈ పర్యటనలో ఆయన బీజేపీ యేతర పక్షాలతో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, తృణముల్ కాంగ్రెస్ అధ్యక్షు రాలు మమతా బెనర్జీ, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌తో పాటు అఖిలేష్ యాదవ్, మాయావతి, ఫరూక్ అబ్దుల్లా తదితరులు పాల్గొననున్నారు. ఈ సమావేశం అనంతరం నేతలంతా కేంద్ర ఎన్నికల సంఘ ప్రధాన అధికారిని కలిసి ఈవిఎంల విని యోగాన్ని రద్దు చేయాలని ఒక వినతి పత్రాన్ని అందించనున్నారు. అదే విధంగా వివిప్యాట్ రసీదులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్ధించనున్నారు.

కొండపల్లి కోట ఉత్సవాలను ప్రారంభించనున్న సీఎం

కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని కొండపల్లి కోట ఉత్సవాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సో మవారం ఉదయం ప్రారంభించనున్నారు. ఈ కార్య క్రమం అనంతరం కొండపల్లి నుంచి నేరుగా ఆయన గన్న వరం విమానాశ్రయం చేరుకుని అక్కడ నుంచి ఢిల్లీకి వెళతారు.

రెండవ రోజు పసుపు కుంకుమ కింద..

69,222 మందికి చెక్కుల పంపిణీ



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పసుపు కుంకుమ పథకం రెండో రోజు కూడా రాష్ట్రంలో పండుగ వాతావరణంలో జరిగింది. స్వయం సహాయక సంఘ మహిళకు ఆర్ధిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పట్టణ ప్రాంతాల్లోని సమాఖ్యలన్నీ వారి వారి పరిధిలో సర్వసభ్య సమావేశాలు నిర్వహించుకుని ముఖ్యమంత్రి నిర్దేశించిన విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించుకున్నాయి. అర్హులైన ప్రతి ఒక్క సభ్యురాలికి వారివారి పసుపు కుంకుమ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పసుపు కుంకుమ పథకం ద్వారా మహిళలకు ఆర్ధిక భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ తీర్మానాలు చేశారు. అనంతరం ముఖ్య మంత్రి చిత్రపటానికి పాలాభిషేకాలు చేసి మంగళ హారతు లిచ్చారు. తెలుగింటి ఆడపడుచులకు అందజేసే ఈ పసుపు కుంకుమ చెక్కులను సంప్రదాయ బద్ధంగా అన్న తోబుట్టువుకి అందించే సారె మాదిరిగా మహిళలకు నుదిటిన బొట్టు పెట్టి, పసుపు, కుంకుమ, తాంబూలంతో అందించారు. రెండవ రోజు జరిగిన పసుపు కుంకుమ కార్యక్రమంలో మెప్మా ఆధ్వర్యంలో 19,023 సమాఖ్య సమావేశాలు జరుగ్గా అందులో 9,199 సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు. 38,530 సంఘ సమావేశాలు నిర్వహించగా 3,63,209 మంది సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమాఖ్య సమావేశాలు నిర్వహించి 31,855 మంది కృతజ్ఞతా తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా 69,222 మంది మహిళలకు రెండవ రోజు పసుపు కుంకుమ చెక్కులు అందజేశారు. క్షేత్ర స్థాయిలో స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించే చెక్కుల పంపిణీలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా కార్యక్రమాల నిర్వహణలోతలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు మెప్మా మిషన్ డైరెక్టర్ పి చిన్న తాతయ్య ప్రతి రోజూ టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా పసుపు కుంకుమ చెక్కుల పంపిణీ కార్యక్రమాల నిర్వహణపై సమీక్షలు నిర్వహిస్తూ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

విషపు ఇంజెక్షన్‌తో హత్య

- జయరామ్‌తో రాకేష్‌కు విభేదాలు
- రాకేష్‌తో వివాహాన్ని ఒప్పుకోని జయరామ్
- పోలీసుల విచారణలో శిఖాచౌదరి వెల్లడి

అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో: కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్ చిగురుపాటి జయరాం హత్య కేసు కీలక మలుపులు తిరుగుతున్నది. ఆయన్ను ఇంజెక్షన్ చేసి హత్య చేసినట్లుగా అనుమానిస్తున్నారు. ఆర్ధిక లావాదేవీల్లో విభేదాలే హత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. జయరాం హత్య హైదరాబాద్‌లోనే జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసులో కీలకంగా మారిన జయరాం మేనకోడలు శిఖా చౌదరి, ఆమె మిత్రుడు రాకేష్‌లతోపాటు మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని జగ్గయ్యపేట సమీపంలోని చిల్లకల్లు వద్ద ఒక ప్రైవేటు గెస్టు హౌస్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విచారణలో కుట్రలన్నీ బహిర్గతమవుతున్నట్లు చెబుతున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు కుక్కలను చంపేందుకు వాడే ఇంజక్షన్ ఇచ్చి జయరాంను హత్య చేసినట్లుగా చెప్పినట్లుగా సమాచారం. ఈ ఇంజెక్షన్ ప్రభావంతో 10 నిమిషాల్లోనే ఆయన శరీరం విషపూరితమై మరణించినట్లు తెలిసింది. మృతదేహాన్ని గుర్తించడానికి 24 గంటల ముందే హత్య జరిగినట్లు అనుమానిస్తున్నారు. జయరాం హత్య, ఆర్ధిక వివాదాలు, నగదు బదిలీ వంటి అంశాలతో జరిగినట్లు సమాచారం.కాగా పోలీసుల విచారణలో శిఖా చౌదరి కూడా ఆర్ధిక లావాదేవీల నేపథ్యంలోనే తన మేనమామ హత్య జరిగినట్లు చెప్పిందని సమాచారం. పోలీసుల విచారణలో కొన్ని అంశాలను ఆమె అవాస్తవాలుగా పేర్కొన్నట్లు తెలిసింది. రాకేష్‌కు కోట్ల అప్పులు ఇచ్చే స్థోమత లేదని ఆమె చెప్పినట్లుగా తెలిసింది. అయితే, జయరాం, రాకేష్‌లమధ్య ఆర్ధికపరమైన లావాదేవీలు ఉన్నమాట యథార్థమే అయినప్పటికీ రాకేష్ ఈ హత్య చేస్తాడని తాను ఊహించలేదని ఆమె విచారణలో పేర్కొన్నట్లు తెలిసింది. అయితే, జయరాంతో గల సంబంధాలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. శిఖా చౌదరి తన భర్తతో విడిపోయిన తరువాత రాకేష్‌తో సాన్నిహిత్యంగా ఉంటూ వస్తున్నట్లు ఆమె వెల్లడించినట్లు తెలిసింది. ఈనేపధ్యంలోనే తాను రాకేష్‌ను జయరాంకు పరిచయం చేసినట్లు చెప్పిందని సమాచారం. అయితే, జయరాంతో ఉన్న సంబంధంపై కూడా ఆమె స్పందించినట్లు తెలిసింది. జయరాం మంచి వ్యక్తి కాదని శిఖ పోలీసులకు తెలిపినట్లు సమాచారం. తనపట్ల, తన చెల్లెలుపట్ల కూడా జయరాం ప్రవర్తన అభ్యంతరకరంగా ఉండేదని ఆమె వెల్లడించినట్లు తెలిసింది. ఈనేపథ్యంలోనే రాకేష్‌ను వివాహం చేసుకోవాలని అనుకున్నట్లు తాను జయరాంతో చెప్పగా అందుకు జయరాం అంగీకరించలేదని ఆమె తెలిపినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా జయరాంకు సంబంధించిన ఆస్తులు, చెక్ పవర్‌లు అన్నీ తన మేనత్త పద్మజ పేరున ఉండటం, ఆమె ఖర్చులకు కూడా ఇవ్వకపోడంతో జయరాం అప్పులు చేసేవాడని పేర్కొన్నట్లు తెలిసింది. ఈనేపథ్యంలోనే రాకేష్ వద్ద జయరాం అప్పు చేశాడని, ఆ అప్పు తీర్చే విషయంలోనే వీరిద్దరి మధ్య గొడవ జరిగిందని ఆమె చెప్పుకొచ్చినట్లు సమాచారం. అయితే, ఈ హత్య హైదరాబాద్ పరిధిలో జరిగితే తమకు ఇబ్బందని ఆలోచించిన నిందితులు కేసును ఏపీ పరిధిలోకి వచ్చేలా హత్య చేసి నందిగామ ప్రాంతంలో కారును వదిలేసినట్లు తెలిసింది. కాగా, ఈ కేసును కృష్ణా జిల్లా నుండి హైదరాబాద్‌కు బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గత నెల 31న రాత్రి కృష్ణా జిల్లా నందిగామ సమీపంలో కారులో జయరాం మృతి చెందినట్లు పోలీసులు గుర్తించిన సంగతి పాఠక విధితమే. అక్కడ లభించిన ఆధారాలు, పోస్టుమార్టం ప్రాథమిక నివేదిక ఆధారంగా హత్యగా తేల్చారు. ఊపిరాడకుండా చేసి జయరాంను హత్య చేసినట్లు, విషప్రయోగం జరిపినట్లు తేలింది. జయరామ్‌ను ముందుగానే హత్యచేసి కారులో తరలించినట్లు తెలిసింది.

అంత్యక్రియలు పూర్తి

చిగురుపాటి జయరాం భార్యా పిల్లలు అమెరికా నుండి భారత్‌కు చేరుకున్నారు. జయరాం మృతదేహాన్ని జూబ్లిహిల్స్‌లోని ఆయన నివాసానికి తరలించారు. జయరాం ఇంటికి చేరుకున్న నందిగామ పోలీసులు ఆయన భార్య నుండి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. తనకు, తన పిల్లలకు రక్షణ కల్పించడంతోపాటు జయరాం హత్య చేసిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఆమె పోలీసులను కోరినట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో ఆదివారం మధ్యాహ్నం ఆయన అంత్యక్రియలు జరగాయి.

పరిమళించిన మానవత్వం

- నిండు గర్భిణీని కాపాడిన టీటీఐ
- రైలులోనే పురిటి నొప్పులు
- సకాలంలో వైద్యం
- తల్లీ బిడ్డా క్షేమం



టీటీఐ సనత్

అమరావతి, ఆంధ్రప్రభ: ఆ రైల్వే టీటీఐ చూపిన మానవత్వం వల్ల ఓ నిండు గర్భిణీ ప్రాణం దక్కించుకుంది. అంతేకాకుండా కడుపులోని బిడ్డతో సహా తనూ ఆరోగ్యంగా..క్షేమంగా బయటపడింది. అకస్మాత్తుగా నొప్పులు పడుతున్న ఆ గర్భిణీ పరిస్థితిని గుర్తించిన ఆ టీటీఐలో మానవత్వం పరిమళించింది. నిబంధనలు సహక రించకపోయినా ధైర్యం చేసి, పరిస్థితిని సకాలంలో ఉన్నతాధికారులకు తెలియ జేసి, కాపాడిన వైనం ప్రశంసలందుక ున్నది. ఈ ఘటన అంగ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆదివారం చోటుచేసుకుంది. సప్నదేవి అనే నెలలు నిండిన గర్భిణీ తన ఇద్దరు పిల్లలతోకలిసి, యశ్వంతపూర్ నుంచి భగల్‌పూర్ బయలు దేరింది. బి-2 ఏసీ కోచ్‌లో ప్రయాణిస్తోంది. ఆమె వెంట పెద్దవాళ్ళు ఎవరూ లేరు. కేవలం ఇద్దరు చిన్న పిల్లలు మాత్రమే ఉన్నారు.

రైలు తుని స్టేషన్‌కు చేరుకునే క్రమంలో ఆమెకు ఉన్నట్టుండి.. ప్రసవం నొప్పులు ప్రారంభమయ్యాయి. పరిస్థితిని గుర్తించిన కొంత మంది తోటి ప్రయాణీకులు విషయాన్ని టీటీఐ కె.సనత్‌కు తెలియజేశారు. వెంటనే సనత్ స్పందించి గర్భిణీ పరిస్థితిని తుని కమర్షియల్ కంట్రోలర్‌కు తెలియజేసి, వైద్యం కోసం ఏర్పాట్లు చేయాలని కోరారు. అయితే ఈలోపు రైలు తుని రైల్వేస్టేషన్ దాటిపోయింది. రైలు వైజాగ్ చేరుకునేంతవరకు మహిళలకు ప్రాణ సంకటంగా ఉంటుందని భావించి, విజయవాడ కమర్షియల్ కంట్రోలర్‌ను వైద్యం కోసం రిక్వెస్ట్ చేశారు. వచ్చే స్టేషన్‌లో అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని కోరగా, అయితే అంతదూరం పోయే సరికి ప్రమాదం ఉంటుందని భావించిన ఆయన యలమంచిలి స్టేషన్‌లో 108 అంబులెన్స్‌ను సిద్ధం చేసి ఉంచారు. రైలు యలమంచిలి స్టేషన్‌లో ఆగగానే ఆమెను అంబులెన్స్ ఎక్కించగా, సప్నాదేవి మగ బిడ్డకు జన్మని చ్చింది.తోటి మహిళా ప్రయాణీకులు సహ కరించడంతో ఆమె ప్రసవం తేలికగా జరిగింది. వెంటనే ఆమెను స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించి,చికిత్స చేశారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు. ఎంతో మానవత్వంతో అప్రమత్తంగా వ్యవహరించి,గర్భిణీ, ఆమె కడుపులోని బిడ్డ ప్రాణాలను కాపాడినందుకు టీటీఐ సనత్‌ను విజయవాడ డివిజనల్ మేనేజర్ ఆర్.ధనంజనేయులు,సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ పి.భాస్కర్‌రెడ్డి అభినందించారు.

ఆర్థిక నేరగాళ్ళకు భాజపా వత్తాసు

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళావెంకట్రావు



అమరావతి, ఆంధ్రప్రభ: ఒక ప్పుడు సిద్ధాంతాలకు, విలువలకు ప్రాధాన్యతను ఇచ్చిన భారతీయ జన తా పార్టీ నేడు అవకాశవాదమే అజెం డాగా ఆర్ధిక నేరస్థులను, అవినీతి పరు లను ప్రోత్సహిస్తూ స్వార్ధ రాజకీ యాలకు చిరునామాగా మారిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు తెలియజేశారు. ఆది వారం ఆయన 13 ప్రశ్నలతో కూడిన ఒక బహిరంగ లేఖను బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు రాశారు. ఏకపక్ష నిర్ణయాలతో మోడీ ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దు, జీఎస్‌టీలో పన్నురెట్ల పెంపు, పెట్రోలు, డీజల్ ధరల పెంపు, నిత్యవసర ధరల పెరుగుల తదితర చర్యలతో రుపాయి బలహీన పడటంతోపాటు గత 45 సంవత్సరాల్లో ఎన్నడూ లేనివిధంగా నిరుద్యోగం పెరిగిందన్నారు. అధికార కాంక్షతో ఆర్‌బీఐ, ఈడీ, సీబీఐ, సుప్రీంకోర్టు తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థలు, రాజ్యాంగ సంస్థలను వినియోగించుకొంటూ, కార్యకలాపాల్లో జోక్యం చేసుకొంటూ వాటి ప్రతిష్టను దిగజార్చారన్నారు. ఆంధ్రుల హక్కు అయిన ప్రత్యేకహోదాను, విభజన హామీలను ఇప్పటి వరకు అమలు చేయకుండా, అన్ని రాష్ట్రాలకు ఇచ్చిన విధంగా నిధులను కూడా ఇవ్వకుండా, చివరి బడ్జెట్‌లో కూడా ఏపీ మొండిచేయి చూపిన బీజేపీ పాలకులు ఏ ముఖం పెట్టుకొని ఏపీ పర్యటనకు వస్తారని ప్రశ్నించారు.

చర్చలు విఫలమైతే 6 నుంచి సమ్మె

- ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ దామోదరరావు



అమరావతి, ఆంధ్రప్రభ : ఆర్టీసీ వేతన సవరణ, ఇతర డిమాండ్ల పరిష్కారానికి సంబంధించి సోమ,మంగళవారాల్లో యాజమాన్యంతో చర్చలు జరిగే అవకాశం ఉందని, చర్చల్లో పురోగతి లేకుంటే 6వ తేదీ నుంచి నిరవధిక సమ్మె అనివార్యమని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి, జేఏసీ కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు స్పష్టంచేశారు.ఆదివారం సంఘ కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మె కారణంగా ఏర్పడబోయే పరిణామాలకు యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమ్మెను జయప్రదం చేసేందుకు సోమవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య భవన్‌లో ఉదయం 11 గంటలకు ట్రేడ్ యూనియన్ల నేతలతో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు అధిక సంఖ్యలో ఆర్టీసీ ఉద్యోగులు హాజరుకావాలని జేఏసీ కో కన్వీనర్లు సి.హెచ్. సుందరయ్య, వి.వరహాలనాయుడు పేర్కొన్నారు. సమ్మెకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు మోటారు సైకిల్ ర్యాలీలు నిర్వహించారని చెప్పారు.

రూ.465 కోట్లతో ఎత్తిపోతల పథకం

- ఎన్నికల్లోపే హిందూపురానికి తాగునీరు
- ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ



హిందూపురం, ప్రభ న్యూస్: హిందూపురం నియోజకవర్గం పరిధిలోని చిలమత్తూరు మండలానికి హంద్రీ నీవా నీటిని తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి రూ.465కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ పేర్కొన్నారు. పసుపు కుంకుమ-2 కార్యక్రమం కింద లేపాక్షి, చిలమత్తూరు మండల కేంద్రాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో బాలయ్య ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో ఆయన మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గంలో లేపాక్షి, హిందూపురం రూరల్ మండలాలతోపాటు చిలమత్తూరు మండలంలో కొంత మేరకు మాత్రమే హంద్రీనీవా కాలువ వెళుతోందన్నారు. ఈ క్రమంలో ఎగువన ఉన్న చిలమత్తూరు మండలంలోని దాదాపు 80 గ్రామాలకు హంద్రీనీవా నీళ్లు అందే పరిస్థితి లేదన్నారు. ఈ విషయాన్ని సంబంధిత మంత్రితోపాటు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు. వారి ఆదేశాల మేరకు నీటిపారుదల శాఖ అధికారులు రూ.465కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. త్వరలోనే ఈ పథకానికి టెండర్లు పిలిచేలా నీటిపారుదల శాఖ మంత్రిపై ఒత్తిడి తేవడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఇకపోతే తన హయాంలో రెండు పర్యాయాలు ఘనంగా నిర్వహించిన ఉత్సవాల కారణంగానే నియోజక వర్గం పరిధిలోని లేపాక్షికి అంతర్జాతీయ స్థాయిలో యునెస్కో గుర్తింపు లభించిందన్నారు. అంతేకాకుండా పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని ఆయన వివరించారు.రూ.194కోట్లతో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పైపుల ద్వారా హిందూపురం పట్టణానికి నీళ్లు అందించే పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రెండు, మూడు నెలల్లో ఈ పథకం ద్వారా పట్టణానికి నీళ్లందించడం జరుగుతుందన్నారు. ఇదిలా ఉంటే మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నది. తెలుగుదేశం ప్రభుత్వ మన్నారు.ఈ సందర్భంగా ఆయన సతీమణి వసుంధరకు లేపాక్షి, చిలమత్తూరు మండలాల మహిళలు పసుపు కుంకుమ ఇచ్చి చీరలతో సత్కరించారు. ఆయా మండలాల్లో మహిళా సంఘాలకు బాలయ్య చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రావిళ్ల లక్ష్మి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వెంకటస్వామి, నాయకులు అంబికా లక్ష్మినారాయణ, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ శిరివరం కిష్టప్ప, లేపాక్షి ఎంపిపి హనూక్, జడ్పిటిసి ఆదినారాయణరెడ్డి, ఎంపిడిఓ నారాయణస్వామి, తహశీల్దారు ఆనంద్‌కుమార్, మాజీ ఎంపిపిలు కొండూరు మల్లికార్జున, ఆనంద్, మాజీ జడ్పిటిసి రామాంజినమ్మ, మండల నాయకులు ప్రకాష్, జయప్ప, మారుతిప్రసాద్, చిలమత్తూరు ఎంపిపి నౌజియాభాను, జడ్పిటిసి లక్ష్మీనారాయణరెడ్డి, పార్టీ కన్వీనర్ రంగారెడ్డి, మాజీ ఎంపిపి శివప్ప, టీడీపీ నాయకులు గౌరీశంకర్ పాల్గొన్నారు.

నేడు కేంద్ర ఎన్నికల సంఘంతో జగన్ భేటీ

- ఓటర్ల జాబితా అక్రమాలపై ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సునీల్ అరోరాతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేడు భేటీ కానున్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్న జగన్, సోమవారం ఉదయం గం. 11.30కు చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌తో సమావేశమయ్యేందుకు అపాయింట్మెంట్ తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న జగన్, అధికార పార్టీ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపిస్తున్నారు. ఓటర్ల నుంచి తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా ఉండేవారిని తొలగిస్తూ వచ్చే ఎన్నికల్లో గెలుపొందేందుకు అక్రమమార్గాలు అనుసరిస్తోందని విమర్శిస్తున్నారు. అదే సమయంలో ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఓటర్లు చాలామంది ఉన్నారని, అది కూడా అధికారపార్టీ దుష్టపన్నాగమేనని వైకాపా నేతలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ అంశాలన్నింటిపైనా జగన్ కేంద్ర ఎన్నికల సంఘంతో చర్చించనున్నారని తెలుస్తోంది. ఓటర్ల జాబితా అక్రమాలపై దృష్టి పెట్టి, ఏ ఒక్కరూ జాబితా నుంచి మిస్సవకుండా చూడాలని జగన్ సీఈసీని కోరనున్నారు. అదే సమయంలో రాష్ట్ర పోలీస్ యంత్రాంగం అధికార పార్టీకి కొమ్ముకాస్తోందని, దీనిపైనా ఎన్నికల సంఘం దృష్టిసారించాలని విజ్ఞప్తి చేయనున్నారు.ఎన్నికల సంఘంతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడనున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం రాత్రి ఢిల్లీ చేరుకున్న జగన్ వెంట ఆ పార్టీ రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తాజా మాజీ ఎంపీలు మిథున్‌రెడ్డి తదితరులున్నారు. పార్టీ నేతలతో కలిసి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసే అవకాశముంది.

'10న మోడీ ప్రజా చైతన్య సభ'

అమరావతి, ఆంధ్రప్రభ: ఈనెల 10వ తేదీన ఏపీ పర్యటనకు వస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ గుంటూరులో నిర్వహించే ప్రజా చైతన్య సభలో ప్రసంగిస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీ నారాయణ తెలియజేశారు. గుంటూరులోని బుడం పాడు బైపాస్ వద్ద గల వాజ్‌పేయి ప్రాంగ ణంలో నిర్వహించ నున్న బీజేపీ ప్రజా చైత న్య సభ సత్యమేవ జయతే ఏర్పాట్లను ఆది వారం ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా కన్నా మాట్లాడుతూ ప్రధాని మోడీ ఈనెలలో రెండుసార్లు రాష్ట్ర పర్యటణకు వస్తు న్నారని, 10న గుంటూరులో, 16న విశా ఖలో నిర్వహించే ప్రజా చైతన్య సభలకు ముఖ్య అతిధిగా హాజ రవుతారని చెప్పారు. ఈనెల 4వ తేదీన బీజేపీ జాతీయ అ ధ్యక్షుడు అమిత్‌షా విజయనగరంలో నిర్వ హించే ఉత్తరాంధ్ర శక్తి కేంద్రాల ప్రముఖ్‌ల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజ రవడం తోపాటు బీజేపీ బస్సు యాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ రాష్ట్ర నేతలు సత్యమూర్తి, జమ్ముల శ్యామ్ కిషోర్, అడపా నాగేంద్రం, కొమిరిశెట్టి సాంబశివరావు, పాలేటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

చలిగుప్పెట ఉత్తరకోస్తా

- కొనసాగుతున్న అల్పపీడన ద్రోణి ప్రభావం

అమరావతి ఆంధ్రప్రభ : ఉత్తర కోస్తాలో చలి వాతావరణం కొనసాగుతోంది. శివారు ప్రాంతాలు, ఏజెన్సీలో చలి ప్రభావం ఎక్కువగా ఉండడంతో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. కోస్తాలో మిగిలిన చోట్ల, రాయలసీమలో ఒక మోస్తరు చలి వాతావరణం కొనసాగుతోంది. కళింగపట్నంలో శనివారం 15 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. కోస్తా, రాయలసీమల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఒకటి నుంచి రెండు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. ఒడిశా మీదుగా వస్తున్న చలిగాలుల ప్రభావంతో ఉత్తర కోస్తాలో చలి వాతావరణం కొనసాగుతుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో పొడి వాతావరణం ఉంటుందని అధికారులు తెలిపారు. సంక్రాంతి తర్వాత సాధారణంగా చలి తగ్గుముఖం పడుతుంది. అయితే ఈ ఏడాది పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో చలి ప్రభావం తీవ్రంగా ఉంది. ప్రజలు రాత్రి వేళల్లో చలిగుప్పెట చిక్కుకుని వణుకుతున్నారు. విదర్భ ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం ఆంధ్రా,తెలంగాణాపై కొనసాగుతున్నందున ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. దీనికి ఉత్తరాది గాలులు కూడా తోడవడంతో మరింత ప్రభావం చూపుతున్నాయి. సాధారణ ఉష్ణోగ్రతల కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురుస్తుండడంతో ఆయా జిల్లాల్లో రాత్రి పూట తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో రెండురోజుల పాటు చలిగాలుల ప్రభావం పెరగడంతో పాటు ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోయే అవకాశం ఉందవి వాతావరణశాఖ అధికారులు తెలిపారు.



కల్కి టీజర్ విడుదల

రాజశేఖర్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం కల్కి.. ఆదా శర్మ, నందితా శ్వేతా నాయికలుగా నటిస్తున్నారు. అ..! చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శివానీ శివాత్మిక సమర్పణలో హ్యాపీ మూవీస్ పతాకంపై నిర్మాత సి.కళ్యాణ్ నిర్మిస్తున్నారు. సోమవారం రాజశేఖర్ పుట్టిన రోజు సందర్భంగా కల్కి చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఈ కార్యక్రమం జరిగింది. టీజర్ విడుదల అనంతరం హీరో రాజశేఖర్ మాట్లాడుతూ...గరుడ వేగ చిత్రం తర్వాత ఏ సినిమా చేయాలి అని ఆలోచిస్తున్న సమయంలో ఆరేడు నెలలు కథ కోసం వెతికాను. కథ కుదిరాక ప్రశాంత్ వర్మ కోసం వేచి చూశాం. గరుడ వేగ చిత్రానికి ప్రవీణ్ సత్తారుతో పనిచేస్తున్నప్పుడు ఎంత కొత్తగా అనుభూతి చెందానో...కల్కి చిత్రీకరణలో ప్రశాంత్ వర్మ అంత కొత్తగా అనిపించారు. చాలా రోజుల తర్వాత సి కళ్యాణ్ గారితో సినిమా చేస్తున్నాను. పని దొరకడమే కష్టం. అందుకే పుట్టిన రోజు కూడా చిత్రీకరణ చేస్తున్నాం. నాతో సినిమాలు చేస్తున్న దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు. అన్నారు. నిర్మాత సి. కళ్యాణ్ మాట్లాడుతూ...విభిన్న నేపథ్యంతో సాగే చిత్రమిది. 80వ దశకంలో కథ జరుగుతుంటుంది. ఇంకా 30శాతం చిత్రీకరణ మిగిలి ఉంది. ఏప్రిల్‌లో వరకు షూటింగ్ అంతా పూర్తి చేసి సినిమా విడుదల చేస్తాం. అన్నారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ...నేను నా తొలి చిత్రానికి ముందే జీవిత గారిని కలిశాను. ఈ సినిమా చేద్దామని అప్పుడే నిర్ణయించుకున్నాం. చాలా రోజులు వేచి చూసి ఈ చిత్రాన్ని ప్రారంభించాం. అ..! సినిమాకు ఎంత కష్టపడ్డానో అంతకు పది రెట్లు ఈ సినిమాకు శ్రమించాను. కల్కి క్లిష్టమైన కథేమీ కాదు..అయితే పూర్తి వివరాలతో రచన చేశాం. కల్కి అనేది చాలా శక్తివంతమైన టైటిల్. నా మొదటి సినిమా చాలా మందికి అర్థం కాలేదు. కానీ ఇది అలా కాదు. అన్నీ కుదిరితే రాజశేఖర్ గారి వచ్చే పుట్టిన రోజుకు కల్కి 2 కూడా ప్రారంభిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో జీవిత రాజశేఖర్, శివానీ శివాత్మిక, ఫొటోగ్రాఫర్ దాశరథి శివేంద్ర, ఆర్ట్ డైరక్టర్ నాగేంద్ తదితరులు పాల్గొన్నారు.

మరో ఛాన్స్

తమిళంలో బిజీగా ఉన్న కేథరిన్ థెరిస్సా దక్షిణాది ఇతర భాషల సినీరంగాలను అడపాదడపా చుట్టేస్తోంది. తెలుగులో ఇప్పటికే కొన్ని సినిమాలు చేసిన ఈ భామకు ఇద్దరమ్మాయిలతో, సరైనోడు, నేనే రాజు..నేనే మంత్రి చిత్రాల్లోని పాత్రలు బాగా గుర్తింపునిచ్చాయి. జయ జానకి నాయక చిత్రంలో ఎ ఫర్ ఆపిల్ అంటూ ప్రత్యేక గీతంలో నర్తించి ఆ రకంగా ప్రేక్షకులను అలరింపజేసింది. టాలీవుడ్‌లో ఎప్పుడు అవకాశాలు వచ్చినా నటించేందుకు సిద్ధంగా ఉన్న కేథరిన్‌కు ఇప్పుడు ఒకటికి రెండు అవకాశాలు లభించాయని అంటున్నారు. రవితేజ కథానాయకుడిగా సంతోష్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ చిత్రానికి తెరవెనుక సన్నాహాలు జరుగుతున్నాయని కొద్దిరోజులుగా వినిపిస్తోంది. ఇందులో కేథరిన్‌ను కథానాయికగా ఎంపిక చేశారన్నది కూడా ఆ వార్తలలో ఒక అంశంగా తెలిసింది. ఇదిలావుండగా...తాజాగా విజయ్ దేవరకొండ కథానాయకుడిగా క్రాంతిమాధవ్ దర్శకత్వంలో క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై కె.ఎస్.రామారావు సమర్పణలో కె.ఎ.వల్లభ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ నెం.46గా రూపొందుతున్న ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన నలుగురు హీరోయిన్లు నటించబోతున్నారు. ఇప్పటికే రాశిఖన్నా, ఐశ్వర్యరాజేష్, ఇజబెల్లా కథానాయికలుగా ఎంపిక కాగా ఇంకో హీరోయిన్‌గా కేథరిన్‌ను ఎంపిక చేసినట్లు చిత్రబృందం ప్రకటించింది. దసరా సందర్భంగా ప్రారంభమైన ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా దీనిని తెరకెక్కిస్తున్నారు. గోపీసుందర్ సంగీతాన్ని, జేకే సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు.


కేథరిన్ థెరిస్సా

హారర్ థ్రిల్లర్ అమావాస్య



సచిన్ జోషి, నర్గీస్ ఫక్రి జంటగా నటించిన చిత్రం అమవాస్య. వైకింగ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దర్శకుడు భూషణ్ పటేల్ ఈ చిత్రాన్ని రూపొందించారు. ఫిబ్రవరి 8న అమవాస్య విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రచార కార్యక్రమాలు ముమ్మరం చేశారు. పాటల విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా హీరో సచిన్ జోషి మాట్లాడుతూ.. నేను చాలా కాలంగా హారర్ తరహా చిత్రాలు చేయాలని అనుకుంటున్నాను. దర్శకుడు భూషణ్ పటేల్ నాకు ఈ కథ చెప్పారు. నా గత చిత్రాలకు పూర్తి భిన్నమైన చిత్రమిది. అమవాస్య హారర్ చిత్రాల్లో గుర్తుండిపోతుంది. ఇలాంటి చిత్రాలకు ఆదరణ బాగా ఉంది. కొత్త సాంకేతిక ఉపయోగించి, గ్రాఫిక్స్‌తో సినిమా నిర్మించాం. రెండు భాషల్లో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. అమవాస్య చిత్రానికి కథే ముఖ్యం. నాకు సినిమాలు చేయడమంటే ఆసక్తి. ఎప్పుడూ కథలు వింటూ ఉంటాను. మంచి కథలు దొరికితే సినిమాలు చేస్తుంటాను. అన్నారు.

దర్శకుడు భూషణ్ పటేల్ మాట్లాడుతూ...ఈ చిత్రంలో కథతో పాటు గ్రాఫిక్స్‌కు మంచి ప్రాధాన్యత ఉంటుంది. ఇప్పటిదాకా సినిమాల్లో చూడని సాంకేతికత ఇందులో ఉపయోగించాం. దీనికి మంచి కథ తోడైంది. సినిమా ముగింపు అందరినీ ఆశ్చర్యపరిచేలా ఉంటుంది. అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత సి కళ్యాణ్, హాస్య నటుడు అలీ, ఫైట్ మాస్టర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రియా ప్రకాష్ వారియర్



అమ్మాయిల గోవా ప్రయాణం

స్వతంత్ర్య భావాలున్న నలుగురు అమ్మాయిల జీవితాల్లో ఏం జరిగింది? అనే కథనంతో బ్లాక్ అండ్ వైట్ పిక్చర్స్ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. బాలు దర్శకుడు. హిమబిందు వెలగపూడి నిర్మిస్తున్నారు. త్రిధా చౌదరి, ధన్య బాలకృష్ణ, సిద్ధీ ఇద్నాని, కోమలి ప్రసాద్ ప్రధాన తారాగణం. ఈ సినిమా తొలి షెడ్యూల్ ఇటీవలే హైదరాబాద్‌లో పూర్తిచేశారు. తదుపరి షెడ్యూల్లో కీలక సన్నివేశాలు, పాటలు, పోరాట దృశ్యాలను చిత్రీకరిస్తారు. దీనికోసం చిత్ర బృందం గోవా బయలుదేరింది.

దర్శకుడు బాలు మాట్లాడుతూ ''నలుగురు అమ్మాయిలు ప్రధాన పాత్రధారులుగా ఈ సినిమా రూపొందుతోంది. ఇందులోని ప్రతి సన్నివేశం ఆకట్టుకుంటుంది. వినోదాత్మక కథనం, కథానుగుణంగా వచ్చే మలుపులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి '' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రఘు కుంచె, ఛాయాగ్రహణం: శేఖర్ గంగమోని, సహ నిర్మాతలు: రాధికా శ్రీనివాస్ వెత్తా, ఉమా కూచిపూడి, నిర్మాత: హిమబందు వెలగపూడి, రచన, దర్శకత్వం: బాలు.

చెడ్డీ గ్యాంగ్ ఏం చేసింది?



సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో చెడ్డీ గ్యాంగ్ చిత్రాన్ని తెరకెక్కించారు. శ్రీనివాసరెడ్డి ముఖ్యపాత్రలో నటించగా...అమర్, ప్రదీప్‌వర్మ, ఉదయ్, అభి, సి.టి., ఖాధర్, లక్ష్మీ, శృతి, కావ్య, దేవి, వీణ, జాస్మిన్ ఇతర ముఖ్యపాత్రలను పోషించారు.కనగాల రమేష్‌చౌదరి దర్శకత్వంలో రాజ్ ప్రొడక్షన్స్ ఇంటర్నేషనల్ పతాకంపై విక్కీరాజ్ నిర్మించిన ఈ చిత్రం టీజర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన మా అధ్యక్షుడు శివాజీరాజా మాట్లాడుతూ, తెలుగు సినిమాలో తమిళ నటీనటులు ఉండొచ్చా...లేదా అనేది ప్రస్తుతానికి అప్రస్తుతం. కానీ ఉంటే అనువాద చిత్రం అనే భావన వచ్చేది కాదు. హీరోయిన్లు ఎలాగూ తప్పదు. చిన్న చిన్న నటీనటులను ఇతరులను తీసుకుంటున్నారు. మన వాళ్లకు ప్రాధాన్యం ఇవ్వండి. వాళ్లు కుదరకపోతేనే ఇతర భాషల వారిని తీసుకుని రండి. అలాగే నటీనటులు కూడా ప్రచారానికి వస్తే...సినిమాకు ఉపయోగపడుతుంది. దర్శకుడు రమేష్ చాలా సీనియర్. ఈ సినిమా విజయవంతం కావాలని కోరుకుంటున్నా అని అన్నారు.

దర్శకుడు రమేష్‌చౌదరి మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా అసిస్టెంట్ డైరెక్టర్‌గా, కో-డైరెక్టర్‌గా పని చేస్తున్నాను. ఈ సినిమాతో దర్శకుడిగా మారాను. పదిమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కేరళ అడవులకు టూర్‌కు వెళతారు. అక్కడి కోయవారి నిబంధనలను అతిక్రమించి ఇరుక్కుపోతారు. అక్కడి నుంచి వాళ్లు ఎలా బయటపడ్డారన్నదే ఈ చిత్ర కథాంశం. సింగిల్ లైన్‌లో విక్కీరాజ్‌కు కథ చెప్పాను. అలా ఈ సినిమా మొదలైంది. 125 రోజులు షూటింగ్ చేశాం. మలేషియాలో 25 రోజులు చిత్రీకరణ జరిపాం అని అన్నారు. నిర్మాత మాట్లాడుతూ, కేరళలోని ఎర్నాకుళం, ఇరిట్టి అడవులు, హైదరాబాద్‌లోని సారథీ స్టూడియో, రామోజీ ఫిలింసిటీ, మలేషియాలో ఈ సినిమాను తెరకెక్కించాం. మలేషియాలో తీసిన క్లైమాక్స్ సినిమాకు హైలైట్ అవుతుంది. చిత్రంలో ఐదు పాటున్నాయి. బాలీవుడ్‌కు చెందిన స్నేహాకపూర్ చేసిన ఐటమ్ సాంగ్ యువతను ఆకట్టుకుంటుంది అని అన్నారు. గీత రచయిత లక్ష్మణ్ మాట్లాడుతూ, ఈ చిత్రంలోని అన్ని పాటలనుతాను రాశానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మాలయా మల్లయ్య, సెన్సార్ సభ్యులు ఎం.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమికుల రోజున

ప్రియా ప్రకాష్ వారియర్, రోషన్ నటించిన 'లవర్స్ డే' చిత్రాన్ని ప్రేమికుల దినోత్స,వం రోజునే విడుదల చేస్తున్నారు. మలయాళం, కన్నడ, తమిళ భాషల్లో ఒకే సారి విడుదలవుతోంది. తెలుగులో ఎ.గురురాజ్, సి.హెచ్.వినోద్ రెడ్డి విడుదల చేస్తున్నారు. వారు మాట్లాడుతూ ''లవర్స్ డేలో ఎమిమిది పాటలు ఉన్నాయి. ప్రియా వారియర్ క్రేజ్, పాటలకు వచ్చిన స్పందన సినిమాపై అంచనాలు పెంచాయి. దీనివల్ల వ్యాపారపరంగా కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటికే విడుదలకు అన్ని హంగులు పూర్తిచేసుకున్నాం. ప్రేమికుల దినోత్సవం రోజున మా సినిమాను విడుదల చేస్తున్నాం'' అని చెప్పారు.

ఈ చిత్రానికి సంగీతం: షాన్ రెహమాన్, ఛాయాగ్రహణం: శీను సిద్దార్థ్, కథ, దర్శకత్వం: ఒమర్‌లులు.

చివరివరకూ కూర్చోపెడుతున్న అక్కడొకడుంటాడు



అక్కడొకడుంటాడు చిత్రానికి చక్కటి ప్రేక్షకాదరణ లభిస్తోందని ఆ చిత్రబృందం వెల్లడించింది. శివ కంఠంనేని టైటిల్ పాత్రలో రామ్‌కార్తీక్, శివహరీష్, అలేఖ్య, రసజ్ఞదీపిక హీరోహీరోయిన్లుగా శ్రీపాద విశ్వక్ దర్శకత్వంలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ పతాకంపై కె.శివశంకరరావు, రావుల వెంకటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఫిలించాంబర్‌లో జరిగిన సక్సెస్ మీట్‌లో టైటిల్ పాత్రధారి శివ కంఠంనేని మాట్లాడుతూ, ఈ చిత్రానికి రివ్యూస్ రేటింగ్ చాలాబాగా రావడం మా అందరికీ ఆనందాన్ని కలిగిస్తోంది. చిన్న సినిమా, పెద్ద సినిమా అని కాదు బావున్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. చిత్రం విడుదలైన మొదటి రెండు రోజులు కలెక్షన్లు సాధారణంగా ఉన్నా మౌత్ టాక్‌తో ఆదివారం నుంచి కలెక్షన్లు బాగా పెరిగాయి. భారతీయుడు, అపరిచితుడు చిత్రాల కోవలో అండర్ కరెంట్‌గా డ్రంకన్ డ్రైవ్ పైన సందేశం ఉంటుంది తప్ప ఇది పూర్తి కమర్షియల్ చిత్రం. థియేటర్ల పరంగా సి.కల్యాణ్ మాకు ఎంతో సహకరించారు. దానివల్లే మాకు మంచి థియేటర్లు లభించాయి అని అన్నారు. దర్శకుడు శ్రీపాద విశ్వక్ మాట్లాడుతూ, కొత్తదనానికి పట్టం కడుతున్న నేటి ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా తీసిన చిత్రమిది. చిత్రం చివరివరకూ సస్పెన్స్ కొనసాగుతూ ప్రేక్షకులకు థ్రిల్‌ను కలిగిస్తోంది. మేము ఏదైతే చిత్రం గురించి అనుకున్నామో దానికి చేరువయ్యాం అని అన్నారు. నిర్మాతలలో ఒకరైన రావుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మా బేనర్లో చేసిన మొదటి ప్రయత్నమిది. తెలుగుతో పాటు ఇంగ్లీష్, హిందీ రివ్యూస్ మంచి రేటింగ్ రావడం మాకు ఆనందాన్ని ఇస్తోంది. సినిమా ఆరంభం నుంచి చివరి సన్నివేశం వరకూ ఉత్కంఠగా సాగుతూ ప్రేక్షకులను కూర్చుండ పెడుతోంది. ఇదే మా సక్సెస్ అని అన్నారు. హీరోలలో ఒకరైన శివ హరీష్ మాట్లాడుతూ, ఇలాంటి పూర్తిస్థాయి సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రంలో నటించడం ఆనందాన్ని కలిగిస్తోందని చెప్పగా...పాత్రలకు తగ్గ చక్కటి నటీనటులు ఈ చిత్రానికి కుదిరారని కథానాయికలలో ఒకరైన అలేఖ్య పేర్కొన్నారు.

మరో కథానాయిక రసజ్ఞదీపిక మాట్లాడుతూ, పేరు తెచ్చిపెట్టే మంచి పాత్రలో నటించడం గొప్ప అనుభూతినిచ్చిందని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ దాసరి శ్రీనివాస్, చిత్ర నిర్వాహకులు ఘంటా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


అంబటి రాయుడు 90


ఆఖరి పంచ్

అదిరింది

ఐదో వన్డేలో భారత్ 35 పరుగుల తేడాతో కివీస్‌పై విజయం

సిరీస్ 4-1తో కైవసం | భారత్ 252 ఆలౌట్, | కివీస్ 217 ఆలౌట్

వెల్లింగ్టన్

న్యూజిలాండ్‌తో ఐదో వన్డేలో భారత్ తడబడ్డప్పటికి చివరికి విజ యం సాధిం చింది. బ్యాటింగ్‌లో మిడిలార్డర్, లోవర్ మిడిలార్డర్ రాణించగా బౌలింగ్‌లో లెగ్ స్పిన్నర్ చాహల్ 3/41, పేసర్ 2/35, షమీలు, పాండ్యా 2/50 కీలక వికెట్లు తీయడంతో భారత్ ఈ వన్డేలో గెలుపు తీరం చేరింది.

న్యూజిలాండ్‌తో వన్డేసిరీస్‌ను భారత్ దిగ్విజయంగా ముగించింది. చివరి వన్డేలో 35 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 4-1తో సొంతం చేసుకుంది. న్యూజిలాండ్‌లో భారత్ 1967లో సిరీస్‌లను ఆడటం ప్రారంభించినప్పటి నుంచి (ఆ దేశంలో అన్ని ఫార్మాట్లను కలిపి చూసిన ప్పటికి) ఇదే అతి పెద్ద విజయం. చాహల్, షమీ, పాండ్యాలు బౌలింగ్‌లో రాణించ గా, బ్యాటింగ్‌లో అంబటి రాయుడు, విజయ శంకర్, పాండ్యా, కేదార్‌లు తోడ్పాటును అందించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌ను అంబటి అందుకోగా, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌ను షమీ దక్కించుకున్నాడు.


విజయ్ శంకర్ 45

సిరీస్ ను 4-1తో గెలుచుకుంది. ఆదివారం జరిగిన సిరీస్ చివరి మ్యాచ్‌లో భారత్ 35 పరుగులతేడాతో గెలుపును అందుకుంది. అంబటిరాయుడు 90(113బంతులు, ఫోర్లు-8 సిక్స్-4) పరుగుల తోడ్పాటుతో, భారత ఇన్నింగ్స్ నిలిచింది. మరోవైపు విజయ్ శంకర్ 45(64 బంతులు,ఫోర్లు-4), హార్దిక్ పాండ్యా45(22 బంతులు, ఫోర్లు-2 సిక్స్-5), కేదార్ జాదవ్ 34(45 బంతులు, ఫోర్లు-3) రాణించడంతో భారత్ నిర్ణీత 49.5 ఓవర్లలో 252 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ ముందుంచింది. లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ చివరిదాకా పోరాడినప్పటికి విజయం సాధించలేక పోయింది. ఓపెనర్లు హెన్రీ నికోలస్ 8(15బంతులు, ఒక ఫోర్), కోలిన్ మన్రో 24(19బంతులు ఫోర్లు-2 సిక్స్1) వికెట్లను షమీ పడగొట్టడంతో కివీస్ స్కోరు పది ఓవర్లు ముగిసే సరికి 38/2 గా ఉంది. కీలక బ్యాట్స్‌మన్ రాస్ టేలర్1(4)ను హార్దిక్ పాండ్యా ఎల్బీడబ్ల్యు గా పెవిలియ న్‌కు పం పాడు. క్రీజులో కుదురు కుంటున్న కెప్టెన్ విలియమ్సన్ 39(73బంతులు, ఫోర్లు-3), కేదార్ వేసిన బంతికి ధావన్‌కు క్యాచిచ్చి ఔటయ్యాడు. లాథమ్ 37(49బంతులు, ఫోర్లు-3), గ్రాండో మ్మి11(8బంతులు, ఫోర్లు- 2)లను చాహల్ ఎల్బీడబ్ల్యులుగా ఔట్ చేశాడు. విలియమ్సన్ ఔటయిన తర్వాత క్రీజులోకి వచ్చిన జేమ్స్ నీశామ్ ధాటిగా ఆడుతూ.. కివీస్‌ను గెలుపుకు దగ్గరగా తీసుకెళ్లాడు. నీశామ్ నాటకీయ ఫక్కీలో రనౌట్ కావడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. కేదార్ వేసిన బంతి నీశామ్ ప్యాడ్లకు తగల గా.. వికెట్ కీపర్ ధోనీ, కేదార్‌లు ఎల్బీడబ్ల్యుకు గట్టిగా అప్పీల్ చేశా రు. బంతి క్రీజుకు కొన్ని గజాల దూరంలో ఉంది. ఈ సమయంలో క్రీజు బయట ఉన్న నీశామ్ అవతల పక్క ఉన్న సాంట్నర్‌ను చూస్తూ పరుగు తీసే యోచనలో ఉండగానే బంతిని అందుకున్న ధోనీ వికెట్లకు గురిపెట్టి విసిరి నీశామ్ 44(32 బంతులు ఫోర్లు-4, సిక్స్2) ఇన్నింగ్స్‌కు చరమగీతం పాడాడు. న్యూజిలాండ్ స్కోరు 40 ఓవర్లు ముగిసేసరికి 189/7. ఈ సమయంలో చాహల్ మరోసారి తన చమత్కారం చూపెడుతూ టాడ్ ఆస్లే 10(16 బంతులు ఫోర్1)ను ఎల్బీడబ్ల్యుగా ఔట్ చేశాడు. చాహల్ మొత్తం 10 ఓవర్లు వేసి 41 పరుగులకు 3 వికెట్లు తీశాడు. 43 ఓవర్లు ముగిసేసరికి కివీస్ 204/8. సాంట్నర్ 22(37 బంతులు) వికెట్‌ను హార్దిక్ పాం డ్యా పడగొట్టగా, బోల్ట్ 1(3బం తులు) చివరి వికెట్‌గా భువనేశ్వర్ బౌలింగ్‌లో ఔటయి పెవిలియన్ చేరాడు. మాట్ హెన్రీ 17 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. కివీస్ ఇన్నింగ్స్ 44.1 ఓవర్లలో 217 పరుగుల వద్ద ఆగిపోయింది.

భారత్ టాప్ ఆర్డర్ మళ్లీ విఫలం

అంతకు ముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ తొలి వికెట్ ఐదో ఓవర్లో పడింది. రోహిత్ శర్మ ఈ వన్డేలో కూడా విఫలమయ్యాడు. 2(16బంతులు) పరుగులు చేసి మాట్ హెన్రీ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డయ్యాడు. మరో ఓపెనర్ శిఖర్ ధావన్ కూడా 6(13బంతులు, ఫోర్1) పరుగులు చేసి బోల్ట్ బౌలింగ్‌లో మాట్ హెన్రీకి క్యాచిచ్చి వెనుతిరిగాడు. కెరియర్లో రెండో వన్డే ఆడుతున్న శుభ్‌మన్ గిల్ 7(11బంతులు ఒక ఫోర్) పరుగులు చేసి హెన్రీ బౌలింగ్‌లో సాంట్నర్‌కు క్యాచిచ్చి మూడో వికెట్‌గా ఔటయ్యాడు. ధోనీ1 (6బంతులు) బోల్ట్ వేసిన ఇన్‌స్వింగర్‌ను అంచనా వేయలేక క్లీన్‌బౌల్డ్‌గా ఔట్ కావడంతో భారత్ 10 ఓవర్లు ముగిసేసరికి 4 వికెట్లకు కేవలం 22 పరుగులు చేసింది. టాప్ ఆర్డర్ విఫలమైనప్ప టికి.. మిడిలార్డర్,లోవర్ మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ జట్టును ఆదుకు న్నారు. మరోవైపు ధావన్ ఔట్ తర్వాత వర్చిన అంబటి రాయుడు వరుసగా వికెట్లు పడుతున్నప్పటికి నిలకడగా ఆడుతూ స్కోరును ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నించాడు. అతనికి సహకారం విజయ్ శంకర్‌నుంచి లభించింది. ఇరువురూ కలిసి ఐదో వికెట్‌కు 98 పరుగులు జోడించాడరు.జట్టు స్కోరు 116 వద్ద ఉన్నప్పుడు విజయ్ శంకర్ 45(64బంతులు, ఫోర్లు-4)పరు గులు చేసి రనౌటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన కేదార్ జాదవ్, రాయుడితో జతకలిశాడు. వీరిద్దరూ కలిసి సమయోచితంగా ఆడుతూ స్కోరును పెంచారు. రాయుడు వన్డేల్లో తన పదో అర్ధశతకాన్ని 86 బంతుల్లో పూర్తి చేసుకున్నాడు. స్కోరు 186/5వద్ద రాయుడు 90 పరుగులు చేసి మాట్ హెన్రీ బౌలింగ్‌లో మన్రోకు క్యాచిచ్చి ఔట్‌కాగా హార్దిక్ పాండ్యా క్రీజులోకి వచ్చి కివీ స్ బౌలర్ల దు మ్ము దులిపాడు. ఈ దశ లో కేదార్ జాదవ్ 34(45బంతుల ఫో ర్లు- 3)ను మాట్ హెన్రీ క్లీన్ బౌల్డ్ చేశా డు. తర్వాతి వికెట్‌గా హార్దిక్ పాం డ్యా 45 (22 బంతులు, ఫోర్లు-2 సిక్స్-5) నీశామ్ బౌలింగ్‌లో బోల్ట్‌కు క్యాచిచ్చి వెనుదిరగగా, భువనేశ్వర్ తొమ్మి దో వికెట్‌గా 6పరు గులు చేసి బోల్ట్ బౌలింగ్‌లో టేలర్‌కు క్యాచిచ్చి ఔట వగా, షమీ 1 పరుగు చేసి రనౌటయ్యాడు.చాహల్ ఒక పరుగుతో నాటౌట్‌గా మిగిలాడు. భారత్ 49.5 ఓవర్లలో 252 పరుగులు చేసింది. కివీస్ బౌలర్లలో మాట్ హెన్రీ 4/35, బోల్ట్ 3/39, నీశామ్ ఒక వికెట్‌ను పడగొట్టారు.


చాహల్ 3/41

స్కోరు బోర్డు

భారత్: రోహిత్ శర్మ (బి) మాట్ హెన్రీ 2, శిఖర్ ధావన్ (సి) మాట్ హెన్రీ (బి) బోల్ట్ 6, శుభ్‌మన్‌గిల్ (సి) సాంట్నర్ (బి)మాట్ హెన్రీ 7, అంబటి రాయుడు (సి) మన్రో (బి) మాట్ హెన్రీ 90, ధోనీ (బి) బోల్ట్ 1, విజయ్ శంక ర‌నౌట్(నీశామ్/మన్రో) 45, కేదార్ జాదవ్ (బి) మాట్ హెన్రీ 34, హార్దిక్ పాండ్యా (సి)బోల్ట్ (బి) నీశామ్ 45, భువనేశ్వర్ కుమార్ (సి)రాస్ టేలర్ (బి) బోల్ట్ 6, మహ్మద్ షమీ రనౌట్ (బోల్ట్) 1, చాహల్ నాటౌట్ 0, ఎక్స్ట్రాలు 15 మొత్తం 252 ఆలౌట్ (49.5 ఓవర్లు).
బౌలింగ్: మాట్ హెన్రీ 10-1-35-4, బోల్ట్ 9.5-2-39-3, నీశామ్ 5-0-33-1, గ్రాండొమ్మి 7-0-33-0, కోలిన్ మన్రో 10-0-47-0, మిచెల్ సాంట్నర్ 3-0-18-0, టాడ్ ఆస్లే 5-0-35-0.

న్యూజిలాండ్: కోలిన్ మన్రో (బి) షమీ 24, హెన్రీ నికోలసన్ (సి) కేదార్ జాదవ్ (బి) షమీ 8, కేన్ వలియమ్సన్ (సి) ధావన్ (బి) కేదార్ జాదవ్ 39, రాస్ టేలర్ ఎల్బీడబ్ల్యు (బి) హార్దిక్ పాండ్యా 1, టామ్ లాథమ్ ఎల్బీడబ్ల్యు (బి) చాహల్ 37, జేమ్స్‌నీశామ్ రనౌట్ (ధోనీ) 44, గ్రాండొమ్మి ఎల్బీడబ్ల్యు (బి) చాహల్ 11, మిచెల్ సాంట్నర్ (సి)షమీ (బి) హార్దిక్ పాండ్యా 22, టాడ్ ఆస్లేఎల్బీడబ్ల్యు (బి) చాహల్ 10, మాట్ హెన్రీ నాటౌట్ 17, బోల్ట్ (సి)షమీ (బి) భువనేశ్వర్ 1, ఎక్స్ట్రాలు 3 మొత్తం 217ఆలౌట్ (44.1 ఓవర్లు).
బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 7.1-0-38-1, షమీ 8-0-35-2, హార్దిక్ పాండ్యా 8-1-50-2, విజయ్ శంకర్ 4-0-19-0, యజువేంద్ర చాహల్ 10-0-41-3, కేదార్ జాదవ్ 7-0-34-1,

న్యూజిలాండ్‌లో భారత్ వన్డే సిరీస్‌లు

1975-76 న్యూజిలాండ్ 2-0తో గెలుపు
1980-81 న్యూజిలాండ్ 2-0తో గెలుపు
1993-94 2-2తో డ్రా (4 మ్యాచ్‌ల సిరీస్)
1998-99 2-2తో డ్రా(5 మ్యాచ్‌ల సిరీస్) ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు.
2002-03 న్యూజిలాండ్ 5-2తో గెలుపు (7 మ్యాచ్‌ల సిరీస్)
2008-09 భారత్ 3-1తో గెలుపు (5 మ్యాచ్‌ల సిరీస్) ఒక మ్యాచ్‌లో ఫలితం తేల లేదు
2013-14 న్యూజిలాండ్ 4-0తో గెలుపు (5 మ్యాచ్‌ల సిరీస్) ఒ క మ్యాచ్ టైగా ముగిసింది
2018-19 భారత్ 4-1తో గెలుపు (5 మ్యాచ్‌ల సిరీస్)

క్రీడాప్రభ

రెండో టెస్ట్‌లో విండీస్ విజయం

- 10 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై గెలుపు
- సిరీస్‌లో 2-0తో ఆధిక్యం



నార్త్ సౌండ్(వెస్టిండీస్): వెస్టిండీస్ జట్టు ఇంగ్లండ్‌తో ఆడుతున్న రెండో టెస్ట్‌ను 10 వికెట్ల తేడాతో గెలుచుకుంది. ఈ విజయంతో మూడు టెస్టుల సిరీస్‌ను ఒక టెస్ట్ మిగిలి ఉండగానే 2-0తో గెలుచుకుంది. ఆదివారం ఇంగ్లండ్ ఓవర్ నైట్ స్కోరు 47/1తో రెండో ఇన్నింగ్స్ ఆటను కొనసాగించింది. అంతకు ముందు ఇంగ్లండ్ తన తొలి ఇన్నింగ్స్‌లో 187 పరుగులు చేయగా.. విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 306 పరుగులు చేసింది. దీనితో 119 పరుగుల లీడ్‌ను విండీస్ పొందింది. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ బౌలర్లకు మరోసారి తలవంచింది. ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్‌లో జోస్ బట్లర్ 24 (48బంతులు, పోర్లు-5) మినహా మిగతా బ్యాట్స్‌మెన్‌లో ఎవరూకూడా 20 పరుగుల మార్కును అందుకోలేదు. చివరికి ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 42.1 ఓవర్లలో 132 పరుగులకు కుప్పకూలింది. విండీస్ బౌలర్లలో కీమర్ రోచ్, జాసన్ హోల్డర్ చెరి 4 వికెట్లు తీసి ఇంగ్లండ్ బ్యాటింగ్ పతనంలో కీలక పాత్ర పోషించారు. మరో బౌలర్ ఆజారి జోసెఫ్ 2 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం నామ మాత్రమైన 14 పరుగుల లక్ష్యాన్ని విండీస్ తన రెండో ఇన్నింగ్స్‌లో 2.1 ఓవర్లు ఆడి ఛేదించి విజయాన్ని అందుకుంది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ కీమర్ రోచ్‌కు దక్కింది.

సంక్షిప్త స్కోర్లు:

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 187, రెండో ఇన్నింగ్స్: 132
వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 306 రెండో ఇన్నింగ్స్ 17/0 (2.1 ఓవర్లు)

భారత్- ఐర్లాండ్ మహిళల ఫ్రెండ్లీ హాకీ సిరీస్

ఐర్లాండ్‌పై భారత్ గెలుపు

ముర్సియా(స్పెయిన్): భారత మహిళా హాకీ జట్టు ఆదివారం ఐర్లాండ్‌తో ఆడిన రెండో ఫ్రెండ్లీ మ్యాచ్‌లో 3-0తో గెలిచింది. శనివారం ఆడిన తొలి మ్యాచ్‌ను 1-1తో డ్రాగా ముగించిన భారత్ రెండో మ్యాచ్‌లో ప్రపంచకప్ రజతపతక విజేత ఐర్లాండ్‌ను చిత్తుగా ఓడించింది. ఆట 13వ నిమిషంలో నవజోత్ కౌర్ అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి 1-0 ఆధిక్యాన్ని జట్టుకు అందించింది. 26వ నిమిషంలో దీప్ గ్రేస్ ఎక్కా అందించిన పాస్‌ను రీనా ఖోకర్ గోల్ చేసి స్కోరును 2-0కు పెంచింది. అనంతరం ఐర్లాండ్ క్రీడాకారిణులకు పెనాల్టీ కార్నర్‌లు లభించినప్పటికి భారత డిఫెన్సివ్ క్రీడాకారిణులు వారిని నిలువరించారు. ఆట చివరి 15 నిమిషాల్లో గుర్జిత్ కౌర్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి భారత్ లీడ్‌ను 3-0కు పెంచింది. ఈ సిరీస్‌కు ముందు భారత్ స్పెయిన్‌తో ఆడిన నాలుగు మ్యాచుల సిరీస్‌ను డ్రాగా ముగించింది.

టీ20 సిరీస్ విండీస్ మహిళలదే

చివరి టీ20లో పాక్‌కు ఓదార్పు విజయం

కరాచి: పాకిస్తాన్ మహిళా జట్టు విండీస్ జట్టుతో ఆడిన మూడో టీ20లో 12 పరుగుల తేడాతో విజయం సాధించిం ది. మూడు మ్యాచుల సిరీస్‌లో తొలి రెండు మ్యాచులు గెలిచిన విండీస్ సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన చివరి టీ20 మ్యాచ్‌లో పాకిస్తాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టినిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల కోల్పోయి 150 పరుగులు చేసింది. నిదా దార్ 53(40బంతులు ఫోర్లు-4, సిక్స్-2) చేసిన పరుగులే అత్యధికం. ఓపెనర్ ఒమిమా సొహైల్ 28(24బంతులు, ఫోర్లు-2 సిక్స్1), అలియా రియాజ్ 24(23బంతులు, ఒక ఫోర్, ఒకసిక్స్) చేసి జట్టు స్కోరులో తోడ్పడ్డారు. విండీస్ బౌలర్లలో కరిష్మా రామ్ హరక్ రెండు వికెట్లు తీయగా, షకీరా సెల్మన్, అఫీ ఫ్లెచ్చర్ చెరో వికెట్‌ను దక్కించుకున్నారు. అనంతరం లక్ష్యం ఛేదన ప్రారంభించిన విండీస్ జట్టు తొలి బంతికే ఓపెనర్ కీసియా నైట్‌ను పోగొట్టకుంది. మరో ఓపెనర్ డియాం డ్రాడొట్టిన్ 46(29బంతులు, ఫోర్లు-3 సిక్స్ -4) చేసి పాక్ బౌలర్లను ప్రతిఘటించింది. నటాషా మెక్ లీన్ 26(23బంతులు), చెడియన్ నేషన్ 19(23బంతులు) పరుగు లు చేసినప్పటికి.. మిగతా బ్యాట్స్‌వుమెన్ పాక్ బౌలర్లను ఎదుర్కోవడంలో విఫలమయ్యారు. చివరికి విండీస్ పోరాటం గెలుపుకు మరో 12 పరుగుల దూరంలో ఆగిపోయింది. 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 138 పరుగులు మాత్రమే చేయగలిగింది. పాక్ బౌలర్లలో అనం అమిన్ 3/34,సానా మీర్ 2/21 వికెట్లు తీయగా, ఐమన్ అన్వర్, నిదాదార్, నష్ర సందూ తలో వికెట్‌ను దక్కించుకున్నారు. ఈ గెలుపుతో పాకిస్తాన్ మహిళాజట్టు సిరీస్ క్లీన్ స్వీప్‌నుంచి తప్పించుకుంది. విండీస్ 2011-12లో పాకిస్తాన్‌లో పర్యటించి క్లీన్ స్వీప్ చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు నిదాదార్‌కు లభించింది. ఇక రెండు జట్లు దుబాయ్ వేదికగా ఐసీసీ ప్రపంచకప్ క్వాలిఫయర్స్ పోటీల్లో భాగంగా వన్డే సిరీస్‌లో తలపడనున్నాయి.



సంక్షిప్త స్కోర్లు:

పాకిస్తాన్: 150/6(20ఓవర్లు)(నిదా దార్ 53, ఓపెనర్ ఒమిమా సొహైల్ 28, అలియా రియాజ్ 24 బౌలింగ్:కరిష్మా రామ్ హరక్ 2/20).
వెస్టిండీస్: 138/8(20ఓవర్లు) (డియాండ్రాడొట్టిన్ 46, నటాషా మెక్ లీన్ 26, చెడియన్ నేషన్ 19, బౌలింగ్: అనం అమిన్ 3/34,సానా మీర్ 2/21)

రంజీ ఫైనల్స్- విదర్భ 200/7

నాగ్‌పూర్: రంజీ ఫైనల్ తొలిరోజు ఆటలో విదర్భ ఏడు వికెట్లు కోల్పోయి 200 పరుగులు చేసింది. టాస్ గెలిచిన విదర్భ బ్యాటింగ్ ఎంచుకుంది. విదర్భ బ్యాట్స్‌మెన్‌లో అక్షయ్ వాడ్కర్ 45 పరుగులు చేయగా మోహిత్ కాలె 35, గణేష్ సతీష్ 32 పరుగులు చేశారు. సీనియర్ బ్యాట్స్‌మన్ వసీం జాపర్ 23 పరుగులు చేసి ఉనాద్కత్ బౌలింగ్‌లో స్నెల్ పటేల్‌కు క్యాచిచ్చి వెనుదిరిగాడు. తొలిరోజు ఆట ముగిసే సమయానికి విదర్భ 200 పరుగులు చేసింది. అక్షయ్ కార్నెవార్ 31 పరుగులతో, అక్షయ్ వాక్‌హరే పరుగులేమీ చేయకుండా ఆడుతున్నారు. సౌరాష్ట్ర బౌలర్లలో ఉనాద్కత్ రెండు వికెట్లు పడగొట్టగా, చేతన్ సకారియా, ప్రేరక్ మన్‌కండ్, ధర్మేంద్రసింగ్ జడేజా, కమలేష్ మక్వానా తలో వికెట్‌ను తీశారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.